గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# మే 2013

# కథలు




రో జూలాగే రొమాంటిగ్గా తయారయి ఫినిషింగ్ టచ్ లా పెదాలకి లిప్ స్టిక్ అద్ది, అద్దంలో తనని తానే ముద్దు పెట్టుకుంది మల్లీశ్వరి. 'యింత అందమైన విగ్రహాన్ని చూసినా నిగ్రహంగా ఎలా వుంటున్నాడే మీ ఆయన' అన్న పిన్ని మాటలు గుర్తు కొచ్చాయి. కిశోర్ యిష్టపడే పెళ్ళిచేసుకున్నాడు. అంత కన్నా యిష్టంగా హైదరాబాద్ లో కాపురం పెట్టాడు. కంపెనీకి వెళ్ళే రోజు వరకు నిరంతర ప్రణయానందంలో ముంచేశాడు. సెలవులయి కంపెనీకి వెళ్ళి వొచ్చాకా కథే మారిపోయింది. అలసటతో వస్తున్నాడు. అలరించకుండా నిద్రపోతున్నాడు. కంపెనీలో పని ఒత్తిడి పెరిగినప్పుడేగా ఇలాంటి 'రిలాక్సేషన్' కావాలి! ఊహూ! ల్యాప్ టాప్ ముందే న్యాషీతో మొదలుపెట్టి కునుకులో జారుకుంటున్నాడు.

ఆ రోజు కిశోర్ వచ్చేసరికి - టీవీలో వసంధైన హిందీ సిన్మా లో పాట వస్తోంది. హీరో, హీరోయిన్లు సముద్రం ఒడ్డున వంటిమీద గుడ్డలు వున్నాయో లేవో కూడా పట్టించుకోకుండా రెచ్చి పోతున్నారు. కిశోర్ దృష్టి అటుపడిన వెంటనే, వచ్చిన అవకాశం అంది పుచ్చుకున్నట్లు మల్లీశ్వరి అతని పెదాలతో తన పెదాలు కలిపింది. కాసేపు ఆనందమిచ్చిన తమకం. తమకంలోంచి పుట్టిన వేడి.

కిటికీ లోంచి జాలువారుతున్న వెన్నెల కిరణాలు ఇటుగా చూసి సిగ్గుపడిపోయాయి. కాసేపే... ఆ తరువాత... పాతపాటే... అలసట బాటే!!

మల్లీశ్వరి ప్రతి రోజులా నిరాశపడకుండా, పిన్ని ఫోన్ లో చెప్పిన సలహాను అమలు చేస్తూ - "యివాళ మధ్యాహ్నం టూ నాట్ ఫోర్ లో వుండే శ్రీదేవి అడిగింది మీవారు బెడ్ రూమ్ లో ఎలా వుంటారని... కొత్తగా పెళ్ళయిన వాళ్ళంటే అదో ఆసక్తి వుంటుంది... పెళ్ళయి పిల్లలు పుట్టినా వాళ్ళాయన అస్సలు వదిలి పెట్టడట... నుదురు మీద మొదలయిన ముద్దులయాత్ర చిటికెన వేలు దాకా సాగవలసిందేనట... నన్ను అడిగింది..."మల్లీశ్వరి మాట పూర్తి కాకుండానే కిశోర్ గురక వినిపించింది. మల్లీశ్వరి విరహం గోడల్ని తాకింది!

మర్నాడు -

మళ్ళీ కధ బెడ్ రూమ్ కి వచ్చేసరికి -

"ఒన్ నాట్ సిక్స్ లో వుండే మార్గరెట్ కి అస్సలు సిగ్గులేదు..." అని మొదలుపెట్టే సరికి -

"ఎవరు?" కిశోర్ టక్కున అడిగాడు.

"అదేనండి... ఇవాళ మీరు బైక్ తీస్తుంటే టైట్ జీన్స్ వేసుకుని అందరిని రెచ్చగొట్టేటట్టు ఏదో హిందీ పాట పాడ్తోంది... ఆవిడ... బెడ్ రూమ్ బ్యాడ్ రూమ్ కావాలిట... బ్యాడ్ అంతా బెడ్ మీద గుడ్ గా జరగాలి... అని అడిగితే... నేను సిన్సియర్ గా మీరు అలిసిపోయి పడుకుంటున్నారని చెప్పేశా... హ్యాపీ లేని సంపాదన ఎందుకు?... డబ్బులతో ముద్దులు కౌగలింతలు రావుగా... అసలు తప్పునీది అని అరచి... తలుపులు మూసుకున్న వెంటనే తలపులన్నీ నా మీదే వుండేటట్టు చేసుకోవాలంది..."

ఈ సారి మల్లీశ్వరి మాటలు పూర్తిగా వినకుండా మల్లీశ్వరి మెడ చుట్టూ చేతులు వేసి దగ్గరకి లాక్కున్నాడు. అపార్ట్ మెంట్ లో ఆడవాళ్ళందరకి తను 'చేస్తున్న' పని తెలిసిందనేసరికి 'ఇగో' దెబ్బతింది.

మల్లీశ్వరికి కావలసింది అదే!!

మళ్ళీ మర్నాడు పాత కధే!

మల్లీశ్వరికి విరహం తప్పలేదు!!

ఆ మర్నాడు -

కిశోర్ కంపెనీ నుండి వచ్చి ఫ్రెష్ అయి ఎప్పటిలాగే నిద్రకి ఉపక్రమిస్తుంటే -

మల్లీశ్వరికి ఫోన్ వచ్చింది -

ఫోన్ లో మాట్లాడుతూ మల్లీశ్వరి కాస్త గట్టిగానే -

"...ఆ... ఆ... పిన్ని చెప్పు... నన్నేం చెప్పమంటావ్... కిశోర్ గారు పడుకుంటున్నారు... కాసేపాగి ఫోన్ చేస్తే ఆయన నిద్రకి డిస్టర్బ్ వుండేది కాదు... పాపం... అదొకటే తక్కువ... ఎంత ప్రేమగా చూసుకుంటారని... మా అపార్ట్ మెంట్ లో వాళ్ళు చెప్పడం... వాళ్ళు ఆయనకి ఏం చెప్తారు?... మా దగ్గరుండే నార్త్ ఇండియన్ ఆంటీ అలిసి పోతున్నారంటే 'అచ్చా ఫుడ్ కిలావ్' అని డ్రై ఫ్రూట్స్ యిచ్చింది... కిశోర్ కి వాటిని తినే ఓపిక కూడా లేదు... మలయాళీ ఆంటీ అయితే 'యోగ' నేర్చుకోమను...'సంయోగ యోగం' బావుంటుంది అంది... ఆవిడ దగ్గరకి నన్నే కాదు కిశోర్ ని రమ్మంటోంది... రసం లేక నీరసంగా వుందేమో పళ్ళరసం యిమ్మని యింకోరి సలహా... మా అపార్ట్ మెంట్ లో ఈ విధంగా పాపులర్ అయినామనుకో... కిశోర్ గమనించడం లేదు గానీ ప్రొద్దున్నే జాలి పడ్తున్నారు ఆయన్ని చూసి..." అనేసింది.

కళ్ళలోకి ఎక్క బోయిన నిద్రమత్తు టక్కున కిశోర్ కి ఎగిరిపోయింది. రోజూ కంపెనీకి వెళ్తున్నప్పుడు 'పని'గట్టుకుని అపార్ట్ మెంట్ లో వున్న వాళ్ళందరు 'తననే' చూస్తున్నారా? మలయాళీ ఆంటీ అందుకే నవ్విందా? మార్గరెట్ కొంటె చూపులో అర్ధమదా?... ఒకావిడకి పెద్దావిడని సెంటర్ వరకు లిఫ్ట్ యిస్తే 'ఆల్ ది బెస్ట్' చెప్పడంలో అర్ధమింతవుందా?...

యిలా చాలా చాలా వూహించేసుకుని -

సామూహికంగా అందరూ తనలోని 'మొగాడి' ని ప్రశ్నిస్తున్నట్టుగా ఫీలై పోయాడు - దానికి తోడు - మల్లీశ్వరి బంధుమిత్రులకి కూడా జిల్లాల వారీగా తన 'మగతనం' ప్రతిభ చాటేస్తోందా?... 'నో' అలా జరగకూడదు!!

తనని తాను 'ప్రూవ్' చేసుకోవాలి!!

ఫోన్ లో మాట్లాడుతున్న మల్లీశ్వరిని అమాంతం తనవైపు లాక్కున్నాడు - ఫోన్ లో అప్పుడే పిన్ని అంటోంది -

"తన భార్య మాట ఎలా వున్నా పక్క ఆడవాళ్ళు తన గురించి 'తక్కువగా' వూహించడం ఏ మొగాడు తట్టుకోలేడు..." అని ఆతరువాత -

మల్లీశ్వరి ఫోన్ కట్ చేసే అవకాశం కిశోర్ యివ్వలేదు. అక్కడి శబ్దాలకి పిన్ని మురిసిపోయి సీన్ వూహించుకుని ఆనందపడింది. పక్కింటి వాళ్ళకి చెప్పకుండా చెప్పేనని చెప్పమన్నా పిన్ని సలహాని రహస్యంగా దాచుకుని కిశోర్ కౌగిలలో కరిగిపోయింది మల్లీశ్వరి!!!




బెం గుళూరు లో ని MNC లో జాబ్ చేస్తున్నాను. ఇంట్లో వాళ్ళందరూ హైదరాబాద్ లో ఉండటం వల్ల తరచూ బెంగుళూరు టు హైదరాబాద్ ప్రయాణం నాకు అలవాటే. ప్రయాణం లో అలసట తెలియకుండా ఉండడానికి నేను పుస్తకాలను ఎక్కువగా చదువుతూ ఉంటాను. ఈ సారి ప్రయాణం లో నాతో పాటు రవీందర్ సింగ్ రచించిన 'ఐ టూ హాడ్ ఎ లవ్ స్టొరీ' అనే బుక్ చదువుదామని తెచ్చుకున్నాను. ఇంతలో ఎవరో 'హాయ్' అని పలకరించారు. ఆ పిలుపు వినగానే పుస్తక పఠనం లో నిమగ్నమయిన నేను వెంటనే బయటపడ్డాను.

'హాయ్' అని బదులిచ్చాను. అందంగా ఉంది. కర్లీ లూస్ హెయిర్ గాలికి ఊయలలూగుతూ ఉంది. మొన్నొచ్చిన సినిమాలో సమంతకి ఈ అమ్మాయికీ చాలా పోలికలు ఉన్నాయి. బొట్టు పెట్టుకోలేదు. చీర కట్టుకుంది. వాయిస్ కూడా హస్కీ వాయిస్.

'హాయ్ అండి' అని బదులిచ్చాను. నా పక్క సీటు కి వచ్చిన అమ్మాయి అనుకుంట. 'ఐ యాం అనిత. సీట్స్ ఎక్స్చేంజి చేసుకుందామా. నాకు విండో దగ్గర కూర్చోవడం ఇష్టం. బుక్ చేసుకుంటున్నప్పుడు కుదరలేదు. సరేలే బస్సులో అడిగి అడ్జస్ట్ చేసుకోవచ్చు కదా అనుకున్నాను' అని అంది.

సాధారణం గా ఎవరైనా అమ్మాయి ఇంత అందంగా రిక్వెస్ట్ చేస్తే ఎవరు కాదనగలరు. ఖలేజా సినిమాలో మహేష్ బాబు డైలాగు గుర్తొచ్చింది. 'ఏం అడిగిందండి' అని సునీల్ అనగానే, 'కదా బస్ ఉండుంటే నేనే లిఫ్ట్ ఇచ్చేవాడిని.' అనే రేంజ్ లో మహేష్ బాబుని పడేసిన అనుష్కలా అడిగితే సామాన్య మానవుణ్ణి నేను మాత్రం కాదనగలనా.

కట్ చేస్తే సీట్స్ ఎక్స్చేంజి అయిపోయాయి. సాధారణం గా అమ్మాయిలందరూ ఒంటరిగా ప్రయాణం చేసేటప్పుడు లేడీస్ పక్కనుండే సీట్స్ ని బుక్ చేసుకుంటారు. మరి ఈ అమ్మాయి ఏదైనా హడావిడిలో ఉందేమో.

ఇప్పటివరకు నేను ఒంటరిగా చేసిన ప్రయాణాలలో అబ్బాయిలే నా పక్క సీటులో ఉండేవారు. అమ్మాయి అందులో సమంత లాంటి అమ్మాయి నా పక్కన కూర్చోవడం ఇదే మొదటిసారి.

ఆ అమ్మాయితో మాట్లాడాలనిపించింది కానీ అమ్మాయిలతో మాట్లాడే అలవాటు పెద్దగా లేనందువల్ల ఎలా మాట్లాడాలో తెలియలేదు . పుస్తకం చదువుదామని అనుకున్నా ఇది ఇదివరకటిలా బోర్ కొట్టే ప్రయాణం కాదు కదా నా మనసు పుస్తకం పై కి వెళ్ళట్లేదు. ఎలాగోలా మనసుకి సర్ది చెప్పుకుని నేను పుస్తకం చదవడం ప్రారంభించాను. ఇంతలో ఆ అమ్మాయే నాతో మాటలు కలపడానికి ప్రయత్నించింది.

'ఏ బుక్ చదువుతున్నారు, ఈ బుక్ చదువుతున్నారా' అని ఆశ్చర్యం గా అడిగింది.

'అవునండి, ఎందుకలా అడిగారు' అని అడిగాను.

'అదేం లేదండి, ఈ నవల్ లో హీరోయిన్ చనిపోతుంది. ట్రాజెడీ లవ్ స్టోరీ' అని చెప్పింది.

'చెప్పేసారా, ఎవరైనా కథ చివరలో ఏమవుతుందో ముందే చెప్పేస్తే నాకు ఆ కథ పై ఇంట్రెస్ట్ పోతుంది' అని అన్నాను.

'అయ్యయ్యో, మీకు ఇంట్రెస్ట్ పోగొట్టాలని అలా చెప్పలేదు. వయసులో ఉన్నారు. ఇలాంటి ట్రాజెడీ లవ్ స్టోరీస్ ఎందుకు చదవడం అని అనిపించి ముందే చెప్పేసాను, ఐ యాం సారీ' .

'మరి మీరు కూడా వయసులోనే ఉన్నారు. మీరు చదివారు కదా'.

'లేదండీ, నేను చదవలేదు. ఏదైనా బుక్ చదివే ముందు నేను రివ్యూస్ చదువుతాను. అలా తెలిసింది. మీకెలాగైతె కథ ముందుగా తెలిసిపోతే కంటిన్యూ చెయ్యలేరో అలాగే నాకు ట్రాజెడీ కథలు చదవడం ఇష్టం లేదు.' అని చెప్పింది.

అందంగా లేనా? అసలేం బాలేనా? నీ ఈడు జోడూ కాననా అనే పాట వినబడుతోంది. వెంటనే ఆమె ఫోన్ లిఫ్ట్ చేసి 'హాయ్ రా, ఎలా ఉన్నావు? హా వస్తున్నా. బస్సులోనే ఉన్నా. ఇంకా నా మీద కోపం పోలేదారా. యు ఆర్ సో స్వీట్ కదూ. హాయిగా నిద్రపో. ఐ విల్ బి దేర్ బై టుమారో మార్నింగ్, గుడ్ నైట్, స్వీట్ డ్రీమ్స్' .

ఆమె ఫోన్ లో మాట్లాడుతున్నంత సేపు నాకు టెన్షన్. కొంపదీసి ఈమెకి ఆల్రెడీ బాయ్ ఫ్రెండ్ ఉన్నాడా. అలా అయితే నా పరిస్థితి ఏంటి.

ఇంతలోనే నాకు నేనే సర్దిచేప్పుకోవడం ప్రారంభించాను. 'అయినా ఈ ప్రేమలు దోమలూ మా ఇంటా వంటా లేవు. హాయిగా అమ్మా నాన్నా తెచ్చిన సంబంధం చేసుకోవాలనే ఇప్పటివరకు నా ఉద్దేశ్యం. అరె అదేంటి. ఇప్పటివరకు అంటే ఇప్పట్నించి నా ఉద్దేశ్యం మారిందా. ఏమో అంతా దేవుడి చేతిలోనే ఉంది.'

'ఆ ఫోన్ లో మాట్లాడినది ఎవరో తెలుసుకుంటే సమస్య తీరిపోతుంది. కాని ఎలా అడగను. రెండు ముక్కలు సరదాగా మాట్లాడగానే నేను ఫోన్ లో ఎవరితో మాట్లాడుతున్నానో తెలుసుకునేంత చనువు వచ్చిందా అని గనక ఆ అమ్మాయి రివర్స్ అయితే... ' అని ఆలోచనలతో సతమవుతుండగా ఆ అమ్మాయి నా మనసులో మాట కనిపెట్టినట్లుగా ముసి ముసిగా నవ్వుతోంది.

'ఏం అయిందండీ. ఇంత సేపూ బాగానే ఉన్నారు కదా, ఎనీ ప్రాబ్లం' అని తనదిన స్టైల్ లో హస్కీ వాయిస్ లో అడిగింది.

'అబ్బెబ్బే, ఏం లేదండి. మీరెక్కడ దిగాలండి బెంగుళూరు లో' అని టాపిక్ డైవెర్ట్ చెయ్యాలి అన్నట్టుగా అడిగాను. అవసరమైన ఇన్ఫర్మేషన్ వస్తుంది కూడా

'హెబ్బాల్ లో దిగాలండి. మై ఫ్రెండ్ పిక్స్ అప్ మీ ఫ్రం దేర్' అని చెప్పింది. అదే తెలుగులో చెప్పుంటే 'నా ఫ్రెండ్ నన్ను పిక్ అప్ చేసుకుంటుంది లేదా చేసుకుంటాడు అనే సరికి నాకు క్లారిటీ వచ్చేది కదా. ఇలాంటి సందర్భాల లో నే నాకు ఇంగ్లీష్ ని కనిపెట్టిన వాడంటే పిచ్చి కోపం'

'ఓహ్ ఫ్రెండ్, హి హి హి' అని బ్రహ్మానందం స్టైల్ లో ఒక నవ్వు నవ్వాను. ఇంకా డీటెయిల్స్ అడిగితే నా మీద అనుమానం రావొచ్చు

పొడి పొడి డైలాగు ల తో నే అమ్మాయిలు పడిపోతారని మహేష్ బాబు సినిమాల ద్వారా నేర్చుకున్నాను. కానీ నాకు త్రివిక్రమ్ అనే రైటర్ లేడుగా. ఒక వేళ అటు ఇటు గాని అయితే, నాకు ఇంట్రెస్ట్ లేదనుకుని తను తప్పుకోవచ్చు.

నో నో నో.. నా స్టైల్ నే ఫాలో అవుదామని ప్రయత్నించాను. ఎలాగైనా మాటలు కలపాలి. సినిమాల గురించయితే నేను నిర్విరామంగా గంట సేపు మాట్లాడగలను. 'ఒరేయ్ అప్పుడు వన్ సైడ్ కాన్వర్సేషన్ అవుతుందిరా' అని నా మనసు హెచ్చరించిది. ఆ హెచ్చరికను గుర్తుంచుకుని వన్ సైడ్ కాకుండా జాగ్రత్తపడాలి అనుకున్నాను.

'మీరు రీసెంట్ గా చుసిన సినిమా ఎంటండి' అని అడిగాను

'ఏంటోనండి సినిమాలంటే ఇంట్రెస్ట్ పోతోంది. ఇదివరకటిలా సినిమాల పై న ఆసక్తిఉండట్లేదు. మాక్సిమం డౌన్లోడ్ చేసుకుని చూస్తుంటాను. రీసెంట్ గా అంటే 'ఎటో వెళ్ళిపోయింది మనసు' చూసాను. ఏంటో బోరింగ్ గా అనిపించింది' అని అంది.

'ఓహ్ ఆ సినిమా చూసారా. హీరోయిన్ సమంత బాగా నటించింది కదా. కొంచెం మీకు సమంత కి దగ్గర పోలికలు ఉన్నాయండి' అని అనగానే ఆమె లో ని అమితానందం గమనించాను. ఒక్కసారిగా సమంత నటించిన సినిమాలో తనని తానూ ఊహించుకుందేమో ఎంత సేపటికి ఆలోచనలోనే ఉంది.

'హలో హలో' అని చిటికేసి లేపాను

'ఓహ్! సారీ...చాలా మంది ఈ కాంప్లిమెంట్ ఇచ్చారండి. యు నో వన్ థింగ్? 'ఏమాయ చేసావే' సినిమా తరువాత నుండి నేను జీన్స్ వేసుకోవడం మానేసాను తెలుసా. ఓన్లీ శారీస్.'

గౌతం మీననూ. నీకేంటి సినిమాలు తీసేసి హ్యాపీ గా ఉంటావు. ఇక్కడ చూడు సినిమా సినిమా కి హీరోయిన్ లా తయారయి అమ్మాయిలందరూ ఇలా అబ్బాయిలని పడేస్తున్నారు. నువ్వొచ్చి చెప్తావా నా ప్రేమ సంగతి. అని మనసులో ఆ సినిమా తీసిన డైరెక్టర్ ని తిట్టుకున్నాను.

అలా మేము మాట్లాడుకుంటూ మాట్లాడుకుంటుండగా మెల్లగా నిద్రపట్టేసింది.

తెల్లారి లేవగానే ఆ అమ్మాయిని విడిచి వెళ్లాలే అని బాధ. పేస్ బుక్ అకౌంట్ తీసుకుందామని అనుకుంటుండగా బస్సు బెంగుళూరు లో హేబ్బాల్ వద్ద ఆగింది.

బస్సు దిగాను

ఇంతలో

"ఏం చక్కని మందారం      ఇది ఎనిమిది దిక్కుల సింధూరం

ఏం మెత్తని బంగారం ఇది మనసున రేపెను కంగారం

ఏం కమ్మని కర్పూరం ఇది కన్నెగ మారిన కాశ్మీరం

ఏం వన్నెల వయ్యారం ఇక తియ్యని ప్రేమకి తయ్యారం "

అనే రింగ్టోన్ వినపడింది. నన్ను దాటుకుంటూ అచ్చు గబ్బర్ సింగ్ సినిమా లో ని శృతి హస్సన్ లా ఒక అమ్మాయి నడుచుకుంటూ వెళ్ళింది. ఆ అమ్మాయి వెనకాతలే నా పాదాలు నన్నడగకుండానే కదిలాయి

దిస్ ఈస్ ఎన్ ఎండ్ లెస్ జర్నీ




వై కుంఠంలో శ్రీమహా విష్ణువు పూర్తిగా యోగనిద్రలో ఉన్నాడని నిర్ణయించుకుని శ్రీమహాలక్ష్మి శేషతల్పం నుండి కిందకు దిగింది. శ్రీమహా విష్ణువు నిశ్చలంగా యోగనిద్రలో ఉన్నాడు. లక్ష్మీదేవి ఎప్పటినుంచో ఒక పని చేయాలని అనుకుంటోది. కాని చాలా పనుల వత్తిడి వలన ఆ పని చేయలేకపోయింది. అందుకని ఈరోజు ఆ పని చేయాలని నిశ్చయించుకుని, నెమ్మదిగా బయటకు వచ్చింది.

పనివాళ్ళని పిలిచి ఆయుధాగారం తెరిపించింది. ఈ మధ్య యుద్ధాలు లేక ఆయుధాలను విష్ణుమూర్తి పూర్తిగా వాడటం మానేశాడు. అందుకని అవి అలాగే చాలా కాలంగా దుమ్ము పట్టి ఉండిపోయాయి. లక్ష్మీదేవి ఇప్పుడు వాటిని శుభ్రం చేసే పనిని చేపట్టింది. ఒక్కొక్క ఆయుధం లక్ష్మీదేవి తీసి ఇస్తూ ఉంటే పనివాళ్ళు వాటిని శుభ్రం చేస్తున్నారు. లక్ష్మీదేవి ఒక ఆయుధం తీసింది. వంకీలు వంకీలు తిరిగి ఉన్న ఆయుధం అది. ఆ ఆయుధానికి ఉన్న ఒక్కొక్క వంపులో ఒక్కొక్క చర్య నిక్షిప్తమై ఉంది.

లక్ష్మీదేవికి ఆ ఆయుధం చాలా ఇష్టం. దానిని జాగ్రత్త అంటూ పనివాడికి ఇచ్చింది. ఒక్కొక్కసారి అతి జాగ్రత్త కూడా అతి ప్రమాదకరమే. పనివాడు జాగ్రత్తగా తీసుకుంటున్నాడు. కాని వాడికి ఆ ఆయుధం బరువుపై అంచనా లేదు. అది చాల బరువుంది. అకస్మాత్తుగా చేతినుండి జారిపోయింది. అది జారిపోకుండా పట్టుకోవాలని లక్ష్మి విసురుగా క్రిందకు వంగింది. కాని ఆమె చేయి తగిలి ఇంకా వేగంగా క్రిందకు జారి, ఆ ఆయుధంలోని ఒక ఒంపులో లక్ష్మీదేవి చేయి తగిలింది. ఆ ఆయుధం విసురుగా వైకుంఠం నుండి వేగంగా బైట పడిపోయి, అంతరిక్షంలోకి జారిపోయింది. లక్ష్మీదేవి భయంతో వణికిపోయింది. ఆ జారిన ఆయుధం నారాయణాస్త్రం.

భవిష్యత్ బ్రహ్మ ఐన ఆంజనేయస్వామి హిమాలయాలలో ఒక పర్వతప్రాంతంలో తపస్సులో ఉన్నాడు. అకస్మాత్తుగ ఉలిక్కిపడ్డాడు. నుదిటిమీద చెమట పట్టింది. అదాటున లేచి నిలుచున్నాడు. భయంతో కంపించిపోయడు. విశ్వం అంతరించిపోతుందా? ఇదే అనుభవం విశ్వామిత్రుడికి కూడా కలిగింది. కమండలం పట్టుకుని ఏం చేయాలో తెలియక ఆందోళన పడ్డాడు. దివ్య దృష్టితో ఆంజనేయస్వామితో మాట్లాడాడు. ఆంజనేయస్వామికూడా ఏమి చెప్పలేని పరిస్థితి. ఆయన ఆందోళన నారాయణాస్త్రం జారిపోయినందుకు కాదు. అది అనేక లోకాలు దాటుకుంటూ తిన్నగా భూమండలం వైపు దూసుకు వస్తోంది.

హనుమంతుదు లక్ష్మీదేవితో దివ్యశక్తులతో సంభాషించాడు. లక్ష్మీదేవి, “నాయనా హనుమా ఆ నారాయణాస్త్రం తిరిగి వెనక్కు పిలిపించగల శక్తి శ్రీ మహావిష్ణువుకే వుంది. కాని ఆయన యోగ నిద్రలో ఉన్నారు. ఏదో ఒకటి చేసి ఈ ఆపదనుండి కాపాడు నాయానా” అంది. హనుమంతుదు తన దివ్యశక్తులతో భూమిమీద చిరంజీవులైన సప్తఋషులు, పరశురాముడు, మార్కండేయుడు మొదలైనవారితో చర్చలు మొదలుపెట్టాడు.

చాలా శక్తిమంతమైన టెలిస్కోప్ లో అంతరిక్షాన్ని పరిశీలిస్తున్న ప్రొ. నారాయణమూర్తి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. చాలా చాలా వేగంగా ఒక వస్తువు భుమివైపు దూసుకు వస్తోంది. వెంటనే తన అనుచరుల్ని అలెర్ట్ చేసాడు. ఆ ఆబ్జెక్ట్ యొక్క సమాచారం సంపాదించాడు. అవి చాలా హైలి రేడియో ఆక్టివ్ సబ్ స్టాన్స్. అది ఒక గైడెడ్ మిసైల్ లాగా ఉంది కాని హైలి కాంప్లికేటెడ్ ప్రోగ్రాండ్ వెపన్. కాని అది స్లీపింగ్ మోడ్ లో ఉంది. ఏది ఏమైన అది భూమి వాతావరణంలో వస్తే దాని రేడియో ఏక్టివ్ అఫెక్ట్ కి

భూమి నాశనం అయిపోయేటట్లుంది.

అదే టైంకి ప్రపంచంలో అన్ని స్పేస్ రీసెర్చ్ సెంటర్స్ అలెర్ట్ అయిపోయాయి. సైంటిస్ట్ లు అందరు ఒకరికొకరు ఆన్ లైన్ లో అందుబాటులోకి వచ్చారు. ప్రొ. నారాయణమూర్తి ఆ ఆబ్జెక్ట్ యొక్క సమాచారాన్ని అందరికి వివరించాడు.

యుగాంతం రానున్నదా ???????

అక్కడ హిమాలయాల్లో హనుమంతుడు, పరశురాముడు మొదలైనవాళ్ళంతా ఒక నిర్ణయానికి వచ్చారు. నారాయణాస్త్రం శక్తితో పోలిస్తే వాళ్ళ శక్తి చాలా తక్కువ. దాన్ని వెనక్కి పంపడం తరవాత సంగతి, కనీసం దాన్ని వేరే దిశకు తిప్పలేని పరిస్థితి. కాని ఈ మహానుభావులు అందరు కలిసి వారి శక్తులను ధారపోసి నారాయణాస్త్రం యొక్క తీవ్రత, ఉష్ణోగ్రత తగ్గించగలిగారు. నారాయణాస్త్రం భూమి వాతావరణంలోకి ఎక్కువ బీభత్సం సృష్టించకుండా ప్రవేశించింది.

టెలిస్కోప్ లో పరిశీలిస్తున్న ప్రొ. నారాయణమూర్తి చాలా ఆశ్చర్యపోయాడు. నిర్ఘాంతపోయాడు. సరిగ్గా భూ వాతావరణంలోకి ప్రవేశించడానికి ముందే ఆ గైడెడ్ మిస్సైల్ ఎలా చల్లబడింది? అస్సలు అర్థం కాలేదు. అన్ని రాడార్స్ ఫోకస్ చేస్తూ ఆ ఆబ్జెక్ట్ గురించి తెలుసుకున్న సమాచారం చూస్తూ ఉంటే రాబోయే కొన్ని వేల తరాల ముందు టెక్నాలజి అందులో నిక్షిప్తమై ఉంది అని తెలుస్తోంది. కాని ఆందోళనకరమైన విషయం ఏమిటంటే కంప్యూటర్స్ చూపిస్తున్న ప్రకారం ఆ ఆబ్జెక్ట్ భూమిని తాకే ప్రదేశం హైదరాబాద్.

ఢిల్లీలో ప్రధానమంత్రి త్రిదళాధిపతులతో కలిసి రాష్ట్రపతిని అత్యవసరంగా కలిసారు. పరిస్తితిని వివరించారు. రాష్ట్రపతి గొంతులో భయం, ఆందోళన. "మానవజాతి అంతరించిపోతుందా?" ఆర్మీ, నేవి, ఏర్ ఫోర్స్ లను అలర్ట్ చేశారు. హైదరాబాద్ వైపు వార్ ప్లేన్స్ దూసుకు వెళ్ళాయి.

కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతి. డిసెంబర్ అర్ధరాత్రి కాదది మండు వేసవి మిట్టమధ్యాహ్నం అయింది. కొన్ని వందల డిగ్రీల ఉష్ణోగ్రత గల వస్తువు ఓజోన్ పొరను చీల్చుకుంటూ భూమి మీదకు పడుతోంది. అది వేగంగా భూమి మీద ఆసియా ఖండంలో భారత దేశంలో, ఆంధ్రప్రదేశ్ లో, హైదరాబాద్ లో బుద్ధుడి విగ్రహం ఉన్న హుసేన్ సాగర్లో ఒక్కసారిగా పడిపోయింది. ఆ వేడికి టాంక్ బండ్ నీళ్ళన్ని ఆవిరి ఐపోయాయి. సంజీవయ్య పార్క్ లో చెట్లన్ని మాడి పోయాయి. హైదరాబాద్ ఒక్కసారిగా అట్టుడికి పోయింది. కొంచెంసేపటికి నారాణాస్త్రం చల్లబడింది.

ప్రొ. నారాయణమూర్తి ఆ ఆబ్జెక్ట్ యొక్క సమాచారాన్ని క్రోడీకరిస్తున్నాడు. అది స్లీపింగ్ మోడ్ లో ఉన్న వెపన్. దాని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ పూర్తిగా అర్థం కావడం లేదు. తెలిసీ తెలియనట్లుగా అర్థం అయి, అవనట్లుగా ఉంది. అది అంత భయంకరమైనది కాదనిపిస్తోంది. దాన్ని ఏక్టివేట్ చేస్తే ఏ మేరకు ప్రళయం సృష్టిస్తుందో అని భయంగానూ ఉంది.

హనుమంతుడు, సప్తఋషులు, పరశురాముడు, మార్కండేయుడు కలిసి ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసాడు. ప్రపంచం లోని అందరు ప్రజలు ఒక నినాదాన్ని పలకాలి. తిరిగి నారాయణాస్త్రం లో కదలిక రావాలి. తిరిగి వైకుంఠం చేరాలి.

చక చకా పనులు జరిగాయి. అన్ని మత సంస్థలు కలిసాయి. అన్ని ఆధ్యాత్మిక సంఘాలు ఏకం అయ్యాయి. హనుమంతుడు ముందుండి అంతా నిర్వహించాడు.

హనుమంతుడి నోటి నుండి ఒక మాట, ఒక నినాదం, ఒక మంత్రం వెలువడింది. ఆ మంత్రాన్ని ప్రపంచ ప్రజలందరు ప్రతిధ్వనించారు. "ఓం నమో శ్రీ నారాయణాయ"

గాలిలో, నీటిలో, ఆకాశంలో మొత్తం నారాయణ మంత్రం నిండిపోయింది. భూమిలో ఒక రకమైన వెలుగు పుట్టి స్వయంప్రకాశంలాగా తయారవుతోంది. అంతరిక్షంలో భూమి మెరిసిపోతున్న ఒక నీలమణిలా అయింది.

ప్రొ. నారాయణమూర్తికి ఆ మిసైల్ టెక్నోలజి పూర్తిగా అర్థం కాకపోయినా కొంతవరకు అర్థం అయింది. ఆయన మిగిలిన సైంటిస్టులతో చర్చలు జరిపాడు. అందరూ దాన్ని భూమి నుండి బైటకు పంపడమే ముఖ్యమని నిర్ణయించారు. ఆ బాధ్యతను ప్రొ. నారాయణమూర్తికి అప్పగించారు.

పూర్తిగా ఎండిపోయిన టాంక్ బండ్ లో బుద్ధుడికి దగ్గరగా ఒక రాకెట్ లాంచింగ్ పాడ్ ఏర్పాటు చేసారు. దాని మీదికి కంప్యూటర్స్ మరియు రోబోట్స్ సాయంతో ఆ ఆబ్జెక్ట్ ని ఎక్కించారు. రోబోట్స్ సాయంతో నారాయణాస్త్రంలోని మెనుని ఆపరేట్ చేయడానికి ట్రై చేస్తున్నాడు. ఎక్కడో ఒక ఆశ.

అక్కడ వైకుంఠంలో లక్ష్మీదేవి మనస్సులోనే నారాయణ మంత్రం జపిస్తూ భూమి మీద జరుగుతున్నది గమనిస్తోంది. శ్రీ

మహావిష్ణువు యోగ నిద్ర భంగం కాకూడదు అనుకుంటోంది.

ఇక్కడ భూమండలం మీద నారాయణ మంత్రం ఉచ్చాటనతో భూమిలో ఒకరకమైన తేజస్సు వచ్చింది. నారాయణాస్త్రంలో ఒక కదలిక వచ్చింది.

ప్రొ. నారాయణమూర్తి ఆ మిసైల్ లో మెయిన్ మెనూ ఒపెన్ చేసాడు. మెనూ లో అంశాలు చూస్తూ ఉంటే మతి పోయింది. “మూవ్ టార్గెట్ హోం” దగ్గర ప్రెస్ చేసాడు. ఆ ఆబ్జెక్ట్ ఒక్కసారిగా పైకి ఎగిరింది. మరుక్షణం మాయమైంది.

హనుమంతుడు నారాయణాస్త్రంని లక్ష్మీదేవి సహాయంతో వైకుంఠంవైపు మళ్ళించగలిగాడు. చివరకు నారాయణాస్త్రం వైకుంఠం చేరింది. లక్ష్మీదేవి గబ గబా దాన్ని తిరిగి ఆయుధాగారంలో జాగ్రత్త పరిచి శ్రీ మహావిష్ణువు దగ్గరికి వచ్చింది.

శ్రీ మహావిష్ణువు యోగనిద్రలోనే లక్ష్మీదేవికి అర్ధం అయి అవనట్లుగా చిన్నగా నవ్వాడు.




'సు మ' మనసు ఈవేళ చిరాగ్గా వుంది. హు.. కమల్ చూడు ఈ మధ్య ఎలా తయారయ్యాడో! పెళ్ళైన కొత్తలో తన చుట్టూ తిరగడానికి టైం ఎలా వచ్చిందో, అదే టైం ఈ నెల్లాళ్ళుగా కనీసం జలుబుతో, ఎలర్జీతో బాధపడ్తున్న తనను డాక్టర్ కి చూపించడం కూడా కుదరలేనంత బిజీ అయిపోయాడు. అంటే ఒక పిల్లడు కలిగే సరికే తనపై అంత మోజు తగ్గిపోయిందా? లేక "ఆఫీసు బిజీ" లో భాగంగా ఏ భామో ఆఫీసర్ గా వచ్చిందా? విషయం ఏదైనా ఉంటే బయట పడకుండా ఎంత సున్నితంగా చెప్పాడో చూడు! రేపయితే తనకు కాస్త వెసలుబాటట... డాక్టర్ కి చూపించడానికి! అంటే ఈ రొంపతో, చీదితే ఊడేలా ఉన్న ముక్కుతో తను మరో ఇరవైనాలుగు గంటలు గడపడమా? అసలీ మధ్య ఆయనకి ఎక్కువయ్యిందిలే. లేకపోతే బాబిగాడు హోంవర్క్ చేయలేదని తాను వాణ్ని కొట్టబోతే, ఏకంగా చెయ్యెత్తాడు తనపైకి కమల్. వెంటనే తన రెండు జతల బట్టలు బ్రీఫ్ కేసు లో సర్దుకుంటే (అచ్చం సినిమాలోలా) సర్లేవోయ్! ఇంత చిన్న విషయానికే అంత పెద్ద ట్రీట్ మెంటా? అంటూ వచ్చి మృదువుగా చేరదీసినందుకు ఏదో పోన్లే అని సర్దుకుపోయింది కాని... హు.. అని సుమ దీర్ఘంగా నిట్టూర్చేలోగా, ముక్కు ట్యాప్ నుండి జలుబు ధారగా.. క్లినిక్ లోకి డా. రవి ఒకేసారి రావడంతో టక్కున ఆలోచనలకు ఫుల్ స్టాప్ పెట్టేసింది ముక్కు తుడుచుకుంటూ.

నమస్కారం డాక్టర్ గారు! అంటూ విష్ చేసి, తన చిటీ నంబర్ మరోసారి చూసుకుంది. రెండవ పేషెంట్ తను. డాక్టర్ గారు

ఎప్పుడో ప్రతి నమస్కారమ్ చేసి లోపలికివెళ్ళాడు. మళ్ళీ ఆలోచనల బండెక్కింది సుమ. తనూ, కోమల, హేమంత ఒకే కాలేజీ లో అయిదేళ్ళు కలసి ఇంటరూ, డిగ్రీ చదువుకున్నారు. అపుడోసారి టాపిక్ లో తమకెలాంటి మొగుళ్ళు రావొచ్చు? అని ప్రశ్న వేసుకొని, ఆపై ఒక్కొక్కళ్ళు వరుసగా చెప్పుకొని సరదాగా ఆనందించారు. అప్పుడు తనే కాస్త ఘాటైన సమాధానం చెప్పింది. మగవాళ్ళు ఎప్పుడు సమాజంలో స్త్రీలను అణగద్రొక్కే ప్రయత్నం చేస్తుంటారు. స్త్రీలంతా ఇది గమనించి ప్రొటెస్ట్ చేయాలి. వరకట్నాన్ని మగవారి జులుంని.. ఇలా తను వాదించి అందరి చేత శెహబాష్ అనిపించుకుంది. కానీ మరిప్పుడో? పెళ్లై ఏడేళ్ళు అయ్యిందోలేదో.. కమల్ కి తనపై ప్రేమ తగ్గినట్లే కనిపిస్తుంది. అంటే అతడు సగటు పురుషాహంకారం గల మగాడేనా? బెల్ మ్రోగింది. సుమ ఆలోచనల బండి నుండి జారి ఇలలో పడింది. నమస్తే డాక్టర్| బాగా జలుబు... తన మాటలకడ్డొస్తూ, "కమల్ రాలేదామ్మా?" అని డాక్టర్ ట్రీట్మెంట్ మొదలుపెట్టాడు. హు.. చివరకి ఈయనగారు కూడా కమల్ లో మార్పు గమనించాడులా ఉంది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తీసుకొని మెడికల్ హాల్ వైపు నడిచింది సుమ.

ఇంతలో ఒకావిణ్ణి, వాళ్ళ నాన్న మెల్లిగా నడిపించుకుని తీసుకొచ్చాడు అక్కడికి. స్టన్ అయ్యింది సుమ. అరే! అది హేమంత కదూ! ఏమయ్యిందండీ ఈమెకు? ఆతృతగా అడుగుతూ విస్తుపోయింది సుమ. అమ్మ రెండు నిముషాలు ఆగండి. డాక్టర్ వద్దకెళ్ళాలి అర్జెంటుగా అని ఆమెను తీసుకెళ్ళిపోయాడు ఆయన. చేసేది లేక ఆత్రంగా మళ్లి కుర్చీలో కూర్చుంది సుమ. 10 నిమిషాల తరువాత బయటకి వచ్చారు వాళ్ళు. "ఏం చేయమంటావు అమ్మా? నీవూ మా అమ్మాయీ స్నేహితులా..! అని విషయం తెలుసుకొని ఇలా చెప్పసాగాడాయన...

నీ పెళ్ళైన సంవత్సరానికి దీనికి పెళ్ళయ్యిందమ్మా.. పెళ్ళైన సంవత్సరం వరకూ అల్లుడు బాగానే చూసుకున్నాడు. పైగా అతని ఇష్టానుసారమే ఉద్యోగం లోనూ చేరింది మా హేమ. ఇప్పుడు దానికి రెండేళ్ళ బాబు కూడా ఉన్నాడు. ఈ మధ్య అల్లుడు దాన్ని సూటి పోటి మాటలతో వేదించడమే కాకుండా, దీని ఆఫీసులో బాసుకీ దీనికి ఏవో సంబంధాలు అంటగట్టేట్టుగా మాట్లాడుతున్నాడు. ఉద్యోగం వదిలేద్దమా అని అనుకుంది కాని, అల్లుడు వద్దంటాడు మళ్ళీ. దీని డబ్బులు వాడిక్కావాలి జల్సాలకి పార్టీలకి వెళ్ళడానికి. దీనికి అమ్మ ఉంటే కడుపులో దాచుకోనేది. కానీ ఆడదిక్కులేని ఇంటికి దీన్ని ఎలా తీసుకురావాలో అర్థంకాక ఇన్నాళ్ళు జంకాను. కానీ నిన్న రాత్రి వాడు.. ఆ కుబుద్ధి దీని ముందే, నా మనవణ్ణి పైకెత్తి కింద పడేయబోతుంటే కాళ్ళు పట్టుకుని బ్రతిమాలిందమ్మా. వాణ్ణి వాడికి దీన్ని పట్టుకుని ఎప్పుడు లేని విధంగా క్రింద పడేసి కాళ్ళతో తన్నాడమ్మా ఆ క్రూరుడు. డిగ్రీ చదివి ఉద్యోగం చేస్తున్న ఆడదేనా అమ్మా ఇది> చూడు వాతలెలా తేలాయో! అంటూ... ఇంకా షాక్ నుండి తేరుకోని తన కూతురిపై ఆ కిరాతకుడు చేసిన గాయాలను చూపిస్తూ రోదిస్తున్న పెద్దయన్ను ఎలా ఓదార్చాలో కూడా తెలీలేదు సుమకి. పైగా మరొక ఆశ్చర్యమైన విషయం తెలిసింది. ఈ భర్త గారి పైశాచిక చర్యలకు అండదండలుగా నిలిచింది అతని పెళ్ళికాని ఇద్దరు చెల్లెలంట. ఛీ! ఆడడానికి ఆడదే శత్రువన్నమాట ఇలా పుట్టిందని ఇప్పుడే తెలిసింది. ఈ విషయం కోమలకి కూడా చెప్పాలి అనుకుంటూ ఆయన్ని ఊరడించి, ఆటోలో వాళ్లనెక్కించి వడివడిగా ఇల్లు చేరింది సుమ. ఏదో పీడకల వచ్చి నిద్ర లేచినదానిలా మనసంతా బాధతో నిండి పోయింది.

ఛీ! పురుషాహంకారం, అంటూ 'కమల్' లాంటి మంచి మనసున్న వ్యక్తులకు ఈ బిరుదు తొందర్లో తగిలించబోయింది తను.

లెటస్ బి కూల్ అనుకుంటూ... తన మనసుకు సెల్ఫ్ సజెషన్ ఇచ్చుకుంటూ జలుబుకు వేన్నీళ్ళ స్టీమింగ్ చేసింది. ముఖంలో కాస్త రిలీఫ్ గా ఫీలయ్యి కోమలకి ఫోన్ చేసింది. అవతలి నుండి పురుషకంఠం "ఎస్ ప్లీజ్! అని వినబడింది." కోమలికి ఇస్తారా ఫోన్. అన్నది తను. కానీ ఈ రాత్రి సమయంలో ఈ గొంతేమిటి? అనుకుంటూనే ఉంది సుమ. ఓ నిమిషం తరువాత కోమలి లైన్లోకి వచ్చింది. ఏంటోయ్ సుమ ఈ రాత్రి వేళ ఫోన్1 అంటూ కోమలి!. మనం చదువుకొనేటప్పుడు హేమంత ఉందే! అది.. అది ఇవ్వాళ్ళ దాన్ని చూసానే! అర్జంటుగా మా ఇంటికి మా ఇంటికొస్తావా? ఫోన్లో చెప్పేది కాదువే అంది సుమ అసహనంగా! ఏయ్ సుమ, ఇప్పుడెలా కుదురుతుందే, కొంచెం బిజీ. రేపు ఉదయం 10గంటలకి వస్తాను ఓకే. అంటూ కోమలి ఫోన్ పెట్టేసింది. ఆ తీరు తెన్నులు కాస్త ఆశ్చర్యంతో బాటు మరికాస్త కోపాన్ని కూడా తెప్పించాయి సుమకి.

ఈ లోగా బయట స్కూటర్ ఆగిన శబ్దంతో ఇక ఆ పూటకి ఆ విషయాన్ని మరుగున పెట్టేసింది తను. పూల పొట్లాన్ని సుమకిస్తూ డాక్టర్ వద్దకెళ్ళొచ్చావా? ఏమన్నాడు? అని ప్రశ్నల వర్షం కురిపిస్తున్న కమల్ ప్రేమను మనసుతో పూర్తిగా ఆస్వాదించి, ఇటు తిరిగి హాయిగా నవ్వుకుంది సుమ. ఆ! వెళ్లక తప్పుతుందా? మీకు రిపోర్టివ్వలిగా! డాక్టర్ గారు అడిగారు మీరెందుకు రాలేదని! తెచ్చుకున్నాన్లే మందులు అంటూ కోపం నటిస్తూ! మరికొంత అలకనూ చేర్చి మాట్లాడింది సుమ. తల్లీ! మాకు బాస్ కాదు బాసిణి వచ్చింది. ఆవిడకన్నీ స్ట్రిక్ట్ రూల్సే. హు! మీ లేడీస్ కి ఎప్పుడు అనుమానాలే... నీకున్నట్లు! దానికి నా మీద అనుమానం. చివుక్కున చూసిన సుమతో ఆ.. అదే.. ఆవిడ గారికి నా మీద అఫిషియల్ వర్క్ అనుమానం. ఆ ఫైలూ ఈ ఫైలూ వెరిఫై చేసాక గాని ఇంటికి పంపలేదు. నన్నూ, రాజారావునూ.... ఓ మూలగా సుమ ముఖం చూసి అన్నాడు కమల్. హమ్మయ్యా! కమల్ కున్న నిజాయితీ లక్షణాల్లో ఫ్రాంక్ నెస్ కూడా ఒకటి. ఎంత నిర్భయంగా ఒక భార్యతో భర్త తన ఆఫీస్ లో బాస్.. అదీ లేడీ బాస్ గురించి చక్కగా చర్చిస్తాడు? తను అలక చెందినా, ఆలోచించిన మీదట కమల్ ప్రవర్తన మచ్చలేనిదని స్పష్టంగా అర్థమవుతూనే వుంది సుమకు. నిద్ర పోతున్న బాబును ముద్దాడి, భోజనానికి లేవబోతున్న భర్త వంక గర్వంగా చూసింది తన అదృష్టానికి మురిసిపోతూ!

ఇట్టే తెల్లారింది... బాబుని స్కూల్ లో దిగబెడుతూ ఆఫీసుకి బయలుదేరాడు కమల్. జడ వేసుకుంటూ వాకిట్లో నిలబడ్డ తనకు కోమలి కనిపించింది. రావే! ఈ మధ్య బొత్తిగా కనిపించట్లేదు.. అంటూ కోమలి ని కూర్చోబెట్టి కాఫీ కలుపుకొచ్చింది సుమ. యోగ క్షేమలయ్యాక అసలు విషయానికి వచ్చింది సుమ. హేమంత విషయమై ఇద్దరు ఒక నిర్ణయానికి వచ్చారు. హేమంత అడబడుచులిద్దరిని నయాన కాకుండా భయాన దారికి తేవడం. ముందు కోమలి ఇలా చేయడానికి ఒప్పుకోవడానికి సుముఖంగా లేదు. కానీ ఒకళ్ళకి సాయం చేస్తే ఆ దైవం మనకి కావలసిన సమయంలో ఎవరి రూపం లో నైనా వచ్చి సాయం చేస్తాడనే తన గట్టి నమ్మకాన్ని కోమలి ముందుంచాక కోమలి ఒప్పుకుంది. ఈ నాటకానికి ఇద్దరూ హేమంత వాళ్ళ నాన్న చెప్పిన అడ్రస్ కి బయలుదేరారు.

గంట బస్సు ప్రయాణం చేసాక, ఓ ఇంటి ముందు వడియాలు పెడ్తూ కనిపించిన ఆ తాటకి, పూతన... అదే ఆ అక్కాచెల్లెళ్ళను చూసారు. కోమలి వెంటనే అందుకుంది. ఏం వొళ్లెలావుంది? మఫ్టీ లో వచ్చాను గనుక సరిపోయింది. లేకుంటే మీరిద్దర్నీ ఈ పాటికి జీప్ లో ఎక్కించి జైలు కి పంపేదాన్ని కఠిన స్వరం తో హడాలెత్తే మాటలన్న కోమలిని ఆడ పోలీస్ అని ఇట్టే నమ్మేసారు ఆ

అక్కాచెల్లెళ్ళు. వడియాలు పెట్టడం ఆపి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు! మమ్మల్ని వదిలేయండి... అన్నారిద్దరూ... ఏం ఎలా వదిలేయ్యమంటారు? కస్సుమంది కోమలి. మీ సంగతి తేల్చుకుందామనే వచ్చాను. మీ వదినను పెళ్ళాడింది మీ అన్నయ్య. మధ్యలో మీ పెత్తనం ఏంటి?చేతనైతే మీరు పెళ్ళిళ్ళు చేసుకొని మీ మీ కాపురాళ్ళు వెలగపెట్టండి. అంతే కాని, కాపురం చేసే వాళ్ళని పనిగట్టుకొని విడదీసే చర్యలకు పూనుకుంటే ఆనక మీ పెళ్లి మేం చేస్తాం. తెల్సిందా? గంటలో మా పోలీసు బృందం మీకు బేడీలు వేయబోతుంది. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మీ వదినని సాదరంగా ఇంటికి పిలుచుకు రండి! ఆమె ఆరోగ్యం బాగయ్యేదాకా మీలో ఏ ఒక్కరూ ఆమెను ఏమైనా అన్నట్టు తెలిసిందో, లాకప్పులో పడేసి, బూటు కాలితో తంతాను. ఏమనుకున్నారో. చచ్చుదద్దమ్మల్లారా! సూటిగా చూస్తూ తీక్షణంగా బాణాలు విసురుతున్న కోమలిని స్టన్ అయి అలాగే చూస్తూ ఉండిపోయింది సుమ. ఏమో అనుకున్నాను. దీనికింత నటన బ్యాక్ గ్రౌండా? అని విస్తుపోతూ... వేయించిన వడియాల్లా అక్కాచెల్లెల్లిద్దరూ ముఖాలు మాడిపోగా తలలు దించుకొని నిలబడ్డారు. చెల్లి ముందుగా తేరుకొని, అమ్మ గారు , ప్లీజ్! మా అన్నకు మా మీద చెప్పకండి రేపిపాటికి అన్న మనసు వెన్నలా మార్చే పూచీ నాది. వదినను ఇన్నాళ్ళు మేమే కనబడకుండా దాచి బాధపెట్టాము. అన్న మనసులో విష బీజం నాటాము. ఇప్పుడు బుద్ధొచ్చింది. అమ్మా! మీరే చూస్తారుగా... మన్నించండి. అంటూ కాళ్ళు పట్టుకున్నంత పని చేసారు ఆ సిస్టర్స్ ఇద్దరూ.. అదే... వృద్ధకన్యలు.. వీళ్ళకిదేం పోయేకాలమో. పెళ్లి చేసుకున్న అన్నని వదినతో సంసారం చేయనివ్వరు... ఛీ అనుకుంటూ కోమలి తనతో అక్కడనుంచి బయటకొచ్చింది.

సుమ కోమలి వీపు పై తడుతూ.. శభాష్! ఇంత నటనెప్పుడు నేర్చావే? అడిగింది ఆశ్చర్యంగా... "ఏం చేస్తామే.. నువ్వేమో ఎప్పుడూ మగవాళ్ళు ఆడవాళ్లని అణగదొక్కేవాళ్ళు అనేదానివి... కాలేజ్ లో వున్నప్పుడు.. మరిప్పుడు చూసావా? అసలు ఆడవాళ్ళకు ఆడవాళ్లే శత్రువులెలా అయ్యారో. ఇదమ్మా కలికాలం. ఇంతకూ ఈ మధ్యే ఏక్టింగ్ స్కూల్ లో చేరానులేవే! మరి నా మొగుడు నెలకోసారి క్యాంపులకెళ్తే ఆ నాల్రోజులూ పరమ బోరింగ్ గా వుంది మరి. నాకున్న కొద్దిపాటి నటనతో మా వారికి తెలికుండా ఇదుగో ఇందులో జాయిన్ అయ్యాను. "అదేంటే! మీ వారికి తెలిస్తే ఏంటి?" అన్నది సుమ. "ఏంటా? దెప్పి పొడవరూ? నటన అంటే అదో పిచ్చి. వెర్రి మాయా లోకమని, అందులో వెళ్తే అందరూ చెడిపోతారు అని ఆయన భ్రమ. మరి ఎలా చెప్పాలో నువ్వే చెప్పు !"

"ఓసిని! ఆ ఇద్దరాడ రాక్షసులకు ఇంతసేపు బుద్ధి చెప్పిన దానివేనా? మీ ఆయనకింత భయపడే కోమలివి?" ముక్కున వేలేసుకుంది సుమ.

అది కాదే, మరి నేని రంగంలో సక్సెస్ అయ్యాక మా వారికి చెబితే ఆయనా సంతోషిస్తారు. అందాక ఎందుకని నేనే చెప్పలేదు. అయినా సుమా! నువ్వు, నేనూ హేమంత తో పోలిస్తే కాస్త అదృష్టవంతులమేమని చెప్పాలి. నాకు అసలు అత్త పోరే లేదు. నీకు ఆడపడచులే లేరు. అయినా స్త్రీ ఎప్పుడూ తన సైడు నుండే ఆలోచిస్తుండడం చెయ్యకూడదు. బాధలకు అసలు కారణం అన్వేషించాలి

భర్త వైపు నుండి కూడా ఆలోచించాలి. ఇక హేమంత జీవితం బాగుపడ్డట్లే. ఆత్మస్థైర్యం ప్రతి స్త్రీ కి వుండాలి. ఆమె ఉద్యోగం చేస్తుందా! లేదా! అన్నది కాదు ముఖ్యం. తాను ముందు తనపై నమ్మకం పెంచుకోవాలి. సమస్యలకు భయపడి దాన్నింకా భూతంలా తయారు చేయకూడదు. హేమంత అదృష్టానికి మనం దొరికాము తనకి. కనుక ఇకనుంచి తన లైఫ్ మెరుగైనట్లే. కాని దేశంలో స్త్రీలపై జరుగుతున్న అఘాయిత్యాలకు, అరాచకాలకు స్త్రీలోని బేలతనమే కారణం అంటాను. చదివి ఉద్యోగం చేస్తే హేమంత మనకన్నా ఏ మాత్రం బాగా లేదు సంసార జీవితం లో.. కారణం ఆమెలోని అబలతనం. స్త్రీని పురాణాల్లో కూడా పురుషులు గౌరవించేవారు. సుమ అంది "అవునే. యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతా! అన్న ఆర్యోక్తి ఉండనే వుంది. అదీ గాక, నేటి స్త్రీలు మరో అడుగు ముందుకేసి, మగ వాడికి తన తెలివి తేటలు ఉపయోగించుకుంటూ. ఆ పనులలో దాసిగా, ఆలోచనలో మంత్రిగా, ఆకలప్పుడు అమ్మలా భోజనం పెట్టి. ప్రేమగా లాలిస్తే పురుషుని హృదయం కూడా ద్రవించక తప్పదే!"

కోమలి అడ్డొచ్చి! ఆ.. ఆపై భూమాతా అంత సహనం మాత్రం స్త్రీకి ఈ కలికాలంలో ఉండొద్దు తల్లీ, పురుషులే కాదు, వాళ్ళ అక్కలూ, అమ్మలూ అదను చూసి హేమంతకు లా బాధ పెడతారు సుమా!. "సరే సరే కోమలి! కాస్త యుక్తితో నేటి సమాజంలో స్త్రీ తన సంసారంలోనూ, కార్యాలయంలోనూ నెగ్గుకురావలంటావ్ అంతేనా?" అంది సుమ.

ఆ! అచ్చు నాలాగే అంటున్న కోమలితో ఆహా! ఆడ పోలీస్ గారు! ఒప్పుకున్నామండీ! అంటూ శృతి కలిపింది సుమ.ఇద్దరూ హాయిగా నవ్వుకుంటూ ఇల్లు చేరారు మరో గంటలో.

మబ్బులు విడిచిన చంద్రునిలా, మనసు తేలికై ఆ రేయి హాయిగా నిద్ర పట్టింది సుమకు కమల్ భుజంపై…




ప రంధామయ్య అంటే ఆ ఊర్లో అందరికీ ఎంతో గౌరవం. అయన రిటైర్ అయిన తెలుగు ఉపాధ్యాయుడు. తెలుగు భాష మీద మమకారం తో రిటైర్ అయినా కూడా పిల్లలకి ఉచితంగానే ఇంటి వద్దే పాఠాలు చెప్తూ ఉంటారు. మనసు వెన్న ముద్ద. ఆ ఊర్లో వాళ్ళు తమ పిల్లలకి తెలుగు భాషతో పాటు పరంధామయ్య గారి మంచి మనస్సు కూడా లభిస్తుందని తమ పిల్లలని పరంధామయ్య వద్దకి పంపించేవారు.     మారుతున్న జీవన విధానం లో ఎంతో మంది పాశ్చాత్య పోకడలకు అలవాటు పడి తెలుగు భాషని నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆవేదన ఆయనని ఎంతగానో వేధిస్తోంది.

మధ్యతరగతి జీవితాన్నే ఇష్టపడే పరంధామయ్యకి విదేశాల్లో ఉన్న తమ మనవళ్ళకి తెలుగు మీద మమకారం అలవరచాలన్నది

ముఖ్య ఉద్దేశ్యం. ఈ ఆధునిక యుగం లో భార్యా భర్తలిద్దరూ ఉద్యోగాలతో ఒకరితో ఒకరు మాట్లాడుకునేందుకు కూడా క్షణం తీరిక లేకుండా ఉంటూ చిన్నప్పటినుంచే వారి పిల్లలు ఏం చదవాలో ముందే నిర్ణయించేసుకుంటున్నారు.

ప్రపంచం ఎంత ముందుకి వెళుతున్నా మాతృ భాషని నిర్లక్ష్యం చేస్తే కన్న తల్లిని నిర్లక్ష్యం చేసినట్టే అని మనవళ్ళకి తెలియదు. ఎందుకంటే ఉద్యోగం చేస్తున్న తల్లి తమ కోసం ఎప్పుడూ సమయం కేటాయించలేదు. డే కేర్ సెంటర్లలోనే వారి బాల్యం గడిచిపోయింది. తన దగ్గర మనవళ్ళని ఉంచుకుందామనుకుంటే పిల్లలు ఎలా చదువుతున్నారో వారికి తెలియదని కొడుకులు పంపలేదు.

పుట్టి పెరిగిన ఈ కన్నతల్లి లాంటి పల్లెటూరు ని విడిచి వెళ్ళడానికి పరంధామయ్య అయన భార్య శాంతలకి మనసొప్పలేదు. ఏడాదికొకసారి వచ్చే మనవళ్ళ పైనే పరంధామయ్య ప్రాణాలు ఉండేవి. వచ్చిన ప్రతీ సారి వారు కొత్తగా ఎంతో వేగంగా ఎదిగిపోతున్నట్టు కనిపించేవారు. ఆ ఉన్న కొన్ని రోజులూ ఆంగ్లంలో పలికే లేత పసి మొగ్గలకి కమ్మటి తెలుగు పదాలని, పద్యాలని అలాగే కొన్ని నీతి కథలని చెప్పేవారు.

కాని ఏం లాభం, వారు తిరిగి విదేశాలకు వెళ్ళగానే తెలుగు భాషను సాధన చేయించేవారెవరూ లేక, మళ్లీ తిరిగి భారత దేశం వచ్చాక వారికి మాతృభాష విదేశీ భాషలా అనిపించేది.

పోటీతత్త్వంతో ఇంట్లోను, బయట ఎల్లప్పుడూ ఆంగ్లంలో నే సంభాషించవలసి వచ్చేది. ఎలాగైనా వారికి తెలుగు భాష లో ని కమ్మదనం తెలియచేయాలని అనిపించేది. కానీ ఎలాగో అర్థం అయ్యేది కాదు.

ఏడాది గడిచింది. మనవళ్ళు 'గ్రాండ్ పా' అని పరిగెత్తుకు వచ్చారు'.

మనసు చివుక్కుమంది. మనవళ్ళు వచ్చారని సంతోషించాలో లేక అమితం గా అభిమానించే తెలుగుతనానికి దూరం అవుతున్నారని బాధపడాలో అర్థం అవలేదు.

'వేర్ ఈజ్ గ్రానీ' అని చిన్న మనవడి ప్రశ్న.

వీళ్ళకు తెలుగు నేర్పించాలంటే నేను ఏదైనా గట్టి నిర్ణయం తీసుకోవాల్సిందే అని అనుకున్నారు, పరంధామయ్య.

కొడుకూ,కోడలు పరంధామయ్య ని పలకరించి ఆయన భార్య శాంతతో లోపలికి వెళ్లారు.

ఇంతలో పెద్ద మనవడు చింటూ పరంధామయ్య దగ్గరికి వచ్చి 'గ్రాండ్ పా, ఐ విల్ టీచ్ యు హౌ టు ఆపరేట్ ఎ కంప్యూటర్' అని అన్నాడు.

తరచూ అందుబాటులో ఉండటం కోసమని పరంధామయ్య కొడుకు ఇంట్లో ఒక కంప్యూటర్ ని ఏర్పాటు చేసాడు. వాళ్ళు విదేశాల నుండి వచ్చినప్పుడు మాత్రమే కంప్యూటర్ కి పని. పరంధామయ్య కి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మీద ఆసక్తి లేకపోవడం తో ఆ తరువాత ఎప్పుడూ మూగబోయే ఉంటుంది.

ఇది వరకు ఎన్నిసార్లు పెద్ద మనవడు కంప్యూటర్ నేర్పుతానన్నా ఈ ఆధునిక సాంకేతిక విజ్ఞానానికి పరంధామయ్య దూరంగానే ఉండేవాడు.

కానీ మనవడిలో ఉత్సాహం చూసి 'చింటూ,సరేరా నేర్పు' అని అన్నాడు.

వాడు ఈ ప్రపంచాన్నే జయించినంత ఉత్సాహం తో తాతగారికి కంప్యూటర్ పాఠాలు చెప్పడం ప్రారంభించాడు.

"ఇది సి పి యు, ఇది మానిటర్" అని ఒక్కొకటి వివరించడం ప్రారంభించాడు.

ఇలా ఉన్న వారం రోజులలో తాత గారికి ఫేస్బుక్, స్కైప్, జిమెయిల్ వంటివి వాడటం ఎలాగో తెలియచేసాడు.

వాళ్ళ సెలవులు అయిపోయాయి అందరూ విదేశాలకి వెళ్ళిపోయారు. పరంధామయ్య మనసులో మళ్ళీ వేదన.

ఆ తరువాత పరంధామయ్య తిరిగి తన దైనందిన జీవితం లో కి వెళ్ళిపోయాడు.

రోజూ ఉదయాన్నే ప్రారంభమయ్యే తెలుగు పాఠాలు అలా నిర్విరామంగా కొనసాగుతూనే ఉండేవి. నేర్చుకునే వారికి బోర్ కొట్టేదేమో కానీ పరంధామయ్య మాత్రం తెలుగు అంటేనే ఎక్కడ లేని ఉత్సాహం తో పాఠాలు చెప్తూ ఉంటారు. ఇంతలో ఒక సారి తన పెద్ద మనవడి నుంచి ఫోన్ వచ్చింది. 'ఏంటి తాతయ్యా, నువ్వు ఆన్ లైన్ కి ఎందుకు రాలేదు. ఐ యాం వెయిటింగ్ ఫర్ యు' అని. కనీసం తెలుగులో కొంతైనా తన మనవడు మాట్లాడినందుకు ఎంతో సంతోషించాడు పరంధామయ్య.

ఇంతలో మెరుపు లాంటి ఆలోచన. తన ఆలోచనలని అమలులో కి పెట్టడం ప్రారంభించాడు.

స్కైప్ లో కి లాగిన్ అయ్యి వెంటనే మనవడితో వీడియో కాల్ ని ఆక్టివేట్ చేసాడు. ఇలా రెండు మూడు రోజులు గడిచాక మెల్లగా తెలుగు లో నే మాట్లాడుతూ మనవడిని కూడా తనతో తెలుగు లో నే మాట్లాడాలనే షరతు విధించాడు.

అలా వారం రోజులు గడిచాక, మనవడికి తెలుగు అక్షరాలూ డెస్క్ టాప్ షేరింగ్ సహాయం తో నేర్పాడు. ఏక సంధాగ్రాహి అయిన మనవడు చాలా తక్కువ రోజుల్లోనే తెలుగు అక్షరాల్ని నేర్చుకున్నాడు.

మెల్ల మెల్లగా రామాయణ, మహాభారత ఇతిహాసాల గురించి మనవడికి కబుర్లు చెప్పేవాడు పరంధామయ్య. అలా తెలుగు భాష కి మాత్రమే ప్రత్యేకమైన పద్యాలు కూడా నేర్పించాడు. మహా కావ్యాలు, రచయితలు, కవుల గురించి ఎంతో ఆసక్తికరంగా మనవడికి వివరించేవాడు పరంధామయ్య.

తెలుగు భాష లో ని కమ్మదనాన్ని తెలుసుకున్న మనవడు ఒక్క రోజు తాతయ్య ఆన్ లైన్ కి రాకపోయినా తనతో తెలుగులో సంభాషించే వారు లేక బెంగపెట్టుకునే వాడు.

క్రమ క్రమం గా తెలుగు భాష లో ఉన్న కథలు, నవలలు , గ్రంధాల ఈ బుక్ లు మనవడికి పంపించేవాడు.

ఏడాది గడించింది. తిరిగి మనవళ్ళు అందరూ ఇంటికి వచ్చారు.

అటు ఆంగ్లం, ఫ్రెంచ్ వంటి విదేశీ భాషలతో పాటు అచ్చ తెలుగులో అనర్గళం గా మాట్లాడగల పెద్దమనవడిని చూసి అందరూ ఆశ్చర్య పోయారు. ఒక్క పరంధామయ్య గారి ఆవిడ తప్ప.

వాడు తెలుగు ఎలా నేర్చుకున్నదీ చక్కగా అందరికీ వివరంగా తెలియచేసాడు. వాళ్ళ అమ్మా నాన్నలకు ఒక చిన్నపాటి షాక్ కూడా ఇచ్చాడు.

ఇకపై తను ఈ పల్లెటూరి లో నే పరంధామయ్య తో పాటే ఉండాలని నిర్ణయించుకున్నట్టు తెలియచేసాడు. చిన్నప్పటినుంచి అమ్మా నాన్నల ప్రేమకి నోచుకోని తనకి తాతయ్య, నాన్నమ్మల ప్రేమతో పాటు తెలుగు భాష లో ని తీపి కూడా ఇక్కడ ఉండి రుచి చూడాలనేది వాడి కోరిక.

వాడిలో వచ్చిన మార్పుకి పరంధామయ్య గారి కళ్ళు చెమర్చాయి.

తన కోరిక ని తీర్చిన ఆధునిక టెక్నాలజీ కి మనసులో కృతజ్ఞత చెప్పుకున్నారు పరంధామయ్య.




రా జారావు చిరాకుగా కుర్చీలో కూర్చొని ఉన్నాడు. ఈమధ్య సుజన రాజారావు ప్రవర్తనను గమనిస్తోంది. తరచూ ఊరులు తిరిగే రాజారావు ఊరు వెళ్లి వచ్చిన తరువాత రెండు మూడు రోజులు ఈ లోకంలో ఉండడు. ఏదో ఆలోచిస్తూ, దీర్ఘంగా చూస్తూ ఉంటాడు. అదీ గాక అప్పుడప్పుడు గోనుక్కోవడం కూడా కద్దు. పాపం సుజనకు ఇతని ప్రవర్తన మీద అనుమానం వచ్చింది. కాని అదేమిటో తెల్చుకోలేక పోయింది . ఎందుకైనా మంచిది డాక్టర్లకు చూపిద్దామనుకొని కూడా ప్రయత్నం చేసింది. దాంతో రాజారావు ఇంతెత్తున ఎగిరిపడ్డాడు.

" నాకేం మాయ రోగం నిక్షేపంగా ఉన్నాను. అలాంటి నన్ను డాక్టరుకు చూపిస్తానంటావేంటీ. ముందు డాక్టర్లకు నిన్ను చూపించాలి.

నీకే ఏదో అయ్యింది." అంటూ విరుచుకు పడ్డాడు. దాంతో పాపం సుజన కూడా ఏమనలేకపోయింది. కాని చూస్తూ ఊరుకోలేక పోయింది. ప్రయాణం చేసి వచ్చిన తరువాత అలా ఎందుకు ఉంటున్నాడో మాత్రం అర్థం కాలేదు. అలాగని చెప్పి ప్రయాణం చేసి వచ్చిన తరువాత అతనిలో మార్పు మాత్రం రాలేదు. ఎందుకు అలా ప్రవర్తిస్తున్నాడో కూడా అర్థం కావడం లేదు. రాను రాను అతని ప్రవర్తన విచిత్రంగా మారిపోయింది. ప్రయాణం చేసి వచ్చిన తరువాతే కాదు అప్పుడప్పుడు బయటకువెళ్లి వచ్చిన తరువాత కూడా అలాగే ఉంటున్నాడు. ఏమిటి విషయం అని అడిగితే చెప్పడు. చిరాకు పడతాడు. అంతేకాని అసలు విషయం తెలియక కంగారుగా ఉంది.

విషయం వాళ్ళ ఇంట్లో చెప్పింది. వాళ్ళ నాన్న గారు వచ్చి కూడా అల్లుడి ప్రవర్తనను పరీక్షగా చూశారు. ఏదో తేడా కనిపిస్తోంది. దానికి కారణం ఏమిటో తెలియడం లేదు. ఎందుకైనా మంచిదని ఇతనికి తెలియకుండా మాంత్రికుని కూడా తీసుకువచ్చి చూపించారు. అంతా ఆర్భాటం చేసి అతను ఇంట్లో గాలి సోకిందని చెప్పాడు. ఇంట్లో గాలి సోకితే అతని ఒక్కడికే అలా కావడం ఏమిటో మిగతా వాళ్ళు బాగానే ఎలా ఉన్నారో అడగడానికి నోరు రాలేదు పాపం సుజనకి. తన మొగుడు బాగుండాలి అంతే. అతను చెప్పినట్లు చేశారు. ఇంటి చుట్టూ గుమ్మడికాయలను బలిచ్చి, కోడిని కోసి రక్తంతో ఇల్లంతా చిలకరించారు. ఇంకా అనేక హంగామాలు చేశారు. కాని వాడు చెప్పినట్లు అతనికి సోకిన గాలి మాత్రం పోలేదు కాని ఇంకా హెచ్చిందనే చెప్పవచ్చు. నాటు మంత్రాలకు యంత్రాలకు లొంగే రోగంలా కనిపించడం లేదు. తన మానాన తనుండడమే. ఏదో కోల్పోయిన వాడిలా ఆలోచిస్తూ ఉంటాడు, అంతే... మాట్లాడ్డంలో గాని, పని చేయడంలో గాని ఎటువంటి తేడా లేదు. మరి ఎందుకు అలా ఉంటున్నాడో అర్థం కాని పరిస్థితి. కొంపదీసి రెండో సెటప్ గాని పెట్టాడా? దాని గురించి ఆలోచించి ఆలోచించి బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాడా? ఇదే అనుమానాన్ని తమ్ముడితో చెప్పింది.

"నువ్వేం కంగారు పడకు అక్కయ్యా! దాన్ని నేను చేదిస్తాను" అంటూ డిటెక్టివ్ అవతారం కూడా ఎత్తి రాజారావును వెంబడించి చూశాడు. కాని అక్క చెప్పినట్లు ఎలాంటి సెటప్ లు లేవు. తిన్నగా ఆఫీసుకు వెళ్ళడం, ఇంటికి రావడం తప్పించి అనుమానించదగ్గ అంశాలు ఏమీ కనిపించలేదని తేల్చిపారేశాడు.

"మరైతే కారణం ఏమిటై ఉంటుందంటావు ?" అడిగింది తమ్ముడిని.

"నాకూ అదే అర్థం కావడం లేదే అక్కయ్యా...!" అన్నాడు.

"పోని మంచి డాక్టరుకు చూపిద్దామంటే నన్నే తిడుతున్నాడు. ఎలాగైనా ఆయన మళ్ళీ మామూలు మనిషి చెయ్యాలిరా తమ్ముడూ.." అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

"ఛ..ఛ.. ఏంటక్కయ్యా, నువ్వు ఏడవకు. దీని సంగతేంటో తేల్చిపారేస్తాను. " అన్నాడు తమ్ముడికి కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా.

అతనికి స్నేహితుడైన హిప్నాటిస్ట్, సైక్రియాటిస్ట్ అయిన మనోజ్ గుర్తుకు వచ్చాడు. ఓసారి వెళ్లి తీరుబడిగా అతన్ని కలిశాడు. పలకరింపులు, కుశల ప్రశ్నలు అయ్యాక, మెల్లిగా బావగారి విషయం చెప్పాడు.

"డాక్టర్ల దగ్గరికి రానంటాడు. విషయమేమిటో అర్థం కాక కొట్టుమిట్టాడుతున్నాం" చెప్పాడు.

"నో... నో.. పేషంటును చూడకుండా రోగ నిర్ధారణ చేయడం కుదరదు" అన్నాడు.

"ఏడ్చినట్టే ఉంది. అందుకేగా నీ దగ్గరకు వచ్చింది. నువ్వేమైనా పరిష్కారం చెబుతావని" అన్నాడు.

"అయితే నన్ను ఏం చెయ్యమంటావు. అతన్ని తీసుకురాకుండా లక్షణాలు చెపితే సరిపోతుందా? ఏం ట్రీట్ మెంట్ చేస్తాం"

"ఓరేయ్ ఇంత పెద్ద డాక్టరు ఎలా అయ్యావో నాకు అర్థం కావడం లేదు. అతను రాక పోతే అతని దగ్గరకు మనమే వెళ్దాము"

"గుడ్ అయిడియా! బట్ నేను చాలా బిజి. రావడం కుదరదుగా. ఇదంతా ఎందుకు, ఎలాగోలా ఆయన్ని తీసుకువస్తే ప్రాబ్లెమ్ సాల్వ్ చేయవచ్చు"

"ఆయనే ఉంటే నువ్వెందుకన్నట్టుగా ఉంది. ఆయన రాకే కదా! ఇదంతా.. రమ్మంటే మమ్మల్నే తిడుతున్నాడు. పిచ్చాసుపత్రిలో మమ్మల్ని చూపించుకోమంటున్నాడు."

"ఓ ఐసీ. సరే ఆదివారం సెలవు కాబట్టి నేను వీలుచేసుకుని వస్తాను. మీ బావని ఇంటి దగ్గర ఉండేట్టు చూడాలి" అన్నాడు.

"మరీ మంచిది ఆదివారం ఆయనకు కూడా సెలవు. నువ్వు మాత్రం నా స్నేహితుడిగానే రావాలి. ఓ డాక్టరుగా కాదు."

"నాకు అర్థమయ్యిందిరా "

"థాంక్స్ రా, బాబు..!"

*************** ***************

ఆదివారం రోజున పదకొండు గంటల ప్రాంతంలో డాక్టరు మనోజ్ వచ్చాడు స్నేహితుడిగా.

ఇంట్లోకి ఆహ్వానించాడు స్నేహితుడిని. అక్కకు ఈ విషయం ముందుగానే చెప్పడంతో, పాపం డాక్టరు దగ్గరికి వచ్చి వేడుకుంది."నువ్వే ఆయన్ని మామూలు మనిషి చెయ్యాలి" అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.

"అయ్యో.. ఇదంతా ఏమిటి? ముందు పేషంటును చూపించండి. " అన్నాడు.

ఇంతలో వీళ్ళ ముందుకు వచ్చాడు రాజారావు.

"బావా వీడు నా స్నేహితుడు. మంచి డా... " అంటూ ఆగిపోయాడు.

"అదే డాలర్ సంపాదించే ఉద్యోగం చేస్తున్నాను" చెప్పాడు

షేక్ హ్యాండ్ ఇచ్చి కూర్చోబెట్టారు.

"మీరేం చేస్తుంటారు" మాటల్లో దించాడు మనోజ్.

"నేను ప్రభుత్వ ఉద్యోగిని" అంటూ అన్ని వివరాలు చెప్పసాగాడు.

ఇంతలో మీరంతా బయటకి వెళ్ళమన్నట్టు సైగ చేశాడు స్నేహితుడికి. అక్క తమ్ముడు వీళ్ళిద్దరిని వదిలేసి బయటికి వెళ్ళిపోయారు.

తలుపు దగ్గర వేసి దాదాపు గంట పైగా బయట కాపలా ఉన్నారు.

డాక్టర్ మిత్రుడు తలుపులు తీసుకుని గంభీరంగా బయటకి వచ్చాడు.

అతన్ని అలా చూసిన వాళ్ళకి ఏమైంది అని అడగడం కూడా మరిచిపోయారు. ఏం చెబుతాడోనని ఎదురు చూస్తున్నారు.

"ఓరేయ్! నువ్వు నాతో రారా" అంటూ బయటికి దారి తీసాడు.

ఇది చాలా సీరియస్ విషయం కావచ్చని పాపం సుజన ఏడ్వడం మొదలు పెట్టింది.

"అబ్బా నెత్తి మీద గంగను పెట్టుకుంటావు. నువ్వు కాసేపు నిశ్శబ్దంగా ఉండు ఏంటో విషయం తెలుసుకువస్తాను." అంటూ మనోజ్ వెంట బయటికి వెళ్ళిపోయాడు.

*************** ***************

"ఏంట్రా విషయం" అడిగాడు కొద్దిగా భయంగానే.

"పెద్ద ప్రాబ్లెమ్ కాదు. సాల్వ్ చేయవచ్చు. కాని... "

"కాని... ఏమిట్రా"

"కుటుంబ సహకారం కావాలి"

"దానికేం భాగ్యం మా బావ కోలుకోవడానికి మేమందరం ఏం చెయ్యడానికైనా రెడీ" చెప్పాడు.

"అంత సులువైన విషయం కాదు"

"అంటే అర్థం కాలేదు."

"బెగ్గింగ్నోమియా అనే వ్యాధి పట్టుకుంది."

"ఏమిటి. దీని పేరు ఎప్పుడు విన్లేదు. చదవలేదు" అన్నాడు ఆశ్చర్యంగా.

"నేనే పెట్టాను. ఎలా వింటావు. ఇప్పుడే పెట్టాను."

"నువ్వు పెట్టావా? ఇంతకీ జబ్బు లక్షణాలు ఏమిటో చెప్పు. నీ పేర్లు నిన్ను తగలెయ్య, అసలే ఏ వ్యాధితో బాధపడుతున్నాడని మేం భయపడిచస్తుంటే. నువ్వేమిటో కొత్త పేర్లు, కొత్త వ్యాధులు కనిపెడుతున్నావ్" కొద్దిగా కోపం కలిపిన చిరాకుతో

కసురుకున్నాడు

"రేపు నా పేరు వైద్య చరిత్రలోనే మారుమోగబోతుంది. మీ బావ దయవల్ల" సంబ్రంగా చెప్పిండి.

"రేయ్ ముందు జబ్బు లక్షణాల్లేంటో చెప్పు" గట్టిగా అరిచాడు.

" ఓ.కే. ఓ.కే. అదే చెబుతున్నాను. ఇతనికి బిచ్చగాళ్ళు తనను అడుక్కోవడం ఇష్టం. అదీ ఎలాగంటే బ్రతిమాలి బ్రతిమాలి, కసురుకున్నా, చీదరించుకున్న విడవకుండా ఇతన్ని బిచ్చం అడుక్కోవాలి. కాని పాపం ఎవరు కూడా ఇతన్ని అలా అడుక్కోవడం కాదు కదా కనీసం ఇతని ముఖం కూడా చూడట్లేదు. అదీ ఈయన బాధ. దాంతో మానసికంగా కుంగి పోతున్నాడు. బిచ్చగాళ్ళు ఎందుకు తనను అడుక్కోవడం లేదన్నదే ఇతని సమస్య ."

"ఆ.. " నోరు తెరచి వింటున్నాడు.

"అవును అంతకు మించి పెద్ద జబ్బు ఏం లేదు మీ బావకి. బిచ్చగాళ్ళు ఇతన్ని చూసి చూడనట్టు వెళ్ళిపోతున్నారట. అదే పక్కవాడిని మాత్రం అడుక్కొని వెళ్తున్నారట. దాంతో తనని ఎందుకు అడగటం లేదు. మొదట్లో పొరపాటుగా వెళ్ళిపోయారనుకొని ఊరుకున్నాడట. ఆ తరువాత బిచ్చగాళ్ళని చూడగానే ఇతనే అలర్ట్ అయిపోయేవాడు. కాని ఇతని దగ్గరకు వచ్చినట్టే వచ్చి అడక్కుండానే వెళ్లి పోయేవారట. దీంతో మానసికంగా దెబ్బ తిన్నాడు. ఒక్కరు కాదు, ఎంతోమంది బిచ్చగాళ్ళని పరీక్షించి చూశాడట. కాని ఎవ్వరు కూడా ఇతని మొహం వైపు చూడకుండానే వెళ్ళిపోయారు. అది మీ బావ బాధ" చెప్పి ఆగాడు.

"దీనికి పరిష్కారం...?" అడిగాడు.

"ఆయన దగ్గరికి వెళ్లి బిచ్చగాళ్ళని అడుక్కోమని చెప్పడమే పరిష్కారం. క్రమంగా ఇది చేస్తూ పోతే ఆయనలో గుణం కనిపిస్తుంది. ఆయనకీ మనిషిగా తనలో లోపం ఉందని అనుకుంటున్నాడు. అదీ పోవాలంటే మానసికంగా దెబ్బతిని పిచ్చి వాడుగా కూడా మారే ప్రమాదం వుంది."

"అవునా..?"

"అవును, అందుకే కుటుంబ సభ్యుల సహకారం కావాలని చెప్పింది. గంటసేపు నేను హిప్నొటైజ్ చేసి ఈ వివరాలన్నీ రాబట్టాను. అంతకు మించి ఏ సమస్యా లేదు."

"ఇంతకీ కుటుంబ సభ్యుల సహకారం అన్నావు,ఏం చెయ్యాలో అది కూడా చెప్పు" అన్నాడు

"బిచ్చగాళ్ళని తీసుకువచ్చి ఇతన్ని బిచ్చం అడిగించడం, అది కూడా అతను చీదరించుకున్నా, అసహ్యించుకున్నా, బ్రతిమాలి బ్రతిమాలి మరీ అడుక్కోవాలి. అలాంటి వారిని ఏర్పాటు చేయాలి. లేకపోతే మీలో ఎవరైనా బిచ్చగాడి వేషం వేసి అతణ్ణి అడుక్కోవాలి. అలా దాదాపు అతను మామూలు మనిషి అయ్యే వరకు. అంటే అతడు మూడ్ ఆఫ్ లో వున్నప్పుడు ఇలా చేస్తే గుణం కనిపిస్తుంది." అదీ విషయం అన్నట్టుగా చెప్పాడు.

ఒక్కసారి బిత్తరపోయాడు. ఏమిటి బిచ్చగాళ్ళు దొరక్కపోతే తమే బిచ్చగాళ్ళ వేషం వేయాలా? ఈయనకు ఇదేం పాడు జబ్బు, తిట్టుకున్నాడు బావని.     బిచ్చగాళ్ళకు వేయకపోతే డబ్బు మిగులుతుంది అని ఆలోచించడం లేదు. ఈయన అడగనందుకు ఆలోచిస్తున్నాడు. లేని రోగాలు తెచ్చుకుంటున్నాడు. అక్కకు విషయం చెప్పాడు.

"ఏమిటీ?" సుదీర్ఘంగా ఆశ్చర్యపోయింది. "అయితే మనం బిచ్చగాళ్ళ వేషం వేయాలా?" అంది

"అదే కదా నేను చెప్పేది. ఏంటో కలికాలం కాకపోతే మనుషులకు ఎలాంటి రోగాలు వస్తున్నాయి. నువ్వేం బాధపడకు. నేను బిచ్చగాళ్ళను బావ దగ్గరికి పంపించే ఏర్పాటు చేస్తాను."

"తమ్ముడివి కాబట్టి నీకు నమస్కారం చేయలేకపోతున్నాను. నువ్వు నా తమ్ముడిగా పుట్టడం నా అదృష్టం" అంది కన్నీళ్ళతో.

పాపం తమ్ముడి కళ్ళల్లో కూడా తడి కదలాడింది.

బిచ్చగాళ్ళని పట్టుకుని ఆయన్ని దీనంగా అడుక్కోవాలి అని చెబితే.. "ఏమిటండి? మీరు చెప్పేది మేము చేసేది అదే కదా?

ఇందులో కొత్తేముంది? కాని మీరు అడుక్కోమన్నవాళ్ళని మేమెందుకు అడుక్కోవాలి? మా ఇష్టం వచ్చిన వాళ్ళని అడుక్కొనే హక్కు మాకు ఉంది. ఇష్టం లేకపోతే మానేస్తాం. అంతే కాని మీరు ఇలా ఆయన్నే అడుక్కోమంటే మేము అడుక్కోం" అంటూ బిచ్చగాళ్ళు క్లాసు పీకారు.

చేసేది లేక పాపం సుజన తమ్ముడే బిచ్చగాడిలా మారక తప్పలేదు.

బావ దగ్గరకెళ్ళి "బావా.. ధర్మం చేయి బావా" అన్నాడు.

రాజారావు ఆశ్చర్యపోయాడు. వీడెవడు నన్ను బావా అని పిలిచి ఆడుకుంటున్నాడు. అసలు నన్ను అడుక్కొనే బిచ్చగాళ్ళు ఉంటారా? తనను కాదన్నట్టు చూస్తుండిపోయాడు.

"బావా.. ధర్మం బావా"

"ఏంట్రా.. నేను నీకు బావనా? నన్ను బావ అని పిలుస్తున్నావు అడుక్కుతినే అంట్ల వెధవ" గట్టిగా తిట్టాడు.

అప్పటికి తను చేసిన పొరబాటు కనిపెట్టాడు సుజన తమ్ముడు.

"లేదు బాబు..      నేను అలా పిలవలేదు బాబూ .. ధర్మం చేయి బాబూ.. మా బావ కి అనారోగ్యం డాక్టర్ కి చూపించాలి. అంతే కాదు నాలుగు రోజులయ్యింది అన్నం తిని. ఆకలిగా వుంది" దీనంగా వేడుకున్నాడు.

రాజారావు కు ఎక్కడలేని ఆనందం తన్నుకు వచ్చింది. బిచ్చగాడు తనను అడుక్కుంటున్నాడు. గ్రేట్.. "ఎహె.. ముందుకు వెళ్లు" కసురుకున్నాడు.

"అలా అనకండి బాబయ్యా.... ధర్మం చేయండి" కాళ్ళు పట్టుకున్నంత పని చేసాడు. అందరూ తననే చూస్తున్నారు. గర్వంగా ఫీలయ్యాడు. రూపాయి బిళ్ళ తీసి అతని మీదికి విసిరాడు. రూపాయి చేతిలో పడకుండా కింద పడింది. వెంటనే దాన్ని అందుకొని

"థాంక్యూ బావా... థాంక్యూ.. " అంటూ అలుముకొని చెప్పాడు.

"ఏయ్ ఏంటయ్యా వదులు నేనేమన్నా నీకు చుట్టాన్నా పక్కన్నా, వదులు.. " వాడు బాబు అన్నాడు తనే అనవసరంగా తప్పుగా వింటున్నాడు. కాని ఎంతో తృప్తిగా ఫీలయ్యాడు. మొదటిసారిగా తను మనిషేనన్న విషయం నిర్ధారించుకున్నాడు.

***************                    ***************

"ఒరేయ్ తమ్ముడూ.. ఏం మందేసావురా.. మీ బావ గారు చాలా ఉత్సాహంగా ఉల్లాసంగా ఉన్నారు. మొహం కళకళ లాడిపోతుంది. నేను మీ బావ మొహంలో ఆనందం ఇలాగే చూడాలిరా"     ఆనంద భాష్పాలు రాలుతుంటే చెప్పుకు పోతుంది సుజన.

"అయితే నేను బిచ్చగాడిలా ఎన్ని రోజులు నటించాలో" అనుకున్నాడు

కాని అక్క మొహంలో ఆనందం చూసి తనకు ఈ వేషం ఇప్పట్లో తప్పేలా లేదు. నీరసంగా అనుకున్నాడు. పాపం సుజన తమ్ముడు




"మ నిద్దరం విడిపోదాం" గుమ్మంలోకి అడుగు పెడ్తూ అందామె.

"ఎందుకు"

"ప్రేమించుకున్నాం కనుక"

"ప్రేమిస్తే విడిపోవాలా..అంటే ద్వేషిస్తే కలిసివుండే వాళ్ళమా?"

"...."

"నాలో లోపాలు ఏంటి" బేలగా అడిగాడు అతను.

"నీ నవ్వు చాలా బావుంటుంది"

"నాలో లోపాలు చెప్పమంటున్నా"

"నీ డ్రస్ సెన్స్ బావుంటుంది..సెన్స్ ఆఫ్ హ్యూమర్ బావుంటుంది"

"నాన్సెన్స్..నేను అడుగుతున్నది లోపాల గురించి"

"లోపాలుంటేనే విడిపోవాలా?" క్యాజువల్ గా హ్యాండ్ బ్యాగ్ లోంచి బబుల్ గమ్ తీసి నోట్లో వేసుకుంటూ అడిగింది. అంతక్రితం వారమే పరిచయం. వన్ బై టూ కాఫీ మొదలు అన్నీ షేర్ చేసుకున్నారు. ఆమె హాస్టల్లో ఉంటోంది. పెయింట్స్ వేస్తుంటుంది. అతను సాఫ్ట్ వేర్ రంగంలో ఉంటూ సాఫ్ట్ గా ఉంటున్నాడు.

"నేను చాలా పెయింట్స్ వేశాను...ప్రతి పెయింట్ ఇష్టపడ్డాను. అది పూర్తయ్యాక లోపాలు కంపించవ్.. కానీ కొత్త పెయింట్ వేయాలనిపిస్తుంది."

"ప్రేమా, పెయింట్ ఒకటేనా?"

మాట్లాడలేదు.

"ప్రేమ గురించి చాలా చెప్పావ్.."

"ఇప్పటికీ చెప్తున్నా"

"నీకసలు బుద్ధి లేదు."

" అవును"

"బాధగా లేదా?"

"వుంది"

"అబద్ధం"

"నేను బాధ పడట్లేదని ఎందుకనుకుంటున్నావ్?"

"విడిపోదామంటున్నావ్ గా"

"విడిపోవడంలో ఆనందం, కలిసి వుండడంలో బాధ కన్నా బావుంటుందనిపిస్తుంది"

"విడిపోవడం ఆనందం, కలిసి వుండడం బాధా?"

"ప్రేమ పెద్ద సముద్రం...మనం చిన్న పడవలో వెళ్తున్నాం."

"....ఏం, పడవలు బోల్తా పడ్డాయా?"

"......."

"రిలేషన్ లో పర్మనెన్సీ సరిపడదా?"

"ఏ విషయంలోనైనా జర్నీ ఇష్టం.."

"గమ్యం ఒకటి ఉండాలిగా"

"ఆ గమ్యం నువ్వు కాదనిపిస్తోంది"

".....ఓహో...నీ గమ్యం ఎలా ఉండాలో చెప్తావా..."

" కాలం చెప్పాలి..."

"ఫిలాసఫీ చెప్తున్నావా...?"

" ప్రేమా, ఫిలాసఫీ రెండూ ఒకటే.."

అతను తన చేతికి వున్న వాచీని విసిరి కొట్టాడు. అది ఆమె అతనికి బహుమతిగా యిచ్చింది. అతడు ఆమెకు బహుమతిగా ఇచ్చిన మెడలోని చైన్ ని ముద్దు పెట్టుకుంది.

నేల మీదపడిన వాచీని అందుకొంది.

పెద్ద ముల్లు, చిన్న ముల్లు విరిగిపోయినా సెకండ్ల ముల్లు తిరుగుతోంది.

వాచీ వైపు చూసి మెల్లగా నవ్వింది.

బైట వాన పడ్తోంది.

అతను అసహనంగా ఉన్నాడు. ఆమె మనసు వాన కురిసి, వెలసిన తరవాత ఖాళీగా వున్న ఆకాశంలా వుంది.!!

తన అక్కలా తను ప్రేమలో మోసపోకూడదు. టెస్ట్ డ్రైవ్ లో నమ్మకం ఇవ్వలేని మనిషిని జీవితాంతం నమ్మి అడుగు వేయలేదు!!!




రా ధ చిరాగ్గా కాఫీ టేబుల్ మీద పెట్టి 'కాఫీ' అంటూ విసురుగా వెళ్ళింది. ఆ విసురుకు రాధ జడ సుధాకర్ నుదురు తాకుతూ వెళ్ళింది.

పేపర్ చదువుతున్న సుధాకర్ పేపర్ ను ఎడం చేత్తో తీసుకుని కుడిచేత్తో టీపాయ్ మీదున్న కాఫీని అందుకున్నాడు. రాధ చిరాకుకు కారణం తెలుసు. అందుకే మౌనంగా ఊరుకున్నాడు.

వంట ఇంట్లో గిన్నెలు, గ్లాసులు ఎగిరెగిరి పడుతున్న శబ్దాలు రాధ కోపం ఇంకా తగ్గలేదనే సూచిస్తున్నాయి.

సుధాకర్ హైదరాబాద్ లో డ్రగ్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్నాడు. వాళ్ళన్నయ్య నెల్లూరు పక్కన పల్లెలో పదెకరాల వ్యవసాయం చేస్తున్నాడు. పదెకరాలు అన్నమాటే కాని ఏ రోజూ ఆ పంటలమీద రూపాయి వెనకేసుకోలేదు. విత్తనాలకని, ఎరువులకని అప్పుడప్పుడు సుధాకరే డబ్బులు ఇస్తుంటాడు.

మొన్న నాలుగు రోజుల క్రితం సుధాకర్ అన్నయ్య కొడుకు శివరామ్ ఇంటికి వచ్చి 'బాబాయ్ .... నాన్న అర్జంట్ గా నలభై వేలు ఇప్పించుకు రమ్మన్నాడు , కోతలు పెట్టుకున్నాం ' అన్నాడు.

శివరాం అడిగిన మొత్తాన్ని ఇచ్చాడు సుధాకర్. ఆరోజు నుండి రాధ ప్రచ్ఛన్నయుద్ధమే కొనసాగిస్తోంది. నిన్న రాత్రి సుధాకర్ ఆఫీసు నుంచి ఇంటికి రాగానే "ఏవండీ ... పక్కింటి పద్మజకి వాళ్ళాయన ముత్యాల హారం చేయించాడు . ఎంతో బాగుంది. అలాంటిదే నాకూ చేయించరూ ... " అడిగింది రాధ. 'అలాగే తీసుకుందువు గాని రెండు నెలలు ఆగితే ఆ ఇంక్రిమెంట్ డబ్బులతో చేయిస్తాను' అన్నాడు సుధాకర్.

"అన్నిటికీ ఆ ఇంక్రిమెంట్ డబ్బులతో ముడిపెడితే ఎలా ? మీ అన్నయ్యకిచ్చిన ఆ నలభై వేలు అడగండి" అంటూ విసురుగా వంట ఇంట్లోకి వెళ్ళింది.

సుధాకర్ కి శివరాం నిన్ననే ఫోన్ చేసి 'బాబాయ్ ... నాన్న మీకివ్వాల్సిన డబ్బుల కోసం ప్రయత్నిస్తున్నాడు. పంటలో వచ్చిన డబ్బు అప్పులకే పోయింది. రెండు నెలలు ఆగమన్నాడు' చెప్పాడు.

సుధాకర్ కి తెలుసు "రెండు నెలలు కాదు రెండు సంవత్సరాలైనా ఆ డబ్బు ఇవ్వలేడని"!!

పేపర్ చదవటం పూర్తయింది. స్నానం చేసి వచ్చాడు. 'నాన్నా.. ప్రోగ్రెస్ రిపోర్ట్ మీద సంతకం చెయ్యలేదు' అంటూ సుధాకర్ కూతురు ఎనిమిదేళ్ళ లక్ష్మి వచ్చింది. సుధాకర్ ప్రోగ్రెస్ రిపోర్ట్ చూస్తూ 'గుడ్' అంటూ కూతురి బుగ్గలను ప్రేమగా నిమిరి సంతకం పెట్టాడు. "ఇంకా స్కూల్ వ్యాన్ రాలేదా? " అడిగాడు రాధని చూస్తూ సుధాకర్.

"ఈ రోజు బంద్. స్కూల్ లేదు " ఎటో చూస్తూ సమాధానమిచ్చింది రాధ.

"కోపంలో కూడా అందంగా ఉంటావని తెలుసు, కానీ ఇంత అందంగానా ?" రాధని కూల్ చేసే ప్రయత్నంలో మొదటి అడుగు వేసాడు సుధాకర్.

రాధ కోపంగా సుధాకర్ని చూస్తూ 'నన్నేం బుజ్జగించాలని చూడక్కర్లేదు' అంటూ సుధాకర్ ముందున్న ఖాళీ టిఫిన్ ప్లేట్ తీసేస్తూ చెప్పింది. సుధాకర్ చెయ్యి కడుక్కుని రాధ చెంగుతో చెయ్యి తుడుచుకుంటూ "నిన్ను సర్ ప్రైజ్ చెయ్యాలని ఇంతవరకు విషయం చెప్పకుండా నిన్ను వుడికించాను. నిన్న శివరాం మా ఆఫీసుకొచ్చి నలభై వేలిచ్చి అర్జెంటుగా పనుందని ఇంటికి రాకుండా వెళ్ళిపోయాడు. ఈ రోజే నువ్వు కోరిన 'ముత్యాల హారం' తీసుకువస్తాను. ఇక అలక మానినట్లేనా !"

ఆ మాటలతో రాధ ముఖంలో ఒక్కసారిగా ఆనందం వెల్లి విరిసింది. కానీ అది ముఖంలో కనబడనీయకుండా 'నేనేమీ అలగలేదు. నేను ఎప్పటిలాగానే వున్నాను. మీకే అలా అన్పించి వుంటుంది.' తప్పుని సుధాకర్ మీదకి తోసేస్తూ అంది. వాతావరణం తేలిక పడటంతో సుధాకర్ ఆఫీసుకి బయల్దేరాడు.

'నాన్న ! రేపు స్కూల్లో డ్రాయింగ్ కాంపిటేషన్ వుంది. వచ్చేటప్పుడు 'కలర్ పెన్సిల్స్' తీసుకుని రండి' చెప్పింది లక్ష్మి. అలాగే తల్లి ! అంటూ కూతురిని ముద్దాడాడు.

సుధాకర్ ఆఫీసు జీప్ లో నేరుగా పంజాగుట్ట లోని పెద్ద హోల్ సేల్ మెడికల్ షాప్ కి వెళ్ళాడు. సుధాకర్ ని చూడగానే షాపు ఓనర్ పరుగు పరుగున వచ్చి లోపలి తీసుకెళ్ళాడు. 'సాబ్ ! కబురెడితే నేనే వచ్చేవాడిని కదా అన్నాడు '. ఎక్స్ పైరీ అయిన మేడిసెన్స్ లేబుళ్ళు మార్చి అమ్ముకుంటున్నావ్ , పెద్ద కంపనీల పేర్లతో లోకల్ మందులు కలిపి అమ్మేస్తున్నావ్. నీ సరుకు సీజ్ చేస్తున్నా ... నిన్ను జైలు కి పంపిస్తా. వాళ్ళ షాపులో దొరికిన శాంపిల్స్ ను చూపిస్తూ అన్నాడు సుధాకర్.

షాపు ఓనరు సుధాకర్ చేతిలో యాభై వేలు పెట్టి 'సాబ్ ! కేసూ .. గీసూ ఏమీ వద్దు . ఇది వుంచండి. సరిపోకపోతే మళ్లీ పంపిస్తాను' ఇదంతా మాకు మామూలే అన్నట్టు చెప్పాడు.

నిజానికి శివరాం నలభై వేలు ఇవ్వలేదు. రాధకు కావాలని అబద్ధం చెప్పాడు. ఆ డబ్బుల కోసమే ఇప్పుడు ఈ షాపు మీదకి రైడింగ్ కు వచ్చాడు. సుధాకర్ డబ్బులు జేబులో పెట్టుకుని 'కేవలం కేసు లేకుండా ఉండటానికే ఇది తీసుకున్నా. మందులు అమ్ముకోవడానికి కాదు. మర్యాదగా ఆ నకిలీ సరుకు అంతా డిస్పోజు చెయ్యండి' అంటూ జీపెక్కి వెళ్ళిపోయాడు.

'సరుకుని నిన్ననే అన్ని మెడికల్ షాపులకి పంపేసాం ... ఇప్పుడెలా ' అన్నాడు షాపులో పనిచేసే కుర్రాడొకడు. బయటకి పంపక అట్లే పెట్టుకుంటామా ? వీడి మామూలు వీడికి ముట్టింది గా ... మళ్ళీ వస్తే మళ్ళీ ఇద్దాం . ఇలాంటోళ్ళని ఎంతమందిని చూడలేదు ! చెప్పాడు ఓనరు.

జ్యూయలరి షాపుకెళ్ళి రాధకి కావాల్సిన 'ముత్యాల హారం' కొన్నాడు. అలాగే లక్ష్మి అడిగిన కలర్ పెన్సిల్స్ కొన్నాడు. సుధాకర్ ఫోన్ రింగ్ అయ్యింది. ఎత్తాడు . అవతల రాధ... ఏడుపు గొంతుతో 'ఏవండీ ... ! తొందరగా రండి . పాపకి కడుపు నొప్పి అంటే డాక్టర్ గారు ఇంజక్షన్ చేసారు . కానీ ఆ ఇంజక్షన్ నకిలీదంటా ... పాపా పరిస్థితి సీరియస్ గా వుంది .... ' రాధ ఏడుస్తూ చెబుతోంది.

సుధాకర్ కి కాళ్ళ క్రింద భూమి కదులుతున్నట్టు అనిపించింది. జేబులో వున్న 'ముత్యాల హారం' బయటకి తీసాడు. అది 'మృత్యు హారం' లా అనిపించింది.




య ధావిధిగా ఆరోజు ఆఫీసు నుంచి వస్తూ పాల పాకెట్, బ్రెడ్ ప్యాకెట్ కొన్నాను. రాత్రి పూట ఎప్పుడైనా ఆకలేస్తే తినడానికి ఉపయోగపడుతుందని ఇంట్లో బ్రెడ్ ప్యాకెట్ ని రిజర్వు లో ఉంచుకుంటాను. ఆఫీసు లో హెక్టిక్ వర్క్ లోడ్. దాంతో తల నొప్పి తీవ్రం గా ఉంది. ఆఫీసు క్యాబ్ లో ఇంటివరకు వచ్చేద్దామని అనుకున్నాను కానీ బ్రెడ్ అయిపోయిందని గుర్తొచ్చింది. ఇంటికి దగ్గరలో ని ఒక కిరాణా షాపు దగ్గర ఆగి వీటిని కొని నడచుకుంటూ ఇంటికి వస్తున్నాను.

తీవ్రమైన తలనొప్పి. కళ్ళు లాగేస్తున్నాయి. ఇంటికి వెళ్లి తాళం తీసి లోపలికి వెళ్లి ఏదైనా పెట్టుకుని తినాలి. రాత్రికి భోజనం సిద్ధం చెయ్యాలి. నాది తెల్లవారుజామున ప్రారంభమయ్యే షిఫ్ట్. మా ఆయనది సాయంత్రం ప్రారంభమయ్యే షిఫ్ట్. అప్పుడప్పుడు వర్క్ లోడ్ ఎక్కువగా ఉంటే మధ్యాహ్నమే వెళ్ళిపోతారు ఆఫీసుకి. మళ్ళీ నేను ఆఫీసు కి తిరిగి వెళ్ళిపోయాక వస్తారు. ఇలా

నెలలో ఎక్కువసార్లు జరుగుతుంది.

కొన్ని సార్లయితే మేమిద్దరం ఒకరినొకరు చూసుకుని కనీసం వారం రోజులవుతుంది. వీకెండ్ లో నే మేమిద్దరం ఒకరితో ఒకరం గడిపే సమయం. పెళ్ళయి ఏడాది కావస్తున్న నాకు మాత్రం నేనేదో హాస్టల్ లో ఉంటున్నట్టు అనిపిస్తుంది.

ఉదయాన్నే ఆఫీసు కి వెళ్ళడం, సాయంత్రం ఏ అయిదింటికో ఇంటికి రావడం, ఎంతో కొంత నోట్లో పడేసుకోవడం. ఒక గంట నిద్రపోవడం. రాత్రే ఉదయం కి కూడా భోజనం సిద్ధం చెయ్యడం. మళ్ళీ ఉదయాన్నే నాలుగున్నరకి నిద్రలేచి ఫ్రిడ్జ్ లో పెట్టిన అన్నం సాంబార్ నా బాక్స్ లో సర్దుకోవడం. ఆయనకి టిఫిన్ ఏర్పాటు చేసి డైనింగ్ టేబుల్ వద్ద పెట్టడం.ఇది నా బోరింగ్ దినచర్య.

ఒక్కొక్కసారి నేను ఆఫీసు నుండి ఇంటికి వచ్చినప్పుడు మా అయన అప్పుడే ఆఫీసు కి బయలుదేరడానికి తయారవుతూ కనిపిస్తారు. అలసట మూలంగా కనీసం అయన ఏం తింటున్నారో పట్టించుకునే ఓపిక ఉండదు. ఇంటికి రాగానే బెడ్ పైన వాలిపోతాను. పాపం ఆయనెంత ఇబ్బంది పడుతున్నారో అని బాధ.

ఇలా గడిచిపోతున్నాయి రోజులు. లైఫ్ ఈజ్ బోరింగ్. వెరీ వెరీ బోరింగ్.

ఆయనకి నా చేత్తో ఇస్త్రీ చేసిన బట్టలు ఆఫీసు కి వెళ్తుండగా నేను అందివ్వాలి. ప్రేమగా ఆయనకి నచ్చిన వంటకాలు అన్నీ సిద్ధం చెయ్యాలి. భోజనం వడ్డించాలి. నా చేత్తో ఆయనకి తినిపించాలి. ఇది నా కల.

ఎప్పుడూ మనకి కనిపించే పిచ్చుక ఇప్పుడు అంతరించిపోతున్న పక్షుల జాబితాలో చేరిపోతున్నట్టు, ఒకప్పుడు సాధారణంగా ఇంట్లో భార్య నిర్వర్తించే బాధ్యతలు ఇప్పుడు నాకు ఒక తీరని కలలా అనిపిస్తున్నాయి.

ఈ కల తీరేదెప్పుడో.

ఒకవైపు తలనొప్పి, ఒకవైపు ఆలోచనలతో చాలా సేపు నిద్రపట్టలేదు. సగం చదివిన "రివల్యూషన్ 2020" బుక్ మిగతా సగం చదవడం ప్రారంభించాను. బుక్ చదువుతూ ఎప్పుడు నిద్రపోయానో కానీ అలాగే మెల్లగా నిద్రలోకి జారిపోయాను.

***

పాపం పిచ్చిది, ఎప్పుడో తెల్లవారుజామున నిద్ర లేస్తుంది. చాలా కష్టపడుతోంది. వర్క్ లోడ్ ఎక్కువగా ఉండటం వల్ల దానికి సహాయం చెయ్యలేకపోతున్నాను.

కనీసం దాని పని భారం కొంచెం తగ్గించడానికి పనిమనిషి కోసం ప్రయత్నించినా ఇక్కడ ఎవరూ దొరకలేదు. దొరికినా పట్టు మని వారం రోజు లు కూడా వరసగా రారు. మధ్యాహ్నం ఎప్పుడో నిద్ర లేవడం వండి పెట్టినవి కొంచెం తినటం, రెడీ అవడం, ఆఫీసు కి బయలుదేరడం. మళ్ళీ ఎప్పుడో ఇది ఆఫీసు కి వెళ్ళిపోయిన తరువాత ఇంటికి రావడం. ఇది నా దినచర్య. దాని మొహాన్ని దగ్గరగా తీసుకుని నుదుటన ముద్దు పెట్టుకుని ఎన్ని రోజులయిందో. ఇంటికి రాగానే భార్యకి కాసిన్ని మల్లె పూలు తీసుకొచ్చి వేడివేడిగా వండిపెట్టిన భోజనం ఇద్దరం ఒకరి కొకరు తినిపించుకుంటూ హాయిగా గడిపేదెప్పుడో. ఈ షిఫ్ట్ ల మూలంగా సాధారణ భార్యాభర్తలు అనుభవించే చిన్ని చిన్ని సుఖాలు మాకు అందని ద్రాక్షల లాగా అనిపిస్తున్నాయి.

ఒకరితో ఒకరు ఫోన్లలోనే మాట్లాడుకుంటున్నాం. మనసారా మేమిద్దరం కలిసి ఒకరితో ఒకరం హాయిగా గడిపేదెప్పుడో.

***

ఆ రోజు శనివారం. అంజలి నిద్ర పోతూ ఉండుంటుంది. ఆఫీసు ముగించుకుని ఉదయం ఏడు గంటలకు ఇంటికి చేరాను. డిస్టర్బ్ చెయ్యడమెందుకని నా దగ్గర ఉన్న తాళం చెవితో ఇంట్లోకి వచ్చాను. అంజలి ఇంకా నిద్రపోతూనే ఉంది. నేను చక చకా ఫ్రెష్ అప్ అయి, అంజలి కోసం ఏదైనా టిఫిన్ సిద్ధం చేద్దాం అని వంటింట్లోకి వెళ్ళాను. వంటిల్లు నీటిగా సిద్ధం చేసి ఉంది. వీకెండ్ కొంచెం లేట్ గా లేస్తుందని తెలిసి రాత్రే అన్నీ సిద్ధం చేస్తుంది. వెంటనే ఉప్మా రవ్వ తీసి ఉప్మా సిద్ధం చేసాను. నాకు అది మాత్రమే చెయ్యడం వచ్చు. తనకి కాఫీ అంటే చాలా ఇష్టం. అందులో బెడ్ కాఫీ అంటే ఇంకా ఇష్టం. అందుకే కాఫీ రెడీ చేసాను.

ఈ లోపు తనే లేచింది.

"వచ్చేసారా, సారి, మొద్దు నిద్ర పట్టేసింది. లేవలేకపోయాను." అని ముద్దొచ్చే మొహం తో అంది. "సారి ఏంటి. మరీ ఫార్మల్ గా.

ఇదిగో తీసుకో నీకు ఇష్టమని కాఫీ తయారు చేసాను. తాగి ఫ్రెష్ అప్ అవ్వు టిఫిన్ తిందాం"

"కాఫీ..."అని ఆల్మోస్ట్ అరచినంత పని చేసింది.

హాయిగా సిప్ చేస్తూ తాగింది.

"ఫ్రెష్ అప్ అవ్వు టిఫిన్ చేద్దాం"

"ఎంత బాగా చేసారో కాఫీ. థాంక్ యు స్వీట్ హార్ట్. ఉండు ఫ్రెష్ అప్ అయి వస్తాను" అని బాత్రూం లో కి వెళ్ళింది. తనకి ముద్దొస్తే రకరకాలు గా పిలుస్తుంది..

స్నానం చేసి దేవుడికి దండం పెట్టుకుని రాగానే ఇద్దరం కలిసి ఉప్మా తిన్నాము.

ఆ తరువాత ఎప్పుడు నిద్రపోయానో కానీ నాకు నిద్రపట్టేసింది.

నైట్ షిఫ్ట్ లు చెయ్యడం వల్ల ఒక సారి నిద్రపోతే ఏకంగా ఆరేడు గంటలు ఏకధాటిగా నిద్రపోతాను. వీకెండ్ అంటే నిద్ర కోసమే అన్నట్టుంటుంది నైట్ షిఫ్ట్ చేసే వాళ్ళ పరిస్థితి. హాల్ లో నే నిద్రపోయాను.

***

లేచేసరికి రాత్రి ఎనిమిదయింది. పక్కన అంజలి లేదు. "అంజలి, అంజలి" అనిపిలిచాను. చక్కగా తెల్ల చీర కట్టుకుని మల్లె పూలు పెట్టుకుని ఉంది. పదహారణాల బాపు బొమ్మలా ఉంది. ఆత్రంగా దగ్గరికి వెళ్లబోతుంటే "ఆగండి, ఆగండి" మీరు మధ్యాహ్నం కూడా భోజనం చెయ్యలేదు. నిద్ర సరిపోవట్లేదని మిమ్మల్ని లేపలేదు. వెళ్లి కాళ్ళు, చేతులు మొహం కడుక్కుని భోజనానికి రండి. మీకు నచ్చిన వన్నీ వండాను. నా చేతులతో తినిపిస్తాను" అని అంది.

వెంటనే ఫ్రెష్ అప్ అయి అంజలి ముందు వాలిపోయాను. "ఈ భోజనానికి కొంత సమయం ఆగాలి మహానుభావా, ముందు ఈ భోజనం తినండి" అని నాకిష్టమైన వంకాయ కూర ని అన్నం లో కలిపి నాకు నోట్లో పెడుతోంది. నేను కూడా అంజలి కి కొన్ని ముద్దలు (మధ్య మధ్య లో ముద్దులు) తినిపించాను.

నాకు తెల్ల పంచె, తెల్ల షర్టు ఇచ్చింది. అవి కట్టుకోగానే నా కళ్ళకి గంతలు కట్టి మా బెడ్ రూం లో కి తీసుకెళ్ళింది. ఆ తరువాత సన్నటి రొమాంటిక్ మ్యూజిక్ వినబడడం ప్రారంభం అయింది. నా కళ్ళకున్న గంతలు విప్పింది.

స్వర్గం లో కి అడుగుపెట్టానా అన్నట్టుగా ఉంది మా బెడ్ రూం. ఎంత అందం గా అలంకరించిందో. మా మొదటి రాత్రి ని తలపించేలా ఉంది ఆ గది. అగరబత్తి సువాసనలు. మంచం నిండా అలంకరించిన మల్లె పువ్వులు. సన్నగా వినిపించే 'జీన్స్ మూవీ' లో ని 'ని స రీ సా' అనే రొమాంటిక్ థీమ్. పక్కనే ప్లేట్ లో రక రకాల స్వీట్లు. ఆ మంచం పై అజంతా శిల్పం లా ఉన్న మా ఆవిడ. ఇంత కంటే అదృష్టం ఇంకేం కావాలి.

మెల్లగా ఆమె వద్దకు వెళ్లి ఆమె తలలోని మల్లెల మత్తులో ని ఆనందాన్ని ఆస్వాదిస్తూ చెవిలో గుసగుసగా అన్నాను "మనసా కవ్వించకే నన్నిలా" అని. ఈ విధం గా మా వీకెండ్ స'ద్వినియోగం' అయ్యిందని వేరే చెప్పేదేముంది!!




డి టెక్టివ్    అనుమాన్లు ఆవేశంతో కుతకుతా ఉడికిపోతున్నాడు. తన వృత్తికే అవమానం జరిగినట్టు కుప్పిగంతులేస్తున్నాడు. కారణం .....???    అతని ఆఫీసుకి కూతవేటు దూరంలో ప్రముఖ రాజకీయ నాయకుడు జంబులింగాన్ని చంపడానికి అతివాదులు పెట్టిన గంప బాంబు పేలడమే.

నాలుగు ఊరపందులు, అరడజను దాక మేకలు, ఓ పదికోళ్ళు అక్కడికక్కడే మటాష్ అయిపోయాయి.    అయితే అవి కూర్మాగా వండుకు తినడానికి కూడా పనికి రాకుండా రోడ్డుమీద అంతకుముందే అక్కడినుంచి ఎర్రదుమ్ము రేపుకుంటూ వెళ్ళిన గేదెల మంద వేసిన పేడ కళ్లెలతో కలిసిపోయి ఆ ప్రాంతమంతా భీభత్సంగా మారిపోయింది. ఎప్పుడూ అదే ప్రాంతంలో ఆ మధ్యాన్నం సమయానికే శంభరాజు తోపుడు బండి మీద వేసే మిర్చి బజ్జీలు లొట్టలేసుకొని తినడానికి వెళ్తుంటాడు అనుమాన్లు.

అయితే ఆ రోజు పొద్దున్న...దమ్మిడీ సంపాదన లేకపోయినా ఆదివారాలూ కూడా అఫీసంటూ మొగుడు చేస్తున్న హడావుడికి చిరాకెత్తిన పెళ్ళాం విసుక్కుంటూ చేసిన పెసరట్టు ఉప్మా తినడంతో పట్టుకున్న కడుపుబ్బరం వల్ల ఆ పూట తన పొట్టకు కాస్తంత విశ్రాంతి ఇద్దామని ఆఫీసులోనే కునికిపాట్లు పడుతుండడంతో ప్రాణాలతో బ్రతికి బయటపడినందుకు మొదట్లో సంబరపడ్డాడు.

కాని తర్వాత నాయకుడు జంబులింగం పత్రికా సమావేశం పెట్టి మరీ పోలీసులు, ఇంకా నగర ప్రజల అవగాహనా రాహిత్యానికి కస్సుబుస్సులాడడంతో అంతా కంగుతిన్నారు. ఇంతలో అతని సెక్రటరీ కాబోలు జారిపోతున్న పొట్టమీది బెల్టు సర్దుకుంటూ ఉరుక్కుంటూ వచ్చి చెవి కొరికాడు.

'అయ్యా.. మీ సమావేశాన్ని పత్రికలే కాదు, టీవీ ఛానెళ్ళు కూడా కవర్ చేస్తున్నాయని మర్చిపోయారు కాబోలు. మీ ముఖ కవళికలు అందరికీ కనిపించేస్తున్నాయి. అసలే ఎలక్షన్లు దగ్గరకొస్తున్నాయి. ప్రజలకు కోపం వచ్చే రీతిలో మీరిలా మాట్లాడితే ఇంట్లోవాళ్ళు కూడా వోటేయ్యరు. ప్రజల ప్రాణాల గురించి మీరు బాధపడుతున్నట్టు బాగా నటించండి.'

చెవి మీద అంటిన సెక్రటరీ నోటి తుంపరల తాలూకు తడిని జంబులింగం సెక్రటరీ కర్చీఫ్ తోనే తుడుచుకొని తర్వాత టీవీ కెమెరాకందకుండ నాలిక్కరుచుకున్నాడు.

'ఈరోజు నామీద హత్యా ప్రయత్నమైనది. రేపు నా ప్రియమైన ప్రజలైన మీ అందరిమీద కూడా ఇలాగే విద్రోహులు బాంబులు ప్రయోగిస్తే ఎంత ప్రాణ నష్టం జరుగుతుందో తలచుకుంటేనే నాకు వణుకు వస్తోంది' అంటూ సర్దుకున్నాడు.

ఆ వెంటనే పోలీసు కొత్వాల్ కూడా లేచి ఇంకా నగరంలో ఎక్కడయినా జనసమ్మర్ద ప్రదేశాల్లో విద్రోహులు బాంబులు పెట్టే ప్రమాదం లేకపోలేదని.. అలా వాళ్ళు ఎక్కడపడితే అక్కడ బాంబు పెట్టకుండా ప్రజల్లో ప్రతి ఒక్కరూ డిటెక్టివ్ అవతారం ఎత్తి ఎలాంటి మెళకువలు పాటించాలో అనుమానితులను ఎలా పట్టించాలో కొన్ని సూచనలిచ్చాడు. అంతేకాదు, ఈ బాంబు నిందుతులను పట్టిచ్చిన వాళ్ళకు రెండు లక్షల రివార్డ్ కూడా ప్రకటించాడు.

టీవీలు చూసిన ఆపోజిషన్ వాళ్ళు పెదవి చప్పరించేశారు .

"ఆ ఏముంది? ఏ దీపావళి బాంబునో తన వాళ్ళ చేతే పేల్పించి సానుభూతి ఓట్లతో రాబోయే ఎన్నికల్లో గెలిచేద్దామని ప్లాను వేసి ఉంటాడు. జంబుకం లాంటి జంబులింగం. కాకపోతే ఇతగాడి బదులు కోళ్ళు, మేకలు, పందులు చావడం ఏంటి?"

అందరినీ డిటెక్టివ్ అవతారాలెత్తమని తన పొట్ట కొట్టేందుకు ప్రయత్నిస్తున్న కొత్వాలు మీద పళ్ళు నూరుకున్నా, డిటెక్టివ్ అనుమాన్లు మాత్రం దాన్ని సవాలుగా తీసుకున్నాడు. అందుకు పెద్ద కారణం వుంది. అతగాడు ఆ పరిసరాల్లోనే డిటెక్టివ్ బోర్డ్ పెట్టి ఏడాదయ్యింది. మొదట్లో ఏవో చిన్నా చితకా కేసులు వచ్చాయి. అన్నీ దిక్కుమాలిన కేసులే... చేసుకున్న రెండో పెళ్ళాం మీద అనుమానంతో ముసలి మొగుడు నిఘా పెట్టమన్నవి....

పెద్ద ప్లేటులో నేతిలో ఎర్రగా వేయించిన అరకిలో జీడిపప్పులు బాదం పిస్తాలు, జంతికలు, పకోడీలు, నేతి లడ్డూలు, పిజ్జాలు లాగించేస్తూ ఏళ్ళతరబడి సాగుతున్న టీవీ సీరియళ్ళు చూడడం వల్ల నడుం చుట్టు కొలతలు అనూహ్యంగా పెరిగిపోయిన పెద్ద కుటుంబాల ఇల్లాళ్ళు తమ మొగుడుగారు బంగారు తీగల్లాంటి అమ్మాయిలతో సెకండ్ సెటప్పులు పెట్టారేమోనన్న అనుమానంతో పెట్టమన్న నిఘా కేసులు వచ్చాయి.

అయితే, అనుమాన్లు వాటిని ఛేదించడానికి వెళ్ళి తన్నులు తిని కన్ను లొట్టబోయి నెల్లాళ్ళపాటు గాయాలు మానేదాక మంచం మీదే గోళ్ళు కొరుక్కుంటూ కూర్చోవలసి వచ్చింది. కాస్త తేరుకుని మళ్ళీ ఆఫీసులో అడుగు పెట్టిన రెండు రోజులు గడవక మునుపే ఇదిగో, ఈ బాంబు పేలింది. పైగా రాజకీయ నాయకుడు, పోలీసులు కూడా ప్రజలనందరినీ డిటెక్టివ్ లయి పొమ్మంటుంటే కూడా వీరావేశమొచ్చింది అనుమాన్లుకు

అందరూ డిటెక్టివ్ ల అవతారాలెత్తేస్తే తన నోటి దగ్గర మట్టే. కాబట్టి తనే ఊరంతా గాలించి అయినా బాంబులను పెట్టేవాళ్ళను కనిపెట్టాడంటే ఒకే దెబ్బకి రెండు పిట్టలు. రెండు లక్షల రివార్డు దక్కుతుంది. తన పేరు మారుమ్రోగిపోయి జీవితాంతం తన వృత్తికి ఢోకా ఉండదు. అందుకే కాగితం మీద కొత్వాలు సూచనలన్నీ జాగ్రత్తగా రాసుకుని జేబులో పెట్టుకుని నిందితుల వేటకు బయల్దేరాడు అనుమాన్లు.

*************************

పదే పదే ఎవరైన వ్యక్తులు ఒకే ప్రదేశంలో తచ్చాడుతూ తిరిగితే, అనుమానించాల్సిందేనని కొత్వాలు చేసిన మొదటి సూచనని మర్నాడే అమలులో పెట్టాల్సి వచ్చింది డిటెక్టివ్ అనుమాన్లుకి. ఎందుకంటే నలభైయేళ్ళ ఒకామె కుచ్చిళ్ళ మాటున ఏదో పెద్ద ఎర్ర ప్లాస్టిక్ సంచిని పెట్టుకుని పదేపదే వీధి చివరి వరకూ వచ్చి అటూ ఇటూ చూసి వెనక్కి వెళ్ళిపోతోంది.

ఆ ప్లాస్టిక్ సంచిలో ఏముందో.? ఆవిడ వాలకం చూసి అనుమానం వచ్చేసింది అనుమాన్లుకి. ఎందుకంటే ఆ వీధి చివరనే పెద్ద సినిమా హాలు ఉంది. ఆ రోజే కొత్త సినిమా రిలిజయింది కూడా. జనం బయటకి వచ్చే సమయానికి గనక బాంబు సెట్ చేస్తే అపార ప్రాణ నష్టం ఖాయం.. అనుమాన్లు ఆలస్యం చెయ్యదల్చుకోలేదు...

వెంటనే తన అఫీసులో దూరి ముష్టివాడి గెటప్ లో వెనక గుమ్మం గుండా బయటకి వచ్చాడు. అటూ ఇటూ జాగ్రత్తగా చూసుకుని వీధి చివర సిమెంటు గట్టు మీద మాటు వేసాడు. ఈసారి ఆవిడ గారు అనుమాన్లుని గమనించలేదు కాబోలు గబగబా ముందుకొచ్చేసింది.

'అమ్మా ధర్మం" అదాటున వినపడ్డ గొంతుకు ఉలిక్కి పడబోయింది.

"ముష్టి వెధవలకి వేళా పాళా లేకుండాపోయింది. ఛీ పో" అని గట్టిగా కసిరి చటుక్కున అనుమాన్లు పట్టుకుని వారించేలోగానే కుచ్చుళ్ళ మాటున దాచిన ఎర్ర ప్లాస్టిక్ సంచిని అక్కడే పారేసి దర్జాగా వీధి మొదట్లోని తన ఇంట్లోకి వెళ్ళిపోయింది.

డిటెక్టివ్ అనుమాన్లకి ముచ్చెమటలు పోసేస్తున్నాయి. తనని ముష్టి వాడనుకుని లెక్కలేకుండా ఎంత దర్జాగా బాంబుని అక్కడ పడేసి పోయింది. మరి ఆలస్యం చెయ్యకుండా పంచె రొంపికి చుట్టుకున్న సెల్ లోంచి పోలిసులకి సమాచారమందించేసాడు అనుమాన్లు...

రెండు లక్షల రివార్డు ఇంత ఈజీగా నడచి ఇవాళే వచ్చేస్తుందనుకోలేదు. పొద్దుటే లేచి అద్దంలో తన మొహమే చూసుకోవడం ఎంత మంచిదయింది?

అదృష్టవశాత్తూ రోడ్డుమీద జనం లేరు. ఉన్నవాళ్ళంత అమాయకంగా లోపల సినిమా చూస్తూ హీరో, హీరోయిన్ల స్టెప్పులకి, మెలికల డాన్సులకి ఈలలు వేస్తూ ఉండి ఉంటారు. పోలిసులు వచ్చి చకచకా చుట్టుపక్కల చూస్తుంటే తనే వాళ్ళ దగ్గరకెళ్ళి బాంబు పెట్టిన ఎర్ర సంచిని చూపించాడు. బాంబు పెట్టిన ఆమె అక్కడనుంచి ఈపాటికి పరారయి ఉంటుందని తెలిసినా అమె వెళ్ళిన ఇల్లు కూడా చూపించాడు.

వెంటనే బాంబు స్క్వాడ్ వచ్చేసింది. వాళ్ళతో వచ్చిన కుక్కలు ఎర్ర ప్లాస్టిక్ సంచి దగ్గరకు వెళ్ళి చెంగున ఒక్క గెంతు గెంతి దూరంగా పారిపోయాయి. అంతా అలర్ట్ అయ్యారు. అనుమాన్లు ఊపిరి బిగపట్టి చూస్తున్నాడు.

ఇద్దరు బాంబు స్క్వాడ్ వాళ్ళు ప్లాస్టిక్ సంచి దగ్గరకెళ్ళి తలతిరిగి పడిపోబోతుంటే తటాలున వెనక్కి లాగేసారు తక్కిన వాళ్ళు.

అనుమాన్లు గుండె వేగంగా కొట్టుకోవడం ఎక్కువైంది.

ఎంతకీ ఏ బాంబూ పేలింది కాదు. ఆ టెన్షన్ తట్టుకోలేని అతగాడు కళ్ళు తిరిగి పడిపోయాడు. మెలకువ వచ్చేసరికి పోలీసు స్టేషన్లో నలుగురు పోలీసులు బూటు కాలితో తంతున్నారు.

"నీయవ్వ.. వేళాకోళానికి పోలీసులే దొరికారా నీకు? అడుక్కునేవాడివి అడుక్కు తినక ఇంత హంగామా చేస్తావా? ఆ ఎర్ర సంచిలో ఏముందో తెలుసా నీకు?"

"బాంబు కాదా"

భోజనం లేకపోవడమే కాకుండా తన్నులూ తగిలేసరికి నీరసంగా గొణిగాడు అనుమాన్లు.

"బాంబా నీ తలకాయా? ఆవిడెవరో వారం క్రితం ఊరెళ్ళే హడావుడిలో మినప్పిండిని కిచెన్ లోనే ఉంచేసి వెళ్ళిపోయిందిట. ఇవాళ ఊరునుంచి వచ్చాక ముక్కులు పగిలిపోతున్న కంపు భరించలేక తన ఇంటి ముందు పారబోస్తే వీధిలో వాళ్ళంతా తిట్టిపోస్తారని ఎవరూ చూడకుండా వీధి చివర రహస్యంగా పారబోసే ప్రయత్నం చేస్తుంటే నీకు కనిపించింది. నువ్వేమో పెద్ద పోటుగాడిలా లక్షలు కొట్టేద్దామని బాంబు ఉందని మాకు ఫోన్ చేస్తావా?

"కుక్కలు కూడా ఆ కంపు భరించలేక పారిపోయినా గమనించుకోలేని పిచ్చి మొహాలం మేము ఆ సంచీ విప్పి ఆ దుర్వాసనకి వాంతులయి ఆసుపత్రిలో సెలైన్లు కూడా పెట్టించుకోవలసి వచ్చింది తెలుసా ?"

"పోరా పో.. నీమాట పట్టుకుని ఆవిడ ఇంటికి కూడా వెళ్ళి అరెస్టు అని ఉంటే మామీద పరువునష్టం దావా వేసేది ఆవిడగారు. ముష్టాడివని ఈసారికి క్షమించి వదిలేస్తున్నం పో..." మళ్ళీ తన్నారు వాళ్ళు. ఆ దెబ్బకి పెట్టుడు గడ్డం ఊడిపోయింది. డిటెక్టివ్ అనుమాన్లుకి తల ఎక్కడ పెట్టుకోవాలో తెలిసింది కాదు.

'నిజం చెప్పు, నువ్వెవరు? ఇలా మారు వేషం వేసి పోలీసులను తప్పుదోవ పట్టిస్తావా?' కుళ్ళబొడిచేసారు పోలీసులు.

"చివరకు వాళ్ళకే జాలేసి ఎవడో పిచ్చివాడులే అని      ఇంకెప్పుడూ ఇలాంటి పిచ్చి వేషాలు వెయ్యకు. వెళ్ళు" అన్నారు.

తను డిటెక్టివ్ నని చెప్పుకుంటే మరింత అవమానం అని ఆలోచించి మౌన ముద్రలోనే ఆ ముష్టి వేషంలోనే ఆఫీస్ బయలుదేరాడు నీరసంగా.

******************************

డిటెక్టివ్ అనుమాన్లు 'ఆరంభింపరు నీచ మానవులు" పద్యాన్ని చిన్నప్పుడే ఔపోసన పట్టినవాడు కావడంతో ఒక్క ప్రయత్నం విఫలమయినంత మాత్రాన కార్యాన్ని వదిలిపెట్టే వాడు కాదు. అందుకే కొత్వాలుగారి రెండో సూచన గుర్తు చేసుకున్నాడు. మళ్ళీ ప్రయత్నం మొదలు పెట్టాడు.

సాధారణంగా బాంబులు పెట్టేవాళ్ళు సాయంత్రం వేళల్లో జనసమ్మర్ధమున్న ప్రాంతాలనే ఎంచుకుంటారు అనేది ఆ సూచన. కాబట్టి ఆ ఊళ్ళో అలాంటి ప్రాంతం నగరం నడిబొడ్డులో ఉన్న పార్కు అని తనలో తనే అంచనా వేసుకున్నాడు డిటెక్టివ్ అనుమాన్లు. ఆపరేషన్ బ్లాస్ట్ కంట్రోల్ లో భాగంగా తనని ఎవరూ గుర్తించకుండా నల్లని బురఖా వేసుకున్నాడు. రెండు ప్రయోజనాలు.. ఒకటి.. తనని అమ్మాయి అనుకుని విద్రోహులు పెద్దగా పట్టించుకోరు. రెండు.. బురఖాలోంచి తను ప్రతి ఒక్కరినీ పరిశీలించే అవకాశముంటుంది.

అప్పటికే యువ, వృద్ధ జంటలతో కిటకిటలాడుతున్న ఆ పార్కులో ప్రవేశించి అక్కడున్న వాళ్ళందరినీ అనుమానదృక్కులతో

పరిశీలించడం మొదలుపెట్టాడు అనుమాన్లు. అక్కడి గార్డులు కూడా అప్రమత్తంగానే ఉన్నారేమో పార్కుకున్న రెండు గేట్ల దగ్గరా నిలబడి పార్కులోకెళ్తున్న వాళ్ళదగ్గర మారణాయుధాలున్నాయేమో పరిశీలించే లోపలికి వదులుతున్నారు. అయితే విద్రోహులకు ఇదొక లెక్క కాదని, అనుమాన్లు మనసు అక్కడేదో ఘటన జరగబోతోందని అప్పుడే సూచనలిచ్చేయడం మొదలెట్టింది.

పార్కులో ఓ యువకుడు వాటర్ స్ప్రింగ్ దగ్గర కూర్చుని తన స్నేహితుల కోసం ఎదురుచూడడం అనుమాన్లు కంటబడింది.

పార్కు అంతా వీరావేశంతో కాలుగాలిన పిల్లిలా తచ్చాడుతున్న అనుమాన్లు కంట దానితోబాటు మరో దృశ్యం కూడా పడింది. ముగ్గురు యువకులు ఓ బురఖా వేసుకున్న అమ్మాయితో జోకులు వేస్తూ గేటులోంచి లోపలికొచ్చి దూరంగా ఉన్న ఆ యువకుడిని చూపించారు. వాళ్ళు ఆ అమ్మాయి చేతికి ఒక గుడ్డ మూటనివ్వడం ఏవో సూచనలివ్వడం చూసిన అనుమాన్లుకు ఒక్కసారిగా గుండె దడదడలాడింది. అది తప్పకుండా బాంబే అయి ఉంటుంది.

అనుమాన్ల ఆలోచన పూర్తి కాకుండానే ఇంతలో ఆ బురఖాలోని అమ్మాయి పకాపకా నవ్వింది. 'అదంతా నేను చూసుకుంటాగా' అనడం....

ఆ యువకునివైపు వెళ్ళడం చూసేసాడు అనుమాన్లు. పార్కులో ఉన్న అన్ని వందల మందిని బాంబు బారి నుంచి కాపాడే బాధ్యత ఒక భారత పౌరునిగా తన భుజ స్కంధాల మీద ఉందని ఉప్పొంగిపోయాడు అనుమాన్లు. తనూ బురఖాలో ఉన్నాడు కనుక అనుమానించదులే అని ఆమెను దగ్గరగా అనుసరించాడు. అ యువకునికి దగ్గరగా చేరుకుంటూనే ఆ అమ్మాయి అ కను చీకటిలో మూటలోంచి ఏదో తీసి అతని మీదకు విసిరింది.

ఆ యువకుడు ఆమెవంక చూసి సిగ్గుపడుతూ నవ్వాడు. మళ్ళీ ఆమె కూడా పకాపకా నవ్వింది. 'ఐ లవ్ యూ' అంటూ మూటలోంచి మళ్ళీ ఏదో తీసి విసిరింది. దూరం నుంచి ఇదంతా చూస్తున్న ముగ్గురు యువకులు చప్పట్లు కొట్టారు.

అనుమాన్లకు ఈ చప్పట్లు..నవ్వులు..ఈ ఐ లవ్ యు పదాలూ ఇదంతా తప్పకుండా విద్రోహుల కోడ్ అయి ఉంటుంది అనిపించింది.

ఇంకోసారి ఆ యువతి మూటలోంచి విసిరేది తప్పకుండా బాంబే అయి ఉంటుంది. అనుమానం గట్టిగా కుదిపేసింది అనుమాన్లని. పోలీసు కొత్వాలు అనుమానితులెదురైతే తమకు సమాచారమందించాల్సిందని టివిలో చెప్పిన నంబరును గుర్తు చేసుకుని సెల్ లోంచి త్వరగా మెసేజ్ ఇచ్చేసాడు.

ఈలోగా పార్కులోని అంతమంది జనం హతమారిపోకుండా తన ప్రయత్నం తాను చెయ్యాలని తటాలున ఆ యువతి మీదకురికి గట్టిగా పట్టుకున్నాడు. ఆమె అదిరిపోయింది. 'బచావ్ బచావ్' అంటూ కేకలు వెయ్యడంతో దూరంగా ఉన్న యువకులు ముందుకురికారు. అప్పటి దాకా ఆమెను కళ్ళతోనే తినేసేలా చూస్తున్న యువకుడు కూడా ముందుకొచ్చేసాడు. అతని మీదపడి అంతా కలసి అనుమాన్లుని కుమ్మేసారు.

పార్కులో జనం ఈ కేకలు కుమ్ములాటని చూసి అక్కడకు పరిగెత్తుకొచ్చారు. 'నన్ను వదలండి ఇక్కడకు పోలీసులొస్తే మీ కుట్ర బయటపడుతుందిలెండి' అరిచాడు అనుమాన్లు వాళ్ళను వదిలించుకోడానికి గింజుకుంటూ. పోలీసుల పేరు వినేసరికి నలుగురు

యువకులు ఉలిక్కిపడి అక్కడ్నుంచి జారిపోవాలని చూసారు. అయితే అక్కడున్న జనం ఆ నలుగురితో బాటు అనుమాన్లును కూడా పట్టుకున్నారు.

'నీ గొంతు మగాడిలా ఉందేమిటి? ముందు నువ్వెవరో చెప్పూ' అనుమాన్ల బురఖా లాగేసిన జనం తెల్లబోయారు.

'అమ్మో మగాడు..బురఖా వేసుకుని ఇక్కడ ఏం చేస్తున్నాడు..అనుమానించాల్సిందే...' అంటూ అంతా కలసి మళ్ళీ కుమ్మేయబోతుంటే అనుమాన్లు వాళ్ళను తప్పించుకుంటూ అరిచాడు.

'ప్రజలారా! ఆమె చేతిలో బాంబు ఉంది. జాగ్రత్తగా అంతా దూరంగా పారిపోండి..' అరుస్తూనే మళ్ళీ ఆ బురఖా యువతిని పట్టుకున్నాడు. తటాలున ఆమె చేతిలో మూటను లాక్కున్నాడే గానీ భయంతో వణికిపోసాగాడు. ఎందుకంటే ఎంత టైముకు సెట్ చేసారో తెలియదాయె.

ఆ బాంబు గాని తన చేతిలో పేలిందంటె తనతో బాటు అక్కడున్న వాళ్ళంతా ఖతం అయిపోతారు.

'ముందు ఆ బురఖా అమ్మాయి పారిపోకుండా పట్టుకోండి..ఈ బాంబుని కనిపెట్టింది నేను.. రెండు లక్షలు నాకే వస్తుంది.." అని ఒళ్ళు హూనమయిన నొప్పితో అనుమాన్లు కీచుగా అరుస్తూండగానే పోలీసులు నలువైపుల నుండీ చుట్టుముట్టారు. జనం బాంబు భయంతో కకావికలై పారిపోయారు.బాంబుస్క్వాడ్ వాళ్ళు గుడ్డ మూటను స్వాదీనం చేసుకున్నారు.ఆ మూట విసిరిన అమ్మాయి కూడా బురఖా తీసేసింది. అనుమాన్లతో సహా జనం కూడా తెల్లబోయారు. అందులో ఉన్నది కూడా అబ్బాయే. అందరినీ పిడిగుద్దులు గుద్దుతూ పోలీసులు లాక్కుపోయారు.

******************

ఆ అయిదుగురు యువకుల స్టేట్మెంట్లూ విన్న ఇన్స్పెక్టర్ తో సహా అక్కడున్న పోలీసులంతా కడుపు పట్టుకుని నవ్వారు. 'మా మాటలు నమ్మండి సార్. మేము అయిదుగురమూ స్నేహితులం. ఇదిగో వీడి పేరు శ్రీకాంత్... వీడికి పెళ్ళి కుదిరింది. వీడిని ఆట పట్టించాలని మిమిక్రీ చేసే ఇదిగో ఈ ప్రతీక్ అనే కుర్రాడికి బురఖా వేసాం. గులాబీలు విసిరి అమ్మాయిలాగా శ్రీకాంత్ ను ఆట

పట్టించమని పంపి బుట్టలో పడతాడో లేదో చూద్దామని దూరం నుంచి గమనిస్తున్నాం'

'నిజమండీ..నేను నిజంగానే ఓ అందమైన అమ్మాయి ఎవరో ఆ కనుచీకట్లో నామీద గులాబీలు విసురుతూ ఐ లవ్ యూ చెప్తోందని మురిసిపోయి సిగ్గు పడుతున్నాను'

మేమంతా చప్పట్లు కొడుతూ దగ్గరకొచ్చేలోగా ఈయనెవరో మా ప్రతీక్ మీద పడి గులాబీల మూట లాక్కుని బాంబూ అంటూ హంగామా సృష్టించాడు.

నవ్వి నవ్వి అలసిపోయిన ఆ ఇన్స్పెక్టర్ అంతలోనే డిటెక్టివ్ అనుమాన్ల వైపు తిరిగి సీరియస్ గా మొహం పెట్టి అన్నాడు. 'మీలాంటి డిటెక్టివ్ లు కూడా ఇలా చేస్తే ఎలా చెప్పండి. నిజానికి మీరు ఫోన్ చేసిన వెంటనే కుక్కలతో వచ్చిన బాంబ్ స్క్వాడ్ కి ..ఆ కుక్కలు పార్కులోకి రాకపోవడం చూసి అక్కడ బాంబులేవీ లేవని అప్పుడే తెలిసిపోయింది. అయినా ఎందుకైనా మంచిదని పరిశీలించేందుకు మీరిచ్చిన మూట విప్పి దాని నిండా ఎర్ర గులాబీలు ఉండడం చూసి అంతా విస్తుపోయారు. మీరు చేసిన హంగామాకి కొంతమంది జనం భయంతో పరుగెత్తి దెబ్బలు తగిలించుకుని ఆసుపత్రి పాలయ్యారు. కొందరు కేసులు కూడా పెట్టారు. తెలుసా? నిజానికి ఇప్పుడు మేం మీమీద న్యూసెన్సు కేసు పెట్టొచ్చు..'

డిటెక్టివ్ అనుమాన్లు ఖంగుతిని అతగాడు ఏ కేసూ పెట్టకుండా గంటసేపు బతిమాలి, చివరికి తనే డబ్బులు సమర్పించుకున్నాడు. రెండు లక్షల రివార్డు కూడా తప్పిపోవడమేనా? అందరితోనూ మెత్తగా చివాట్లు కూడా తినవలసి వచ్చినందుకు డిటెక్టివ్ అనుమాన్ల ముఖం చింతాకులా చిన్నబోయింది.

పార్కులో పోలీసు ఇన్స్పెక్టర్ ఛీత్కారం చేసాడు. అతనివైపు చూసిన చూపు ఈ జన్మాంతం వరకు అతగాడిని వెంటాడేలా ఉంది. పదేపదే ఈ వృత్తిలో ఎదురవుతున్న వైఫల్యాలతో బాటు ఈ ఆపరేషన్ బ్లాస్ట్ కంట్రోల్ కూడా ఫెయిలవడంతో డిటెక్టివ్ ఆఫీసు ఎత్తేసి ఈ వృత్తి మానేసి తన వీధి చివరే ఓ కిళ్ళీకొట్టు పెట్టుకుని బ్రతుకుదామనుకొని నిర్ణయించుకొన్నాడు అనుమాన్లు....




తా తలనాటి ఆస్తి, దాయాదుల మధ్య, కోర్టులలో నలిగి నలిగి దివాకరానికి పదిలక్షలు వచ్చాయి. ఆ పది లక్షలతో దివాకరం తన తల్లి పేరు మీద ఫిక్స్ డ్ డిపాజిట్లు, ఇన్సూరెన్స్ లు చేయించాడు. "నాకెందుకురా రేపో మాపో పోయ్యేదాన్ని ఇన్ని లక్షలు నా మీద పెట్టావు" అడిగింది దివాకరం అమ్మ మహాలక్ష్మమ్మ.

"అదేమిటమ్మా! అలా అంటావు. ఇది నాన్న గారి డబ్బు. నీ పేరు మీద ఉండడమే ధర్మం." చెప్పాడు ధర్మరాజులా దివాకరం. కొడుకు తనమీద చూపించిన ప్రేమకు మహాలక్ష్మమ్మకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కొడుకు తనమీద చూపించిన ప్రేమను నలుగురితో చెప్పుకోడానికి ఎదురింటికి వెళ్ళింది.

తల్లికొడుకుల సంభాషణను ప్రక్క గదిలోంచి వింటున్న దివాకరం భార్య రాణి చండీరాణియే అయ్యింది. ఉక్రోషంతో దివాకరం దగ్గరకెళ్ళి "ఎప్పుడైనా పట్టు చీరో, నగలో కొనమని నేను అడిగితే డబ్బులు, దాని విలువ అంటూ గంటలు గంటలు క్లాసు పీకే నువ్వు రేపో మాపో గుంటలోకి వెళ్ళే మీ అమ్మ పేరు మీద లక్షలు లక్షలు ఫిక్స్ డ్ డిపాజిట్లు చేస్తావా? నన్ను నా బిడ్డని అనాధలని చెయ్యాలనికున్నావా" అంటూ పదర మనం ఏ నుయ్యో, గొయ్యో చూసుకొందాం" అంటూ ముక్కు చీదేసింది. అమ్మ చేసే ఓవరాక్షన్ తెలీక నాని గాడు బిక్కమొహం వేస్కుని నిలబడ్డాడు.

"అయిపోయిందా..ఇంకా ఏమన్నా మిగిలుందా" విసుక్కున్నాడు దివాకరం. "లేదు..ఇంకా ఏమీ మిగల్లేదు. ఆ కోర్టులో వచ్చిన డబ్బులన్నీ మీ అమ్మ పేరుమీదేగా వేసావు. ఒక్క రూపాయి కూడా మిగల్లేదు. మాకు ఏడుపే మిగిలింది." పెద్ద పెట్టున ఏడుపు లంకించుకుంది రాణి. రాణి ఏడవడం చూసి నాని గాడు కూడా ఏడవడం మొదలుపెట్టాడు.

"ఆపుతావా.... ఎవరన్నా వింటే నేను పొయ్యాననుకుంటారు. అవును మా అమ్మంటే నాకు ఇష్టం. చిన్నప్పుడు మా నాన్న చనిపోతే నాకు ఏ లోటూ తెలికుండా నన్ను చదివించి, ప్రయోజకుడ్ని చేసింది. అలాంటి మా అమ్మకు నేను ఎంత చేసినా తక్కువే." ఉద్వేగంతో చెప్పాడు దివాకరం.

ఇంట్లో ఏడుపులు విని కంగారుగా లోపలికి వచ్చిన మహాలక్ష్మమ్మకు లోపలి దృశ్యం చూసి కొడుకుకి తన మీద ఉన్న ప్రేమకు తల్లి హృదయం ఆనందంతో ఉక్కిరిబిక్కిరై ఊపిరాడక క్రింద పడింది.

పెద్ద కార్పొరేట్ హాస్పిటల్లో మహాలక్ష్మమ్మ చుట్టూరా బంధువులు. " నీకేం వదినా! నిన్ను కళ్ళల్లో పెట్టుకుని చూసుకునే కొడుకు ఉండడం నీ అదృష్టం రెండు లక్షలు పెట్టి నీ గుండె ఆపరేషన్ చేయించాడు. ఈ రోజుల్లో తల్లికి అన్నం పెట్టడడమే దండగ అనుకుంటున్నారు. మావాడు వున్నాడు, ఎందుకు పనికి రాని చవట, పెళ్ళాం కొంగు పట్టుకుని తిరుగుతాడు." ఎదురింటి వెంకట లక్ష్మి చెబుతూంటే మహాలక్ష్మమ్మ గుండె ఆనందంతో నిండిపోయింది. దివాకరం లాంటి కొడుకు ఉన్నందుకు. అదీ తను కన్నందుకు.

దివాకరం తల్లి ఆపరేషన్ కి రెండు లక్షలు ఖర్చు పెట్టాడని తెలియగానే రాణి ఒంటికాలిపై భర్త పైకి వెళ్ళింది.

"ఉన్న డబ్బంతా మీ అమ్మకే ఖర్చు చేసేస్తే నేను, నా కొడుకు అడుక్కు తింటాం. అప్పుడు హాయిగా నువ్వొక్కడివే

వుందువుగాని" మళ్ళీ ముక్కు చీదేసింది.

"ష్..గట్టిగా అరవకు ప్రక్క గదిలో అమ్మ నిద్ర పోతుంది." అన్నాడు దివాకరం.

చూసావా..ఇప్పుడు నేను ఏడిస్తే మీ అమ్మ నిద్ర పాడవుతుందని బాధ పడ్తున్నావుగానీ నా ఏడుపు మీకు అక్కర్లేదు." మళ్ళీ ముక్కు చీదేసింది.

" పిచ్చి మొహమా దగ్గరికి రా నీకొక దేవ రహస్యం చెబుతాను. సీనియర్ సిటిజన్స్ కి బ్యాంక్ వాళ్ళు ఎక్కువ శాతం వడ్డీ రేటు ఇస్తారు. అందుకే అమ్మ పేరుమీద ఫిక్స్ డ్ డిపాజిట్ చేసాను. నామినీగా నీపేరే పెట్టాను. ఇన్సూరెన్స్ లంటావా, ఎక్కువ కాలం మా అమ్మ బతకదు కాబట్టి ప్రీమియంలు అన్నీ చెల్లించకుండానే ఇన్సూరెన్స్ మొత్తం మిగులుతుంది. చనిపోయిన తర్వాత భారీ మొత్తంలో డబ్బు మన చేతికి వస్తుంది. ఇక గుండె ఆపరేషన్ డబ్బులు హెల్త్ ఇన్సూరెన్స్ వాళ్ళు ఇచ్చారు. ఒక్క ప్రీమియం అమౌంటే ..." దివాకరం చెప్పుకుంటూ పోతున్నాడు.

భర్త చెబుతున్న మాటలకు రాణి ముఖం ఆనందంతో వెలిగిపోయింది. "మరి ఈ విషయం ఆ రోజే ఎందుకు చెప్పలేదు" అనడిగింది.

"చెబుదామనే అనుకున్నా...ఇంతలో మా అమ్మ రావడం గమనించా, అందుకే మా అమ్మ మీద ప్రేమ ఉన్నట్టు నటించా" అసలు విషయం చెప్పాడు దివాకరం.

"అయ్యో అనవసరంగ మిమ్మల్ని నానా మాటలు అన్నాను నన్ను క్షమించండి." గారాలు పోతూ చెప్పింది రాణి.

నీళ్ళు తాగుదామని లేచిన మహాలక్ష్మమ్మ కొడుకు దివాకరం మాటలు విని, కొడుకు తనపై చూపించిన ప్రేమ వెనక అసలు రహస్యం తెలుసుకుని బాధతో విలవిలలాడింది.




వ రదొచ్చింది - భయపెడ్తూ, వొణికిస్తూ, జ్ఞాపకాలని తుడిచేస్తూ, మనసుని మెలిపెడ్తూ, చిరునామాల ఆనవాళ్ళు లేకుండా చేస్తూ! కన్నీటి వరదకి కరకట్టలు కరువయ్యాయి!

మా వూరు - చూడముచ్చటైన మా 'లంక' - చుట్టూ కృష్ణమ్మ, మధ్యలో పచ్చదనం - కళ్ళముందే నీటిలో మునిగిపోయింది - సుడిలో చిక్కుకున్న ఈతరాని పసిపిల్లవాడిలా మునిగిపోయింది.

నేను 'నమశ్శివాయ' అంటూ అక్షరాలు దిద్దిన బడి - నేను 'శివశివమూర్తివి' అంటూ భజనలు చేసిన గుడి - తరాలని నిలబెట్టిన పచ్చటి పొలాలు - పరుగెత్తి ఆటలు ఆడిన గట్టులు - పక్షుల గూళ్ళతో కువకువలాడిన చెట్లు - అన్నీ జలార్పణం

అయిపోయాయి!

'ప్రత్యక్షప్రసారం' సాక్షిగా నామరూపాలు లేకుండాపోయాయి'. 'జలసమాధి' అయిపోయాయి. చూస్తూ ఏమీ చేయలేని నిస్సహాయత! ఆ లంకలోనే నా జీవితం చిగురించింది.

ఎప్పుడో నలభై ఏళ్ళ క్రితం - ఆసుపత్రులు లేవు - వైద్యుల జాడలేదు - అమ్మ నొప్పులకి అమ్మమ్మ మంత్రసానిని పిలిస్తే - భూమ్మీద పడ్డాను - నాజన్మభూమి లంక - అక్కడే ఓ చిన్నబడి - రామారావు మేష్టారు ఒకే ఒక్కరు - గుణింతాలు, ఎక్కాలు - కూడికలు, తీసివేతలు, ఇంగ్లీషు మాటలు, చరిత్ర విశేషాలు - ఐదో తరగతి దాకా అక్కడే - ఆ తరువాత దగ్గరలోనే ఉన్న పెద్ద పల్లెలో చదువు - పడవ ప్రయాణం - పలకమీద పాఠాలు - దాటి - పుస్తకాలు వచ్చాయి - అలలని లెక్కపెడ్తూ ఎక్కాలు - సరంగు పాటలలో మాటలు - పుస్తకాల్లో చదువుకున్న దానికన్నా చుట్టూ ప్రకృతి నేర్పిందే ఎక్కువ

కళాశాలలో చేరేసరికి - 'లంకోడు' అని వెక్కిరింతలు. వాళ్ళ వేళాకోళంలో వెర్రి ఆనందం కలిగేది!

'కృష్ణమ్మ లో ఈదితే ప్రపంచాన్ని జయించే ధైర్యం వొస్తుంది -- మీకేంటి చీకటిలో అడుగు పెట్టాలంటే భయం మీకు' అనే వాడిని

పల్లె అతి చిన్నతనం నుండే అనుభవాలిస్తుంది - పట్నం పద్ధతిపేరుతో మనసుని ఎదగనీయకుండా చేస్తుంది !

చదువయ్యాకా - ఉద్యోగం హైదరాబాద్ లో - వారంచివర 'లంక ప్రయాణం'

రెండు రోజుల కొత్తవూపిరిలో మళ్ళీ 'పట్నవాసం'

'నా లంక ... మా వూరు ...' అని చెప్పుకుంటుంటే గుండెలు ఆనందంతో వూగిపోయేవి.

పెళ్ళయ్యింది . పిల్లలు. 'నాన్నా ... సెలవులకి ఎక్కడికి ..' అని పిల్లలు అడగరు.

నా జవాబు వాళ్ళకి తెలుసు.

ఎక్కడికి వెళ్ళినా, వచ్చేటప్పుడు 'లంక' లో ఆగాల్సిందే !

పడవ మీద ఊళ్ళోకి వెళ్తూనే - పలకరింతల పర్వం - 'సిన్నోడొచ్చాడన్న' సంబరం - చంద్రమండలం వెళ్లి వచ్చిన వాళ్ళని కూడా అంత ప్రేమగా చూస్తారో లేదో తెలిదు!

లంకంత కళ్ళలో చేసుకుని చూస్తుంటే 'శబరి' వెలుగు చూపుల్లోని అమరత్వం కన్పించేది ఆ 'లంక' - అలాంటి అపురూపమైన లంక -

మొదట 'వాన' అన్నారు

వాన మాకు కొత్త కాదు. వానకి మేము కొత్త కాదు. అలాంటి వాన వరదైపోయింది.

అమ్మా నాన్న మా వాళ్ళు పడవల్లో దగ్గరలో ఉన్న ఊరుకి చేరారు - అక్కడనుంచి ఇక్కడికి - కష్టాలు పడి - వచ్చారు - అరవైఏళ్ల పైచిలుకు అనుబంధం లంకలో వాళ్ళది - వదిలిపెట్టలేక వదిలేరు - నాన్న జబ్బు పడ్డ మనిషైయ్యారు - అమ్మ సరేసరి

'మడుసులం తప్పించుకున్నాము ... నోరులేని జీవాలు వాటిసంగతేంటి ?' ఏడుస్తూనే ఉంది - మా ఆవు - గంగ - మా రెండు - ఎడ్లు - మా లేగదూడలు - అన్నీ కృష్ణార్పణం అయిపోయాయి!

వాటి అరుపులు యింకా విన్పిస్తున్నట్టుగా ఉంది - కళ్ళకి కునుకు లేదు - 'ఆ ప్రవాహంలో ఎక్కడో ..' మాటలే కరువయ్యాయి - అందరం మొక్కులు మొక్కుకున్నాము - కన్పించని దేవుళ్ళకి వేడుకున్నాము - కాని కృష్ణమ్మ అనుగ్రహించలేదు - అంతా అయిపోయింది -

మా లంక మునిగిపోయింది !

*****                                                        *****

"మీ పూరు .." ఆఫీసుకి వెళ్ళకపోతే ఇంటికి వచ్చిన సహోద్యోగి సారధి అడిగాడు. పేపర్ లో 'నీరైన పూరి' ని చూపెట్టాను!

అంతకుముందు చాలాసార్లు 'మా పూరు' ని చూపెట్టినప్పుడు 'ఆల్బమ్'లో ఉన్న అందమైన ఫోటోలు చూపేవాడిని - ఇప్పుడు ఆ 'ఆల్బమ్' గుర్తుగా ఉంది - పూరు ???

చెట్టు, పుట్ట, గట్టు, గుట్ట, బడి, దడి, గుడి, పాడి,... అన్నీ ఆ ఆల్బమ్ లో ఉన్నాయి - వానలు తగ్గాక మా వాళ్ళు వెళ్తామన్నారు - వెళ్ళే 'దారి' లేక దిక్కుతోచక ఉండిపోయారు!

*****                                                        *****

ఒకరోజు వరద ముంచేసింది. మార్పు ఒక్క రోజులో సాధ్యమా? యాంత్రిక జీవనంలో కలిస్తే విషాదం తగ్గుతుందనిపించి ఆఫీసుకి వచ్చాను.

సారధి అప్పటికే అందరికి చెప్పేశాడు. 'ఆత్మీయుడిని కోల్పోయిన వాడిని' పలకరించారు - నాకు ఏడుపు ఆగలేదు - అప్పుడే నా భుజమ్మీద ఓ చేయిపడింది.

'ఎందుకు సార్ ... మరీ యిదైపోతారు ... జబ్బుపడ్డ మనిషి కోలుకోలేదా? .. మీ 'లంక'కి నీటి జబ్బు పట్టింది ... మందు వేద్దాం ..." ధైర్యంగా అన్నాడు రవి. సంకల్పంతో సాధించలేనిది లేదన్నాడు.

"చరిత్రలో శిధిలమైన కట్టడాల అవశేషాలు బైటకి వస్తే .. రక్షించుకోవడం లేదా?"

"మీరు నిశ్చింతగా ఉండండి ... మీ వూరు అల్బమ్ ఉందిగా ... అది చాలు మళ్ళీ మీ వూరుని మీ వూరులా అందివ్వడానికి ..." ఉత్సాహంగా అన్నాడతను - అక్కడే పక్కగా ఉన్న మరో వ్యక్తి ఆల్బమ్ అందుకున్నాడు !!

*****                *****

రెండు రోజుల   తరువాత -

'వరద వొచ్చింది' ధైర్యం ఇవ్వడానికి, 'మానవుల' మీద నమ్మకాన్ని రెట్టింపు చేయడానికి - పెద్దవాళ్ళు, పిల్లలు,ఆడ,మగ - అంతా -

వరదకన్నా వేగంగా - నా చుట్టూ చేరారు.

బట్టల గుట్టలు - కేజీల్లో ఆహార ధాన్యాలు, పప్పులు - ఊహించనంత డబ్బులు.

ఆ 'వరద'లో కొట్టుకుపోయిన ధైర్యం - మానవీయమనే ఈ 'వరద' తో దగ్గర కొచ్చింది

కళ్ళముందే కనుమరుగై పోయిన మా 'లంక' మా అల్బమ్ లో కన్నా గొప్పగా రూపుదిద్దుకోవడం కనిపిస్తోంది !




ఆ భవనంలోకి అడుగు పెట్టడమే పద్మవ్యూహంలోకి వెళ్ళినట్టుంది. ముందు పెద్ద హాల్. హాల్ లో ఓ పక్క పక్కా ఆంగ్లం తప్ప తెలుగు తెలియనట్టున్న రిసెప్షనిస్ట్. ఆమె దగ్గరకి వెళ్ళి మా అబ్బాయిని చూపెడ్తూ - "ఆరో తరగతిలో అడ్మిషన్" ఎందుకో తెలిదు, తడారిన గొంతులోంచి పొడిగా మాటలు బయటకు వచ్చాయి. రిసెప్షనిస్టు సంతాప సభకి వచ్చిన వాడిని ఎలా పలకరించాలో తెలీక నవ్వినట్టు , చిత్రమైన నవ్వు నవ్వి, ఓ కాగితం నా చేతికిచ్చి " ఫస్ట్ ఫిల్ దిస్ ఫామ్" అంది. అడ్మిషన్ అప్లికేషన్ లో చాలా ప్రశ్నలు ఉన్నాయి. అప్పటి వరకు నా జీవితంలో జరిగిన, జరగబోతున్నాయని వూహిస్తున్న వివరాలతోబాటు, మా ఆవిడ, ఇతర సంతానం వివరాలు యివ్వాలని వుంది.

వివరాలు పూర్తి చేసి, ఫోనులో మాట్లాడుతూ మెలికలు తిరిగిపోతున్న రిసెప్షనిస్ట్ దగ్గరకు వెళ్ళాను. ఓ వంద రూపాయలు తీసుకుని రిసీట్ ఇచ్చి " నెక్స్ట్ వీక్ ఎగ్జాం" అంది. 'సిల్బస్' వినయంగా అడిగాను. అటుగా వున్న గోడ వైపు చూపెట్టింది. అప్పటికే ఆ గోడ దగ్గర నా లాంటి మంద భాగ్యులు సిలబస్ రాసేసుకుంటున్నారు. మా అబ్బాయి ఇష్టం లేని పనిలా చేయి పట్టుకు లాగేస్తున్నాడు. వీడికి ఇక్కడికి రావడం ససేమిరా ఇష్టం లేదు. పరుగు పందెం లో వెంక పడిపోతాడేమోనని, భయంతో ఇక్కడికి తీసుకు వచ్చాను.జననం దగ్గర నుండి మరణం వరకు అనీ కార్పోరేట్ అయిపోయిన ఈ రోజుల్లో, చాదస్తంగా, అపురూపమైనది 'బాల్యం'. దానిని అంత అధ్భుతంగానూ పిల్లలకు అందివ్వాలనుకోడం, అర్థం లేని వెర్రితనమనే సందేహ సముద్రంలో పడిపోయాను. సముద్రంలో ఎక్కువసేపు ఈదలేము. మునక తప్పదు. అంచేత మునిగిపోకుండా, ఒడ్డు లాంటి పరిష్కారం వెతుకుతూండగా ఇదేదో కార్పోరేట్ స్కూల్ రూపంలో కనిపించింది. చిత్రమేమిటంటే, సందేహ సముద్రంలో తోసేసింది ఈ కార్పోరేట్ స్కూల్సే.!

పెద్ద పెద్ద ప్రకటనలతో పత్రికలలో, టీవీలలో, హోరెత్తిస్తూంటే, ఆరో తరగతి పిల్లాడిని, పిల్లాడిగా చూస్తే వాడు ఎందుకూ పనికి రాడని, ఐఐటి ఫౌండేషన్ వేస్తే, ఏడేళ్ళ పునాదుల మీద ఐఐటి లోకి అతి సులువుగా వెళ్ళి పోవచ్చనీ, తీవ్రమైన ఆశ పుట్టించారు. ఏడేళ్ళ బాల్యాన్ని యవ్వన ప్రారంభ దశని పట్టించుకుంటే, 'ఐఐటియన్' అయిపోయి, భవిష్యత్తు బంగారుమయమైపోతుందని వూహ పుట్టించారు. జగమే ఐఐటి మయం చేశారు. అంచేత కార్పోరేట్ స్కూలు వారి లెక్కల ప్రకారం ఐదో తరగతి పాస్ అయ్యాకా, 'బాలుడు ' 'బాలుడు' కాదు. 'వుడ్ బి ఐఐటి యన్'.

మొదట్లో ఆ ప్రకటనల సందడి చూసినా, మనసు మొరాయించింది. కాకపోతే, ఇంటి చుట్టుపక్కల వాళ్ళ తీరు, ఇల్లాలి పోరు ఇరవైనాలుగ్గంటల చానెల్ లా నిరంతరం మోత మోగించేసరికి, దగ్గర్లో వున్న కార్పోరేట్ స్కూలుకి రాక తప్పలేదు. అప్పటికి నేను "ఐఐటిలో సీటు రాకపోతే, కష్టం కదా అంటే లోకంతో పాటే మనం..."ఐఐటీ కాకపోతే ఇంజనీరైనా అవుతాడు." ఢంకా మోగించింది మా ఆవిడ. "అధమం ఇంజనీరేమిటే? ఎంత కిరాణా షాపుల్లా ఇంజనీరింగ్ కాలేజిలు వచ్చినా అంత లోకువగా చూడొద్దు." " అయినా ఏ తెలు పండిటో, సైన్స్ లెక్చరరో, సోషల్ ప్రొఫెసరో, సైంటిస్టో, యాక్టరో, సింగరో, యివేమీ కాకపోతే, నోట్లో నాలుక వుండి ఫుల్ స్టాప్ లేకుండా మాట్లాడగలడు కనుక యాంకరవుతాడులే" అన్నాను.

ససేమిరా అనేసింది మా ఆవిడ. నేను చెప్పినవన్నీ అస్సలు వృత్తులే కానట్టుగా చూపు విసిరింది. ఆమెని తప్పు పట్టలేము.సుప్రభాత సేవ నుండి పవళింపు సేవ వరకు కార్పోరేట్ ప్రభంజనం వీస్తుండే సరికి ర్యాంకుల బ్యాంకులు తమ దగ్గరే వున్నాయని ఏటిఎం లో డబ్బు విత్ డ్రా చేసుకున్నట్టుగా ఐఐటి సీట్లు చేరుకోవడమే తరువాయి అని హోరెత్తించేసరికి, మరో మార్గం కనిపించలేదు. ఎలా చూస్తే అలా కనిపిస్తుంది. ఏది చూస్తే అదే కనిపిస్తుంది. టీకా కేంద్రంలా ఐఐటి చిట్కా కేంద్రంలా వున్నా ఒక కార్పోరేట్ స్కూల్ కి ఎడ్మిషన్ ప్రయత్నంలో అందుకే వచ్చాను. ఆవిడ ఇంట్లోనే వుంటుంది కనుక ఛానెల్ టు ఛానెల్ మార్చేస్తూ అవసరమైన, అనవసరమైన లోకజ్ఞానాన్ని పోగేసి గబాలున గుమ్మరిస్తుంది. ఆ పరంపరలోనే "మన కార్తీకం తెలివైన వాడు...స్కాలర్ షిప్ వస్తే అంతా ఫ్రీయే.. వీడి అడుగు జాడల్లోనే కౌశిక్ నడిచేస్తాడు.'అని రెండో వాడి భవిష్యత్తుకి రాజమార్గం వేసేస్తున్నట్టు చెప్పింది. కొడుకు తెలివి తల్లికి ముద్దైనా, స్కాలర్ షిప్ అనేసరికి నాలోని మధ్య తరగతి మానవుడు అమాంతం పైకి లేచి ఆశ పడ్డాడు.

"ఏడేళ్ళు ఫ్రీగా అంత ఈజీగా చదవనిస్తారా?" నా సందేహాలు నాకు వున్నాయి. అన్నింటికీ మించి ఏడేళ్ళంటే సెంటిమెంటుగా బాల్యాన్ని మింగేస్తున్న ఏలినాటి శనిలా అనిపించింది. ఇన్ని ఆలోచించి 'వెనకబడ్తే వెనకనే నోయ్' అనుకొని ఈ స్కూల్లో చేర్చే నిర్ణయం తీసుకొన్నాను.అప్లికేషన్, పరీక్ష సిలబస్ రాసుకొని ఇద్దరం బయటకొచ్చాము. ఓ చాకొలెట్ కొనిచ్చాను.ఎప్పుడు చాకొలెట్ ఇచ్చినా ఠక్కున నోట్లో వేసుకునే మా వాడు చాకొలెట్ వైపు అదో రకంగా చూసాడు. దీర్ఘంగా నిట్టూర్చాడు. ఐఐటీయన్ లక్షణాల్లో ఇదీ ఒకటి కాబోలు అనుకున్నాను. కోల్పోతున్న బాల్యాన్ని తల్చుకుంటున్నాడన్న ఇంగితం లేక!!

"నో టీవీ..నో ఫిలింస్..నో ఆటలు..నో పాటలు.. మా అబ్బాయి స్కాలర్ షిప్ కోసం మా ఆవిడ కర్ఫ్యూతో కలిసిన నానా రకాల చట్టాలు, సెక్షన్లు విధించేసింది. అండమాన్ సెల్యులార్ జైలులా వుంది ఇల్లు. నేను పొరబాటున నవ్వినా, మాట్లాడినా, అనవసరంగా చిన్నతనలో రికామిగా తిరగబట్టే, చిన్న ఉద్యోగం వెలగబెడ్తున్నానని వెక్కిరించింది. అంచేత మా అబ్బాయిని గ్రహాంతర వాసిగా దూరం పెట్టి, పరిక్షకి ఇతోధికంగా సిద్ధం కావడానికి కృషిచేశాను.!!

పరీక్ష పూర్తయింది, ఫలితాలొచ్చాయి. మావాడు పదేళ్ళ స్కాలర్ షిప్ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించక పోయినా గణనీయంగా మార్కులు వచ్చినందుకు ఫీజులో రాయితీ ఉంటుందని ఫోన్ వచ్చింది. 'వచ్చింది' అనే ఏకవచనం కన్నా ఫోన్లు వస్తూనే వున్నాయి అంటే కరెక్ట్. నక్షత్రకుడి నక్షత్రంలో పుట్టారు కార్పోరేట్ సిబ్బంది, అస్సలు వదిలిపెట్టలేదు. త్రికాలాల్లోనూ అదీ ఇంటికే ఫోన్ రావడంతో మా ఆవిడ అత్రుతని ఆపలేకపోయాను. అప్పటికే ఆవిడకి ఫోన్లో కౌన్సిలింగ్ అయిపోయింది. తెలివైన అబ్బాయిని, తెలివి తక్కువ తనంతో మామూలు స్కూల్లో చదివిస్తున్నారని ఇప్పటికైనా కళ్ళు తెరవండని హెచ్చరిక లాంటి ఆహ్వానాలు అందాయి. వలలో చిక్కిన చేపలా గిలగిలా కొట్టుకుంటూ , తప్పించుకోలేక స్కూలుకి వెళ్ళాము. మా అబ్బాయి మార్కులు చూపెట్టారు. ఆరో క్లాసు పరీక్షలో ఏడెనిమిది క్లాసుల ప్రశ్నలు ఇచ్చారట..ధైర్యం చేసి మొదటి మాటగా అడిగేసాను. 'మా స్కూలు పిల్లలకి ఇది మామూలే ' నాప్రశ్నని అస్సలు పట్టించుకోనట్టుగా జవాబు ఇచ్చాడ స్కూల్ ప్రిన్సిపాల్. ఆ వెంటనే ప్రధాన ఘట్టంలోకి అడుగు పెట్టాను. 'అస్సలైతే అరవై వేలు కట్టాలట. ' మా వాడు ప్రతిభ చూపెట్టాడు కనుక పదివేలు తగ్గిస్తున్నామని చెప్పాడు. మా ఆవిడ " మాట్లాడండి" అని నాకు అవకాశం ఇచ్చినట్టుగా తనే మాట్లాడేసరికి బేరం నలభై ఐదు వేలకి ఖరారైంది. మా ఆవిడ ఆనందానికి అవధులు లేవు. 'నా టెన్షన్ కి అవధులు లేవు' - లోటు బడ్జెట్ ఎలా పూడ్చాలో తెలీక. ఆ తర్వాత అప్పు తేవడం, కట్టడం అయిపోయింది.భవిష్యత్తులో ఐఐటీయన్ జాబితాలో మా వాడు ఉండాలని మా ఆవిడ ఈస్ట్మన్ కలలు కనేస్తోంది.

స్కూలుకి వెళ్ళిన మొదటి రోజే ' మీ అబ్బాయి సంగతి మేము చూసుకొంటాం' అని భరోసా ఇచ్చారు. ఆ మరునాటి నుండే మావాడు చెరుకు పిప్పిలా అయిపోయాడు. ప్రొద్దున్నే ఏడింటికి వెళ్ళడం, రాత్రి ఎనిమిదింటికి రావడం, ఆదివారాల్లో పరీక్షలు, పొరపాటున సెలవు ఇచ్చినా, టీచర్ ఫోన్ చేసి "కార్తీక్..డూ త్రీ హండ్రెడ్ ప్రాబ్లం' అని ఫోన్లోనే వర్క్ ఇచ్చేస్తున్నాడు. స్టూడెంట్ పరిస్తితి ఎలా ఉన్నా సెలవు రోజు కూడా పని కట్టుకొని ఫోన్ చేసే కర్మ పట్టిన ఆ టీచర్ని తల్చుకొని జాలి పడ్డాను.

స్కూళ్ళోనే వీర తోముడు తోముతుండే సరికి నేను చదవమంటే పిల్లాడు డంగై పోతాడని, బాల్యంలోనే సన్యాసాశ్రమం స్వీకరిస్తాడని సధ్యమైనంత వరకు చదువు మాట ఎత్తడం మానేసాను. ఈ మధ్య మావాడికి కడుపు నొప్పి వచ్చింది. అప్పుడప్పుడు మెలికలు తిరిగిపోతున్నాడు.చిట్కా మందులు వేసినా తగాలేదు. స్కూలు మానిపించకూడదు. అప్పటికీ కడుపు నొప్పి గురించి చెప్తే, 'టాబ్లెట్ ఇవ్వండి, ఇక్కడే వేసి చదివిస్తాం' అన్నారు. టాబ్లెట్స్ కి కడుపు నొప్పి తగ్గకపోయేసరికి దగ్గర్లోనే వున్న కార్పోరేట్ ఆసుపత్రికి తీసుకెళ్ళి అనవసరంగా మరో పులి బోనులో అడుగుపెట్టి, 'నిల్' రిపోర్టుకి ఆరేడువేలు వదిలించుకున్నాము. డబ్బు ఖర్చయినా సమస్య ఏమీ లేనందుకు ఆనంద పడిపోతూ వస్తూంటే చిరకాల మిత్రుడు ఆనందరావు కనిపించాడు. మాటల మధ్యన మావాడి కడుపు నొప్పి విషయం చెప్పాను. అంతకు ముందు అతని సలహా కూడా కార్పోరేట్ స్కూల్ విషయంలో తీసుకున్నాను. ఆనందరావు కిసుక్కున నవ్వేసి 'కంగారు పడకు, కొన్ని రోజుల్లో సర్దుకుంటుందిలే, ఇది శారీరక అజీర్తి కాదు చదువు వల్ల వచ్చే అజీర్తి., చదువు ఓవర్ ఫ్లో అయితే ఇదే పరిస్థితి. మనం తెలుసుకోలేని టెన్షన్ లో పిల్లలు పడ్తారు. అదే ఈ పెయిన్ అలవాటయిపోతుంది.' అన్నాడు- సర్వం తెలిసున్న వాడిలా నేను ఏదో అడగబోతే ఇంటికి వెళ్ళి పుస్తకాలు చూడు, నీకే అర్థమవుతుందీ అన్నాడు. వెంటనే ఇంటికి వచ్చి వాడి పుస్తకాలు తీసి చూసాను. ఆరో తరగతి స్టేట్ , సి.బి.ఎస్. సిలబస్ పుస్తకాలతోబాటు సైన్స్, లెక్కలు, ఏడెనిమిది క్లాసుల పుస్తకాలు ఉన్నాయి. అవి చాలవన్నట్టుగా కొన్ని పోటీ పరీక్షల పుస్తకాలు వున్నాయి.

అవన్నీ ఒక్కక్షణం బాల్యం మీద పడ్డ శిలువల్లా అనిపించాయి. రాబోయే తరగతుల పాఠాలు యిప్పుడే చెప్పడమేమిటి ? " రేపటి ఆకలి" ని ఈ రోజే తీర్చేసుకోవడం అత్యాశ అవుతుందిగా - ఎవరినైనా అడిగితే ఐటీ ప్రపంచం అంటున్నారు -- ఐటీ ప్రపంచంలో వెనకబడకూడదు. కాని ముందుకు వెళ్ళే మార్గం ఇదేనా? నా ప్రశ్నకి జవాబు ఏ కార్పోరేట్ కన్సల్టెంటో చప్పగలడేమో?! ఎందుకో తెలిదు, కార్పోరేట్ అన్న మాట మనసులో తట్టిన వెంటనే తెలియకుండానే వెన్నులో వణుకు పుట్టింది.




అం జలి, మేఘనా చిన్న నాటి స్నేహితులు. చిన్న పటినుంచి అంజలి మనస్తత్వం పరిస్థితులను అర్ధం చేసుకుని వాటికి తగిన విధం గా ఎవరికీ ఇబ్బంది కలగకుండా నిర్ణయాలు తీసుకోవడం. దీనికి పూర్తిగా వ్యతిరేక మనస్తత్వం మేఘనది. రెండు వ్యతిరేక మనస్తత్వాలు ఇలా స్నేహ బంధం లో కలిసాయి.

అందం లో మేఘన కి సాటి రారెవరు. అంజలి అందం మేఘనతో పోటీ పడలేదు. ఏ మాత్రం మేకప్ లేకున్నా కూడా మంత్రముగ్దులని కలిగించే అందం మేఘన సొంతం. అయిదు అడుగుల పది అంగుళాల ఎత్తు, సెలయేరుల గల గల లాంటి నవ్వు, తెల్లని మేని ఛాయ, నుదుటిపై పై పడే అందమైన కేశ సౌందర్యం, నాజూకైన శరీరం, తీర్చిదిద్దినట్టుండే కనుబొమ్మలు ఇలా చెప్పుకుంటూ పోతే

అంతే ఉండదు.

ఇద్దరి మనస్తత్వాలు పూర్తిగా వ్యతిరేకమైనవి. అంజలి ఆలోచనతో ప్రవర్తిస్తే, మేఘన ఆవేశం లో ప్రవర్తిస్తుంది. అలా అని మేఘన తెలివితేటలని తక్కువ అంచనా వెయ్యకూడదు. తన ఆలోచనలని తన ఆవేశం డామినేట్ చేయ్యకపోతే మేఘన అధ్భుతాలు సృష్టిస్తుంది. కానీ ఆవేశం లో నిర్ణయాలు తీసుకోవడం మేఘన యొక్క వీక్ పాయింట్.

ఈ విషయం లో మేఘన కి అన్ని విధాల అంజలి అండగా నిలిచింది. వివిధ సందర్భాలలో ఆవేశం లో నిర్ణయాలు తీసుకుంటే పరిణామాలు ఎలా ఉంటాయో మేఘనకి వివరించేది. కొన్ని సార్లు సరిదిద్దేది కూడా.

మేఘనా, అంజలి కాలేజి లో చదివే రోజులలో జరిగిన సంఘటన ఇది.

ఎంతో మంది మేఘన ప్రేమ కోసం తపించేవారు. చదువు సంధ్యలు మాని మేఘన కి ఎంతో మంది జీతం లేని బాడీగార్డులుగా పనిచేసారు. మేఘన కోసం ఒకరితో ఒకరు పోట్లాడుకునే వారు కూడా. ఎన్నో ప్రేమలేఖలు మేఘన కోసం ఎదురు చూస్తూ ఉండేవి. కనీసం తన వైపు చూస్తే చాలు అని అనుకునే మేఘన అభిమానులకి కొదవే లేదు. ఈ విషయం మేఘనకి గర్వ కారణం గా కూడా అనిపించేది. చిన్న పాటి గర్వం ఆమె నవ్వులో ప్రతిబింబించేది.

అలాంటి ఒక ప్రేమమయం అయిన రోజున మేఘనా అంజలి కలిసి షాపింగ్ కి వెళ్లి వస్తుంటే "ఆంటీ" అన్న పిలుపు వినిపించింది.

తన చుట్టు పక్కల ఉన్న వారెవరినయినా పిలుస్తున్నారేమో కాబోలు అని మేఘన అంజలి మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. మళ్లీ "తెల్ల చుడీదార్ ఆంటీ" అని వినబడేసరికి మేఘనకి కొంచెం అనుమానం వచ్చింది.

"కొంప దీసి వీడు తనని గాని ఆంటీ అని పిలవలేదు కదా, పిల్లలకి ఎవరు చీరలో లేదా చుడీదార్లో కనబడిన వాళ్ళందరూ అంటీలే, అలా అలవాటు చేసారు పెద్దవాళ్ళు" అని ఆ అబ్బాయితో "ఏంట్రా, అంటీ ఏంట్రా, ఏం కావాలి" అని గట్టిగా అడిగింది.

" మీరంటే .... "

"చెప్పు, అవతల లేట్ అవుతోంది"

"అదే మేడం, మీరంటే మా అంకుల్ కి అసహ్యమట..."

"వ్హాట్"

"అవును అంటీ, అసహ్యమట"

ఇంత వరకు తనని ప్రేమిస్తున్నానని తన అందాన్ని పొగిడి వెంట పడిన వారినే తను చూసింది. తానంటే అసహ్యమనే వ్యక్తి మీద ముందుగా కోపం వచ్చినా అతని గురించి తెలుసుకోవాలని మేఘనకి అనిపించింది.

మేఘన తో పాటు అంజలికి ఆశ్చర్యం కలిగింది.

"ఎవరు మీ అంకుల్, పద నన్నతని దగ్గరికి తీసుకువెళ్ళు" అని అంది

"అంకుల్ ఇప్పుడు ఇక్కడ లేడు ఆంటీ, మీరంటే అసహ్యమని చెప్పమన్నాడు చెప్పాను"

అసహ్యం అన్న మాట కన్నా ఆంటీ అన్న మాట ఇంకా బాధిస్తోంది మేఘనని

"బాబూ నన్ను అక్కా అని పిలు నీకు ఒక చాక్లెట్ కొనిస్తాగా" అంది

వెంటనే వాడు "చాక్లెట్ ఏది ఆక్కా" అనగానే అబ్బా వీడు మరీ ఫాస్ట్ గా ఉన్నాడే కొనిచ్చే వరకు వదిలేలా లేడు" అని మనసులో

అనుకుని, తీసుకో అని తన బాగ్ లోంచి ఒక డైరీ మిల్క్ చాక్లెట్ తీసి ఇచ్చింది.

"సరే, ఈ సారి మీ అంకుల్ ని నాకు చూపించు" అని అంది

"సరే అక్కా" అన్నాడు వాడు

"వాడెవడే, ఇంత అందగత్తెని, రాజ్ కపూరు సినిమా లో ని హీరోయిన్ లా ఉంది ఫిగరు అని నా చుట్టూ తిరిగే జనాలు, నా చూపు తగిలితే చాలు అని జనాలు ఉండగా 'నువ్వంటే నాకు అసహ్యం' అని ఒక పిల్లవాడి చేత చెప్పిస్తున్నాడు"

"దీనిలో రెండు కారణాలు ఉండొచ్చు మేఘనా, వాడు ఎయిథర్ నీ దృష్టిలో పడాలని అయినా ఇలా చేసుండొచ్చు లేదా నిన్ను వాడు నిజంగా అసహ్యించుకోవచ్చునువ్వి విషయాన్ని అంత సీరియస్ గా తీసుకోకు. "

"ఏంటి నన్ను అసహ్యించుకోవటమా, నో ఐ కాంట్ ఇమాజిన్. మేఘనా మేఘనా అంటూ ఈ ప్రపంచం నా పాదాల కింద ఉండాలి"

"మేఘనా మరీ నీకంత పొగరు మంచిది కాదే, రాను రాను నువ్వే ఇబ్బందుల్లో పడతావేమోనని నాకు భయం వేస్తోంది"

"అమ్మమ్మ కాలం నాటి కబురులు నువ్వూ, అయినా ఇంత చిన్న వయసులో నే నీకు వేదాంతాన్ని నూరిపోసిన మీ అమ్మమ్మననాలి."

"ఇదేమి వేదాంత ధోరణి కాదు, కాదు సత్యం, ఈ వయసులో ని ఆడపిల్లలు జాగ్రత్తగా ఉండాలి. దేనికీ అతిగా రియాక్ట్ అవ్వకూడదు. ఎనీవేస్ నువ్వు వాడి గురించి ఆలోచించుకుని నీ బుర్ర పాడుచేసుకోకు. ఆ పిల్లాడికి మళ్ళీ వాడు కనిపిస్తే చెప్తాడుగా అప్పుడు ఆలోచిద్దాం ఏం చెయ్యాలో, టేక్ కేర్ నాకు కొంచెం పని ఉంది. కొత్తగా ఒక పుస్తకం రిలీజ్ అయిందట. అర్జెంటు గా ఆన్లైన్ లో ఆర్డర్ చెయ్యాలి, బై"

"నువ్వూ నీ పుస్తకాల పిచ్చి. పుస్తకాలు ఉంటే నీకు ఎవరూ కనిపించరు కదా. ఓకే బై" అని మేఘన ఇంటి దారి పట్టింది.

ఎంతసేపటికి నిద్రపట్టకపోవడం తో మేఘన ఆ రోజు సాయంత్రం తను షాపింగ్ నుండి తిరిగి వస్తుండగా జరిగిన విషయం గురించి ఆలోచిస్తోంది.

"వాడు ఎవడయి ఉంటాడు, తనని ఎందుకు అసహ్యించుకుంటున్నాడు. వాడు ఎలా ఉంటాడు. వీడు నన్నే అంటీ అని అన్నాడంటే ఆ లాజిక్ ప్రకారం చూస్తే అతను కూడా యువకుడే అయి ఉండుంటాడు. చూద్దాం రేపు కనిపిస్తాడుగా నన్నెందుకు అసహ్యించుకుంటున్నాడో తెలుసుకోవాలి" అని మెల్లగా నిద్రలోకి జారిపోయింది.

***

తెల్లారింది. త్వరగా రెడీ అయి టిఫిన్ తింటున్న సమయం లో అంజలి మేఘనా వాళ్ళింటికి వచ్చింది.

"రామ్మా, కూర్చో. నువ్వు కూడా టిఫిన్ చెయ్యి" అని మేఘనా వాళ్ళ అమ్మ ఆప్యాయంగా అంజలిని పిలిచింది.

"లేదు ఆంటీ నేను ఆల్రెడీ టిఫిన్ చేసేసాను. ఇవాళ నేను కాలేజికి వెళ్ళట్లేదు మేఘన నోట్స్ నా దగ్గర ఉంది తనకిచ్చి వెళ్దామని వచ్చాను"

కనీసం మజ్జిగ తాగమ్మ అని మేఘన అమ్మగారు లోపలికి వెళ్లారు

"ఎంటే, బాయ్ ఫ్రెండ్ తో డేటా ఇవాళ"

"నీకెప్పుడు ఇదే గోల కదా, అలాంటిదేమీ లేదు మా ఇంటికి దూరపు బంధువులు వచ్చారు. అందుకని రావట్లేదు. సాయంత్రం కలుస్తాను క్లాస్ లో ఏం చెప్పారో చెప్పు."

"మజ్జిగ తాగమ్మ" అని మేఘన వాళ్ళమ్మ గారు అంజలికి మజ్జిగ ఇచ్చారు.

"థాంక్స్ అంటీ, మజ్జిగ చాలా బాగుంది. ఇంక వెళ్లొస్తాను, బై మేఘనా"

"బై" అని చెప్పి టైం చూసుకుంటూ హడావిడిగా టిఫిన్ తినడంలో నిమగ్నమయిపోయింది మేఘన.

***

ఆరోజు కాలేజి నుండి వస్తున్నప్పుడు ముందు రోజు కనబడిన అబ్బాయి మేఘనకి కనిపించాడు.

"ఒరేయ్ అగరా, ఆ అంకుల్ ఎవరో చెప్పు, నీకు బోలెడు చాక్లెట్స్ ఇస్తాను" అని బతిమాలుతూ అడిగింది మేఘన

"ఆంటీ" అని చాక్లెట్ చూడగానే "అక్కా చూపిస్తాను అదిగో దూరం గా నిలబడి ఫోన్ లో మాట్లాడుతున్నారే ఆ అంకులే" దొరికాడు. నేనంటే అసహ్యమా. చెప్తాను వాడి సంగతి అని దగ్గరికెళ్ళి నిలుచుంది. తానెవరో కాదు తన క్లాస్ మేటే. అందంగా నే ఉంటాడు కానీ ఎప్పుడూ మేఘన దృష్టి అతనిపై పడలేదు. ఇవాళ మాత్రం అతనిని నిశితం గా గమనించింది. "రాహుల్, ఏంటి నేనంటే అసహ్యం అది ఇది అన్నావట"

"అవును, అన్నాను"

"అంత అసహ్యమయితే నన్ను ఫాలో అవడం ఎందుకు"

"అసహ్యం నీ మీద కాదు. అందగత్తెవనే పొగరు నీ కళ్ళని కప్పేస్తుంది. ఆ పొగరు అంటే అసహ్యం"

"పొగరేంటి"

"మొన్న జరిగిన సంఘటన గుర్తుతెచ్చుకో. ఆ రోజు చైతన్య నీకు ప్రోపోస్ చేస్తే నలుగురిలో వాడి చెంప చెళ్ళుమనిపించావు. ఇష్టముంటే ఉందని చెప్పాలి లేదంటే లేదని చెప్పాలి. ఇంకా విసిగిస్తే పెద్దవాళ్ళకి చెప్పాలి. అంతే కాని అలా నలుగురిలో అవమానించకూడదు. నీ వల్ల వాడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. సమయానికి నేను వెళ్ళాను కాబట్టి ఆపాను. ఆ పొగరంటే నాకు అసహ్యం. ఇక మీదటైన నువ్వు మారతావని అనుకుంటున్నాను"

"నిజంగా అంత పని చేసాడా, నేనతన్ని కలవాలి క్షమాపణ అడగాలి"

"ఇప్పుడు అతను నువ్వంటేనే అసహ్యించుకుంటున్నాడు"

ఈ లోపు అటు వైపుగా వస్తున్నా అంజలి ఇదంతా గమనించింది. కన్నీటి పర్యంతమవుతున్న మేఘన వద్దకి వచ్చి "పద ఇంటికెలదాం" అని "రాహుల్ మేఘన తరపున క్షమాపణ అడుగు. మళ్ళీ కలుస్తాం" అని బయలుదేరారు.

దారిలో "చూసావా మేఘనా! ఆవేశం తో నువ్వు చేసిన పనికి ఓక ప్రాణం బలి అయ్యేది. ఇకనైనా మించి పోయింది లేదు. నువ్వు అందగత్తెవే కానీ నీ అందానికి అందం నీ మనస్సు. అందమైన మనస్సు ఉంటేనే ఎవరైనా గౌరవిస్తారు. అందం శాశ్వతం కాదు. ఇప్పుడు బాధపడకు. అతనికి ఏమీ కాదు." అని సముదాయించింది.

తన తప్పు తెలుసుకున్న మేఘన అప్పటి నుంచి వివేకం తో వ్యవహరించడం తెలుసుకుంది. అందానికి ఆభరణం మనసేనని అర్థం చేసుకుంది.




కా లింగ్ బెల్ అదే పనిగా మ్రోగటంతో వైభవలక్ష్మి వెళ్లి తలుపు తీసింది.

బిల బిలమని ఏడెనిమిది మంది లోపలికి చొచ్చుకొచ్చేసి 'మేము ఎ సి బి నుంచి వచ్చాము. మీరు మీ హస్బెండ్ పూర్ణచంద్రరావు ని ఇతర కుటుంబ సభ్యులెవరన్నా ఉంటే వాళ్ళనీ దయచేసి హాల్లోకి పిలవండి. ' అన్నాడొకాయన మర్యాద పూర్వకంగా. వైభవలక్ష్మికి అదంతా అయోమయంగా ఉంది. ఆమెకు ప్రపంచం తెలియదు. ఆమెకి వాళ్ళాయనే ప్రపంచం. వచ్చింది ఎవరో పెద్దవాళ్ళని మాత్రం అర్థం అయ్యింది. భర్తని, నాలుగు రోజులక్రితం పండక్కి వచ్చిన కొడుకు, కోడలు … కూతురు, అల్లుడ్ని గాభరాగా పిలిచింది. ఆవిడకేమన్నా జరిగిందేమో అని అందరూ హడావుడి గా పరిగెత్తికొచ్చారు.

పూర్ణచంద్రరావు కి అక్కడున్న వాళ్ళని చూడగానే విషయం అర్ధమై మొహాన చెమటలు పట్టాయి. అందరూ వచ్చేశారని కన్ఫర్మ్ చేసుకున్నాక ఆ ఆఫీసర్ 'వుయార్ ఫ్రం ఎ సి బి .... మీ ఇల్లు మేము సోదా చెయ్యటానికి మీరందరూ సహకరించండి. ఎవరికీ ఫోన్లు చెయ్యటం కానీ ఇతరత్రా విధానాల ద్వారా ఇన్ఫర్మేషన్ పాస్ చెయ్యటానికి గానీ ట్రై చెయ్యద్దు. మా పని మమ్మల్ని ప్రశాంతంగా చేసుకోనిస్తారని ఆశిస్తున్నాము'. అన్నాడు.

పూర్ణచంద్రరావు నిస్సత్తువతో పక్కనే వున్న కుర్చీలో కూలబడిపోయాడు. గుండె కొట్టుకునే వేగం రెట్టింపయింది. తన ఇంటి మీద ఎవరి కన్ను అయితే పడకూడదని అనుకున్నాడో వాళ్ళ డేగ కన్నే పడింది. దాపున కాచుకుని కూర్చున్న పులి పంజా విసిరినట్టు తనింటి మీద పడ్డారు. అయిపోయింది .... అంతా అయిపోయింది. తను పైసా పైసా కూడబెట్టినదంతా గ్రద్దల్లా తన్నుకుపోతారు. బీరువా తాళంచెవులు తీసుకుని బీరువాలోని రహస్య అరల్లో, ఇంకా ఎక్కడెక్కడో దాచిన బంగారం, వెండి, నగరంలో వివిధ చోట్ల వున్నా భవంతులు, స్థలాల పట్టాలు, ఫిక్స్ డ్ డిపాసిట్ సర్టిఫికెట్లు అన్నీ టీపాయ్ మీద కుప్పగా పోస్తున్నారు.

ఇహ చూడలేక పోయాడు పూర్ణచంద్రరావు. కళ్ళు మూసుకున్నాడు. అడ్డమైన గడ్డీ తిని అడ్డదిడ్డంగా సంపాదించిన సొమ్ము అది. ఏవేవో అస్పష్ట రూపాలు.... పైశాచిక నవ్వుతో తనకి భలే శాస్తి జరిగిందని మనో యవనికపై తిరుగాడసాగాయి. సంపాదన రంది లో పడి ఇన్నాళ్ళూ క్షణం తీరిక లేకుండా గడిపిన పూర్ణచంద్రరావు మనసు గుర్రం గతాన్ని స్పృశించడానికి వెనుకకు పరిగెడుతోంది.

*****　　　　*****　　　　*****

పూర్ణచంద్రరావు తండ్రి ఒక ప్రైవేటు కంపెనీ లో సాధారణ ఉద్యోగి. గంపెడు పిల్లలతో సంసార భారాన్ని అతి కష్టంగా మోసేవాడు. పూర్ణచంద్రరావుకి చిన్నప్పటినుంచి చదువంటే ఆసక్తి. చదువే తమ జీవితాలకి చుక్కాని అని అతి చిన్న వయసులోనే అవగాహన చేసుకున్నాడు. తండ్రి కూడా అది గమనించి పూర్ణచంద్రరావు ని అప్పో సొప్పో చేసి బాగా చదివించాడు. తమ భవిష్యత్తుకి అతడే అండా దండా అని ఆ ముసలివాళ్ళు అతన్ని శ్రద్ధగా చూసుకునేవాళ్ళు. పూర్ణచంద్రరావుకి ఇద్దరు అన్నలు , ఒక చెల్లి. అత్తెసరి మార్కులతో అర్ధాంతరంగా చదువులు ఆపేసి తమకు చేతనైన పనులు చేస్తూ ఇంటిని ఆదుకోసాగారు. పూర్ణచంద్రరావు క్షణం కూడా వృధా చెయ్యకుండా గవర్న మెంట్ ఉద్యోగాలకి అప్లై చేసి కాంపెటీటివ్ ఎగ్జామ్స్ కి బాగా ప్రిపేర్ అవుతుండేవాడు. ఎన్నో ప్రయత్నాలు చేసిన మీదట అన్ని స్థాయిల్నీ విజయవంతంగా దాటి ఇంటర్వ్యూ దాకా వచ్చాడు. అది పూర్తయితే ప్రభుత్వ ఉద్యోగే కానీ చాలా పెద్ద మొత్తం లంచం ఇవ్వాలి. ఇంటికెళ్ళి తండ్రికి విషయం చెప్పి అలాంటి అవకాశం మళ్ళీ మళ్ళీ రాదనీ అది

సద్వినియోగ పడేట్టు చూడాలని తండ్రిని ప్రాధేయ పడ్డాడు. ఆయన ఎంత ప్రయత్నించినా అంత డబ్బు అప్పు పుట్టలేదు. ఇహ చేసేదేమీ లేక తాతల నాటి స్థలాన్ని .. రేకుల ఇంటిని అమ్మేశాడు. ఆ వచ్చిన మొత్తం కొడుకుల చేత్తో పోస్తూ 'ఒరేయ్ పూర్ణా! నువ్వు గోప్పోడువయ్యి మాకింత నీడనిస్తావన్న నమ్మకంతో వున్న గూడు అమ్మేసాను. నీ తోడబుట్టిన వాళ్లకి... మాకు ఏ ఆధారం లేకుండా చేసుకున్నాను. ఆళ్ళెప్పుడూ నీకు అడ్డు రాలేదు. ఆల్లని కూడా నీవే సూడాల. రేపు నువ్వు మంచి కొలువులో కలకల్లాడత మమ్మల్ని మర్చిపోతే మాకు సావే గతి. అది గుర్తుంచుకోరా !' అన్నాడు కన్నీళ్ళతో. అప్పుడు అనిపించింది పూర్ణచంద్రరావు కి డబ్బు సంపాదించి తన వాళ్ళని సుఖపెట్టి తానూ సుఖపడాలని. డబ్బు సంపాదనే ధ్యేయంగా బ్రతకాలని. పైసా పైసాకి చూసుకోకుండా విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టే స్థాయికి ఎదగాలని. చిన్నపట్నుంచి డబ్బు లేక ఎన్నో వదులుకున్నాడు. రాజీ పడి జీవించాడు. ఇన్నాళ్ళకి అవకాశం వచ్చింది. ఇహ వుపేక్షించకూడదు. అనుకుని తండ్రి చేతిని ఆప్యాయంగా నొక్కి ఉద్యోగాన్ని లంచంతో కొనటానికి బయలుదేరాడు.

*****                    *****            *****

పూర్ణచంద్రరావు ప్రభుత్వోద్యోగి అయ్యాడు.

ఎన్నో ఏళ్ల తపస్సుకి భగవంతుడు ప్రత్యక్షమయ్యి వర మిచ్చినట్టుగా అహర్నిశలు కాసుల గల గలలు వినిపించే సీటు తనదయ్యింది. పనికో రేటు ... పని పూర్తి చేసే వ్యవధికి ఒక రేటు. బిల్స్ శాంక్షన్ అయితే అందులో వాటా. అందిన దాంట్లో పై వాళ్ళకి .. ఆ పై వాళ్ళకి పంచటం వల్ల ఎవరూ అతని మీద ఈగ వాలనిచ్చేవారు కాదు. ఎవరన్నా కంప్లైంట్ ఇస్తే అది కాగితాన్ని ఖరాబు చెయ్యటం తప్ప మరెందుకూ పనికి వచ్చేది కాదు. ఆ సీట్లో కూర్చుంటే కరడుకట్టిన ఆక్టోపస్. దయ దాక్షిణ్యాలు, మానవత్వం లాంటివి మచ్చుకైన కనిపించేవి కావు. సంపాదన ... సంపాదన. తల్లి తండ్రులకి అతి తక్కువ కాలంలో వూళ్ళో అన్ని వసతులతో ఇల్లు ఏర్పాటు చేసాడు. పొలాలు కొనిచ్చి అన్నయ్యలని బినామీలు గా చేసాడు. చెల్లెలికి మంచి సంబంధం చూసి పెళ్లి చేసాడు. ఊళ్ళో వాళ్ళంతా 'ఏం కొడుకుని కన్నావయ్యా! మాణిక్యం లాంటి కొడుకు. తల్లి తండ్రుల్ని .. తోడ పుట్టినవాళ్లని కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు.       నీ శ్రమ ఊరికే పోలేదు. నీకు సొరగం చూపిస్తున్నాడయ్య...సొరగం' అని తండ్రితో అంటుంటే విన్నట్టుగా విని గర్వ పడిపోయేవాడు. సీనియర్లు 'ఏం       స్పీడయ్యా నీది పూర్ణచంద్రరావు ఇన్నాళ్ళుగా సీట్లని పట్టుకుని గబ్బిలాలుగా వెళ్ళాడుతున్నా ఓ స్థలం కొన్నదీ లేదు ... ఇంట్లో ఓ ఖరీదైన వస్తువూ అమర్చుకున్నదీ లేదు. నీ ధైర్యం మాకు రమ్మన్నా రాదు. దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవటమెలాగో నిన్ను చూసే నేర్చుకోవాలి' అనేవాళ్ళు. తన వాళ్లకి అన్నీ సమకూర్చాక ఇహ తనకోసం ఆలోచించటం మొదలుపెట్టాడు.

దాదాపు ఎనభై శాతం మంది వ్యాపార ప్రయోజనాల కోసం వచ్చేవాళ్ళు కాబట్టి అడిగినంత ఇచ్చేవాళ్ళు... కాని కొంత మంది దరిద్రులు దేబరిస్తూ ఫైలు మీద తన సంతకం కోసం పరితపిస్తూ వెంటాడుతుంటే చిరాగ్గా వుండి చీదరించుకొనేవాడు. అయినా

వదిలితేగా! డబ్బు చేతిలో పడితే గాని పని జరగదని నిక్కచ్చిగా.. సూటిగా చెప్పినా జిడ్డులా వదిలేవాళ్ళు కారు. వచ్చిన వాళ్ళలో తన తల్లి తండ్రి వయస్కులున్నప్పటికినీ అతని మనసు కరిగేది కాదు. ఓ ముసలాయన కాళ్ళరిగేలా తన చుట్టూ తిరిగి ఆఖరికి తన సీటు దగ్గరే ప్రాణాలొదిలాడు. అయినా అతనిలో ఇసుమంత మార్పు కూడా లేదు. ఎంత మంది శాపనార్థాలు పెట్టినా లక్ష్యపెట్టేవాడు కాదు. డబ్బు అతనికి ప్రియమైన భాష. మాంచి పోష్ ఏరియాలో విలాసవంతమైన ఇల్లు కట్టుకున్నాడు. ఇంట్లోకి కావలసిన హంగులన్నీ సమకూర్చుకున్నాక బోలెడంత కట్నకానుకలతో కాంట్రాక్టరు కూతురు వైభవలక్ష్మిని భార్యని చేసుకున్నాడు. జీవితం సునాయాసంగా నల్లేరుమీద బండి నడకలా సాగిపోనున్నంతలో ఈ ఉపద్రవం .. ఆశనిపాతం

*****          *****          *****

"పూర్ణచంద్రరావుగారూ" ఆఫీసర్ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చి కళ్ళు తెరిచాడు.

ఎదురుగా టీపాయి మీద తను కూడబెట్టిన సొమ్ము గుట్టలా వుంది. ఎన్నాళ్ళ నుండి ఎంత మందిని పీడిస్తే అది సాధ్యమవుతుంది? ఏమీ చేయలేని పరిస్థితి. గుండెకు చిల్లులు పడి కన్నీరు కాల్వలు కట్టడానికి సిద్ధంగా వుంది. అవసరార్థం వచ్చిన ఏ తల్లో డబ్బు చేతిలో పడితే తప్ప పని చేయనని తెలిసి కంట తడితో... కడుపు మండి శపించి వుంటుంది. అందుకే... అందుకే ఇలా బ్రతుకు వీధిలో పడబోతుంది. తండ్రి తన ఉద్యోగానికి లంచమివ్వడానికి ఎన్ని కష్టాలు పడ్డాడో చూసి కూడా తను తప్పు దోవ పట్టాడు. డబ్బే పరమావధి అని తప్పుగా అర్థం తీసుకున్నాడు. సరిదిద్దుకోలేని తప్పు చేశాడు. ఇన్నేళ్ళ సర్వీసులో తన మూలంగా ఎంత మంది జీవితాలు నాశనమయ్యాయో! దేశానికి ఎంత నష్టం జరిగిందో! తను చేసింది ఘోర పాతకం. నిష్కృతి లేని పాపం. నిజానికి తనకింత డబ్బు అవసరమా? ఏం చేసుకుంటాడు? తరతరాలకి సంపాదించి పెట్టాలన్న తపన ఎందుకు? ఇప్పుడు వీళ్ళు తన ఆస్తులన్నీ జప్తు చేసినా తను పాడు చేసిన జీవితాలు బాగు పడతాయా? ప్రజలకి సేవ చేయడానికి ప్రభుత్వ శాఖలు.. అందులోని ఉద్యోగులు. కాని జరుగుతున్న దేమిటి? మొదటి నుండి అవినీతికి ఆస్కారముండే సీట్ల మీద ప్రభుత్వ అజమాయిషీ వుంటే ఇలాంటివి జరగవు కదా.. అంటే ప్రభుత్వం కూడా చూసి చూడనట్లు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుంది అన్నమాట. ఎప్పుడో ఒక సారి తూ తూ మంత్రంగా దాడులు జరపండి. మొక్కుబడి జప్తులు, సస్పెన్షన్లు. ఇదో చర్వితచరణం. ఈ ఆలోచనలేవి ఇంతకు ముందు కలగలేదేమిటి? అసలు ఆలోచించే సమయముంటే కదా! తనలాంటి వాళ్ళు ఎంతో మంది? ఈ దేవుడన్నా తనకి అవకాశం కల్పిస్తే తను అన్యాయం చేసిన వాళ్ళ కాళ్ళు కన్నీటితో కడిగి పునీతుడవ్వాలని వుంది. పశ్చాత్తాపం అతడిని దహించి వేస్తుంది.

"ఈ డబ్బంతా మీ సమక్షంలో మీ ఇంట్లో మేము సోదాలు చేసి రాబట్టినదని.. సొమ్ము మీదేనని సంతకం చేయండి." అని ఫైల్ ముందు పెట్టాడు ఆఫీసర్. సంతకం చేయడానికి చేయిలేపలేకపోయాడు. సన్నగా మొదలైన గుండెనొప్పి క్షణాల్లో పూర్ణచంద్రరావుని అచేతనున్ని చేసింది. తన సంపాదన గుట్ట మీద వాలిపోయాడు.




"మమ్మీ! ఏమాటకామాటే చెప్పాలే. ప్లేట్లో చందమామల్లా కనిపించే ఈ ఇడ్లీలు నోట్లో వేసుకోగానే వెన్నముద్దల్లా కరిగిపోతున్నాయి. ఏ హోటల్లో తిన్నా ఈ ఇడ్లీల రుచి రమ్మంటే రాదుగా..నువ్వలా వడ్డిస్తూ ఎన్ని తిన్నావని అడిగావనుకో, నా మాథమేటిక్స్ తప్పు చెప్తాయి." అన్నాడు అభినందనగా కృష్ణతేజ.

"అంతలా నీకు నువ్వే దిష్టి పెట్టుకోకు. రాళ్ళయినా తిని అరిగించుకునే వయసు నీది. ఈ ఇడ్లీలదేముంది?" అంటూ మాలక్ష్మి మరో రెండు ఇడ్లీల్ని అతడి ప్లేట్లో వేసింది. "అమ్మో మళ్ళీ ఇడ్లీలా?"

"ఏదో అయ్యర్ హోటల్లో ఆర్డరిచ్చినట్టు అంత అల్పంగా తింటావేం? కాస్త కొబ్బరి చెట్నీ వేసుకుని ఈ రెండూ కానిచ్చేసెయ్" ముద్దుగా గదమాయించింది కొడుకుని.

"ఇన్ని ఇడ్లీలు తిన్న తర్వాత ఆఫీసులో పని చేయగలనా? అన్నదే నా డౌట్" అన్నాడు కృష్ణతేజ. ఇంతలో సిటీ బస్ హారన్ గట్టిగా వినిపించింది. ఆ సౌండ్ వినగానే కూచున్న చోట్లోంచి ఒక్క ఉదుటన ఎగిరి గంతేసాడు కృష్ణతేజ.

"ఏమైంది?"

"బస్ హారన్ మోగుతోందే"

"అయితే?"

"నా గెస్ కరెక్ట్ అయితే అది నంబర్ టెన్ డైరెక్ట్ బస్సే. ఈ బస్ కానీ తప్పిపోతే నరకమే. ఆ తర్వాత ఇక్కడ్నుంచి రేతిఫైల్ బస్ స్టేషన్..అక్కడ్నుంచి సికింద్రాబాద్ స్టేషన్ వరకూ నడక.. ఆ పై సగం దూరం వరకూ ఓ బస్.. ఆఫీస్ దాకా ఇంకో బస్..అలా అంచెలంచెలుగా సిటీ బస్ లు అందుకుంటూ నే వెళ్ళే సరికి ఆఫీసు మూసే వేళవుతుంది. ఇంత ప్రయాసపడి అక్కడ చేసేదేముంటుంది? వెంటనే యూ టర్న్ తీసుకుని మన కాలనీకొచ్చే బస్ పట్టుకోవడమే..." గబగబా వాష్ బేసిన్ దగ్గరకెళ్ళి చేతులు కడుక్కుని తువ్వాలు కోసం చూడకుండా అందుబాటులో ఉన్న అమ్మ చీరకొంగుతో వాటిని తుడిచేసుకున్నాడు.

ఆ తర్వాత అంతే హడావుడితో అప్పటికే సర్ది ఉంచిన బ్యాగ్ భుజాన వేసుకుని గేట్ తలుపులు తెరచి పరుగందుకున్నాడు.

"తను...తనతో పాటు పక్కవాళ్ళనీ ఆఖరి నిముషంలో గాభరా పెట్టడం...చిన్నప్పట్నుంచీ వీడింతే" అనుకుంటూ గేట్ మూసి ఇలా లోనికొచ్చిందో లేదో అలా తలుపు చప్పుడైంది.

తెరచి చూస్తే ఎదురుగా కృష్ణతేజ.

"ఏమైనా మరచిపోయావా?"

"లేదు...?"

"ఆఫీసు లేదా"

"బస్ లేదు"

"తుపాను మెయిల్లా వెళ్ళావ్ కదా ఆ డొక్కు సిటీబస్ అందుకోలేకపోయావా?""

"అందుకోలేనంత వేగంతో వెళ్ళిపోయింది" చెప్పాడు కృష్ణతేజ.

"మరో బస్ రావాలంటే ఎట్లీస్ట్ ఫిఫ్టీన్ మినిట్స్ పడుతుంది. వెధవ బస్...వెళ్ళిపోతోందని నోట్లో ఇడ్లీ గొంతులో దిగబడ్డా కనీసం మంచినీళ్ళు తాగకుండా పరుగు తీసాను. ఆయాసం తప్ప..బస్ అందలేదు." చిరాగ్గా అన్నాడు కృష్ణతేజ.

అతడి మాట పూర్తవకుండానే ఓ గ్లాస్ తో మంచినీళ్ళు తెచ్చింది మాలక్ష్మి.

"అందుకే నిన్ను అమ్మ అన్నారు.మనసులో అనుకున్నది మాటల్లోకి రాకుండానే అమలు చేసేస్తావ్."గడాగడా మంచినీళ్ళు తాగుతూ గలగలా అన్నాడతడు.

"ఈ మాటలకేం గానీ..తొందరగా వెళ్ళి ఈ సారైనా బస్ పట్టుకో" సూచించింది మాలక్ష్మి.

"ఓ..అలాగే" అంటూ కృష్ణతేజ నెమ్మదిగా వెళ్ళాడు.

"ఎలాగో...అవ్వాల్సిన ఆలస్యం అయ్యింది..ఇవాల్టికి బాసుడి తిట్ల దండకం వినాల్సిందే" అనుకున్నాడతడు మనసులోనే.

ఉద్యోగస్తుడంటూ అయాడు గాని అతడిలో స్టూడెంట్ లక్షణాలు ఇంకా పోలేదు. కొన్ని క్లాసులు పోయినా ఓ గంట అటో, ఓ గంట ఇటో ప్రతి రోజూ కాలేజికి వెళ్ళి వస్తూండే వాడు. కాని అఫీసుకంటే అలా కుదరదు కదా! టైమంటే టైమే. అదే సెట్ చేసుకోలేకపోతున్నాడు కృష్ణతేజ

"ఎలాగైనా సరే ఇకనుంచి అఫీసుకి ఇంటైం లోనే ఉండాలి" అలస్యమైన రోజు అతడు తీసుకున్న నిర్ణయం అది.

వాసవి కాలనీ బస్టాప్ కి ప్రతిరోజూ ఎనిమిదిన్నరకొచ్చే నంబర్ టెన్ సిటీ బస్ ఒక్కోసారి పదిపదిహేను నిముషాలు ఆలస్యంగానే బయలుదేరుతుంది "ఎలాగ్గో లేట్ గా బయలుదేరుతుంది కదా " అని కృష్ణతేజ ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా..ఆరోజే ఠంచనుగా బయలుదేరుతుంది. అలా ఉద్యోగ జీవితంలో ఆ సిటీబస్ దాగుడుమూతలాడుతున్న నేపథ్యంలో ..ఓరోజు అతడికి తత్వం బోధపడింది. ఆరోజు ఎప్పటిలాగానే సిటీబస్ రాక కన్నా అయిదు నిముషాలు ముందుగానే బస్టాప్లో నిల్చున్నాడు కృష్ణతేజ. కండక్టర్, డ్రైవర్, బస్ దిగారు. చుట్టూ పరిసరాల్లో పరిచితమైన ప్రయాణికుల మొహాల్ని పరికించారు. అప్పటికే ఆ బస్ కోసం ఎదురు చూస్తున్న చాలామంది ఒక్క ఉదుటన బస్లోకి దూకేసి దొరికిపుచ్చుకున్న సీట్లలో మఠం వేసి మరీ కూర్చున్నారు.ఇక, బస్ బయల్దేరాల్సిన సమయం ఆసన్నమైంది. కండక్టర్ ఒక్కొక్కరిదగ్గరకొచ్చి టిక్కెట్లు ఇస్తూ పాస్ లు చెక్ చేస్తున్నాడు. ఆ చివర్నుంచి ఈ చివరి వరకూ డ్యూటీ పూర్తి చేసుకున్న కండక్టర్ ఓ చక్కని విజిల్ వేసాడు. ఆ ఈల గోలకి హారన్ మోగించి బస్ స్టార్ట్ చెయ్యాల్సిన డ్రైవర్ నిమిత్తమాత్రుడిలా తన సీట్లో కూచున్నాడు తప్ప కండక్టర్ విజిల్ కి కనీసమాత్రంగానైనా స్పందించలేదు. బస్సులో జనాలకి సహనం నశిస్తోంది. ఒకరిద్దరు కండక్టర్ కి వత్తాసుగా "రైట్..రైట్.."అని అరిచారు. అయినా డ్రైవర్లో స్పందన్ నిల్. మరో రెండు నిముషాలు గడిచాయి. ప్రయాణికులు బస్ ని కొడుతూ చప్పుడు చేస్తున్నారు. ఇక, ఈ గొడవ భరించలేని డ్రైవర్ ఎట్టకేలకు స్టార్ట్ చేసాడు. అయితే, యాక్సిలేటర్ మీద కాలు మోపలేదనే సంగతి అందరికీ తెలుస్తూనే ఉంది. బస్ నడిపేందుకు తాను సమాయుత్తుడైనట్టు సంకేతాన్ని అందిస్తున్నాడే తప్ప ఆ విధిని సంపూర్ణంగా అతగాడు నిర్వర్తించడంలేదు. తాను ఒక్క సెకన్ లేటుగా వచ్చేసరికి అందనత దూరం పారిపోయే సిటీబస్ ఇవాళ కండక్టర్ విజిలేసినా కదలడం లేదని కృష్ణతేజకి ఆశ్చర్యం వేసింది. కారణం తెలుసుకోవాలనే ఆసక్తి అధికమవుతుండగా...ఇద్దరు లేడీస్ బస్ ఎక్కారు.

"పెద్ద అంటీ వచ్చింది ఇక బస్ రైట్..రైట్..."అని ప్రయాణికుల్లో ఒకడు అరిచాడు. బస్సెక్కిన ఆ ఇద్దరిలో పాతికేళ్ళ సుందరి ఒకరు. ఆమె ఎక్కుతూనే డ్రైవర్ వేపు ఓ చూపు చూసి నెమ్మదిగా"థంక్స్"అంది. లిప్ స్టిక్ అధరాల సుందరి చెప్పిన కృతజ్ఞతకి పొంగిపోయిన ఖాకీ దుస్తుల చక్రధారి యాక్సిలేటర్ నేలకు తగిలేలా కాలితో తన్నాడు.

"బస్ ఇంతవరకూ కదలకపోవడానికి కారణం ఇదా?"కృష్ణతేజ అనుకుంటూండగానే సరిగ్గ లేడీస్ సీట్ కి వెనకనున్న సీట్లోంచి ఇద్దరు వ్యక్తులు సడన్ గా లేచి "రండి..రండి.." అని ఆహ్వానించారు.వాళ్ళిద్దరూ నవ్వుతూ పలకరించి..వాళ్ళు ఆఫర్ చేసిన సీట్లో కూచుండిపోయారు.

"ఏంటివాళ లేట్ ? సీట్లు ఆఫర్ చేసిన ఇద్దరు యువకులు అడిగారు.

"ఇంట్లో దేవుడి పూజ.తొందరగా అవుతుందనుకున్నా.అవలేదు."అంటూ ఆ ఇద్దరిలో పెద్దావిడ ఆ ఇద్దరు యువకులకు ప్రసాదం ఇచ్చింది. తర్వాత " మీరు సీట్లు ఇచ్చి నిల్చుండిపోయారు.మాకు బాధగా వుంది" అన్నారు.

"ఫర్వాలేదు. సికింద్రాబాద్ లో ఎలాగో బస్ ఖాళీ అవుతుంది. అక్కడ సీట్లు దొరొకుతాయి. అయినా, రోజూ మీరు టైముకే వస్తున్నారు. మీ సీట్లలోనే మీరు కూచుంటున్నారు. ఇవాళే కదా మీకు మేం సీట్లు ఆఫర్ చేసాం" అన్నారు.

"అమ్మాజిగారొస్తున్నారా?"అడిగింది పెద్ద అంటీ.

"ఇందాకే సెల్ఫోన్ లో ఎలర్ట్ చేసా..బస్ కాస్త లేట్ అని"

"బస్ బయల్దేరిందని వెంటనే మెస్సేజ్ పంపించండి. బస్టాప్ లో వెయిట్ చేస్తుంటుంది.లేకుంటే, ఇంకా బయల్దేరలేదని ఇంట్లోనే ఉండిపోతుంది."పెద్ద ఆంటీ హెచ్చరించింది.

ఆ వెంటనే ఆ ఇద్దరిలో ఓ యువకుడు "సురేష్..అమ్మాజిగారికి ఫోన్ చెయ్యి"అన్నాడు. అంతే! నెక్స్ట్ బస్టాప్ లో అలర్ట్ గా ఉండమంటూ ఈ బస్ లోని సురేష్ సదరు అమ్మాజికి ఫోన్ చేసి చెప్పాడు. మరో పది నిముషాలకి ఈ సిటీ బస్ నెక్స్ట్ బస్టాప్ కి చేరుకోవడం...అక్కడ అమ్మాజి అనే మరో మహిళ వీళ్ళతో కలవడం చకచకా జరిగిపోయాయి.

ఆ ఒక్కరోజే కాదు..ఆ బస్ లో ప్రతిరోజూ వీళ్ళంతా ఇదేరకమైన సహాయాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నారు.ఆఫీసుకి సకాలంలో చేరుకోవాలంటే, ఖచ్చితంగా ఈ ఒక్క బస్ అందుకోవాలంటే ఒకే సమయంలో బయలుదేరే ప్రయాణీకుల మధ్య ఈ తరహా 'నెట్ వర్క్' ఈ స్థాయి కమ్యూనికేషన్ ఉండితీరాల్సిందే.

ఒకవేళ ఈ నెట్ వర్క్ లేకుండా తనలా ఒంటరిగా ఉండిపోతే 'వానరాకడ ప్రాణం పోకడే కాదు ఈ సిటీ బస్ రాకపోకల సంగతి ఆగమ్యగోచరమే.!అందిన రోజున బస్ అందుతుంది, లేనిరోజున లేదు.

ఇక కృష్ణతేజ ప్రతిరోజూ ఆ బృందాన్ని క్యురియాస్ గా అబ్సర్వ్ చేయడం మొదలుపెట్టాడు.

వాళ్ళు బస్ లో ఉన్నారంటే వేయి పండగలు మూకుమ్మడిగా పండగలు చేసుకున్నట్టే.

ముందు వెనక సీట్లలో అడ్జస్ట్ అయిపోయి లెక్కలేనన్ని "కహానీలు"చెప్పుకుంటారు. జోక్ లు కట్ చేసుకుంటారు. కడుపుబ్బా నవ్వుకుంటారు. తమచుట్టూ ఓ ప్రపంచం ఉందనీ..ఆ ప్రపంచంలో మనుషులున్నారన్న సంగతిని ఏమాత్రం గుర్తించకుండా తమదైన లోకంలో హాహాయిగా విహరిస్తుంటారు.

అంతే కాదు, సిటీలో అడుగడుగునా అడ్డుతగిలే 'రెడ్ సిగ్నల్స్' , 'ట్రాఫిక్ జాం'లను పట్టించుకోని బోర్ ఫీలవకుండా ముచ్చట్లాడుకుంటారు. చూసిన సిన్మాల గురించి..తమ ఆఫీసుల్లో వేధించే బాసుల గురించి సెటైర్లు వేసుకుంటారు.మధమధ్య

బర్త్ డే ఫంక్షన్లు జరిపేసుకుని చాక్లెట్లు పంచేసుకుంటారు. ఆ చాక్లెట్ల ల పంపిణీ కేవలం వాళ్ళమధ్యే ఉండదు. కండక్టర్, డ్రైవర్లను ఏనాడో తమ బృందంలో కలిపేసుకున్నారు కదా! వాళ్ళ చేతుల్లోనూ గుప్పెడు చాక్లెట్లు పోస్తారు. వాళ్ళందరి పేర్లూ కృష్ణతేజకిపుడు తెలిసిపోయాయి. ఆ బృందంలో పెద్ద ఆంటీ , చిన్న ఆంటీ అనే ఇద్దరున్నారు. వయసు తేడా బట్టి వాళ్ళిద్దరిని అలా సంబోధిస్తూంటారు.

ఎర్రెర్రని పెదాల్తో తియతీయగా డ్రైవర్కి థంక్స్ చెప్పిన సుందరాంగి పేరు అలివేలు మంగతాయారు. నెక్స్ట్ బస్టాప్లో బస్సెక్కే ఆవిడ పేరు అమ్మాజీ.అంతే కాకుండా ఆ బృందంలో ఉన్న యువకుల్లో ఒకరు సురేష్ కాగా మరొకరు ఆనంద్.

వీళ్ళంతా బస్ ప్రయాణాన్ని ఎంచక్కా ఎంజాయ్ చేస్తున్నారు.

రోజురోజుకి వాళ్ళని చూస్తుంటే కృష్ణతేజకి ముచ్చటేస్తోంది.

ప్రయాణంలో వాళ్ళని గమనించడం..వాళ్ళ మాటల్ని ఆసక్తిగా వినడం..ఓరోజు వాళ్ళలో ఏ ఒక్కరు రాకపోయినా వెలితిగా ఉండడం వాళ్ళతో అసలు పరిచయమే లేని కృష్ణతేజకి కూడా ఈమధ్యనే అనుభవంలోకి వస్తోంది.

కొత్తగా చేరిన ఆఫీసు విషయాలు కాకుండా..ఈ సిటీ బస్ అనుభవాల్నే అమ్మతో ఎక్కువగా పంచుకుంటున్నాడతడు.

"లేచిందగ్గరుంచీ రోజూ సిటీ బస్ కోసం హైరానా పడడం..ఆ వీధిలో వినిపించే హారన్ కి ఈ వీధిలో ఉన్న నువ్వు ఉలిక్కి పడడం నిరోధించాలంటే ఒక్కటే సలహా" ఓరోజు కృష్ణతో అంది మాలక్ష్మి.

"చెప్పమ్మా"

"నువ్వుకూడా ఆ బృందంతో కలిసిపో. ఎలాగో, అదే బస్ లో ట్రావెల్ చేస్తున్నావ్ కదా!వాళ్ళతో ఫ్రెండ్ షిప్ చేసేయ్"చెప్పింది మాలక్ష్మి.

"కుదురుతుందా?"

ఏం...ఎందుకు కుదరదు?ఒకే స్కూల్లో చదివితే స్కూల్ మేట్స్.ఒకే క్లాసులో ఉంటే క్లాస్ మేట్స్...ఒకే బస్ లో జర్నీ చేస్తే ..."

"బస్ మేట్స్"అన్నాడు కృష్ణతేజ.

ఆ మర్నాడే వాళ్ళని పలకరించి పరిచయం చేసుకోవాలనుకున్నాడు కృష్ణతేజ.

అయితే ఆ రోజు అనుకున్న సమయానికే సిటీ బస్ వచ్చింది. వాళ్ళెవరూ ఎక్కకుండానే కండక్టర్ విజిల్ వేసీ వేయగానే బస్ కదిలింది. ఆరోజు ఒక్కరంటే ఒక్కరూ ఆ బస్ ఎక్కలేదు. వాళ్ళు రారనే సనాచారం ముందుగానే డ్రైవర్ కి, కండక్టర్ కి తెలుసు కాబోలు..వాళ్ళకోసం ఎదురుచూడకుండా బస్ ని నడిపేసాడు. వాళ్ళు లేని బస్ ప్రయాణం బోర్ గా ఉంది కృష్ణతేజకి.

అందరూ ఒకేసారి కట్టకట్టుకుని ఎందుకు రాలేదు? అందరి ఆఫీసులకి ఒకేరోజు సెలవిచ్చేసారా?

అలా ఎలా కుదురుతుంది?

ఒక్కొక్కరు ఒక్కొక్క స్టాప్ లో దిగుతారు. ఒక్కో ఆఫీస్ లో పని చేస్తున్నారు.

ఏదైనా స్పెషల్ ప్రోగ్రాం వేసుకుని వాళ్ళంతా మూకుమ్మడిగా సెలవు పెట్టారా?

బహుశా ....అదే అయి ఉంటుంది.

అలా అనుకుని సంతృప్తి పడుతున్నాడు కృష్ణతేజ.

తన ఆఫీస్ స్టాప్ దగ్గర బస్ దిగబోతూ కండక్టర్ లో మొదటిసారిగా మాట కలిపాడు. "వాళ్ళల్లో ఏ ఒక్కరూ ఇవాళ ఈ బస్ ఎక్కలేదేం?"

"మీరడుగుతోంది..అలివేలు మంగతాయారు టీం గురించా?" ఎదురు ప్రశ్నించాడు కండక్టర్.

"ఔను.. ఆ టీం గురించే.."

"నిన్న సాయంత్రమే పెద్ద ఆంటీకి యాక్సిడెంట్ అయింది. అదుపు తప్పిన ఓ సిటీ బస్ ఢీ కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది.

ఇవాళ ఆమె అంత్యక్రియలు. ఆమె చివరి చూపు కోసం పెద్ద ఆంటీ ఇంటికి వెళ్ళారు..."

"అందుకేనా ఆ టీం లో ఏ ఒక్కరూ ఇవాళ ఈ బస్సెక్కలేదు..." అనుకున్నాడు కృష్ణతేజ.

ఆ తర్వాతి రోజు వాళ్ళంతా అదే బస్సు ఎక్కారు. వాళ్ళల్లో ఇదివరకటి సందడి కనిపించలేదు.

ప్రతి ఒక్కరి ముఖంలోనూ దిగులు తాండవితోంది.

పెదాలపై నవ్వులు లేవు. హుషారు పలకరింపులు అస్సలు లేవు.ఆ సిటీ బస్ లో ప్రతిరోజూ పెద్ద అంటీ కూచునే సీట్ లో ఇంకెవరో కూచోవడాన్ని కృష్ణతేజ కూడా గమనించాడు. వాళ్ళ దగ్గరకి వెళ్ళాలనీ..వాళ్ళ భుజంపై చేయి వేసి ఓదర్చాలనీ..వాళ్ళ గుండెల్లో గూడు కట్టుకున్న బాధని తను కూడా షేర్ చేసుకోవాలని ...ఎంతగానో అనిపించింది కృష్ణతేజకి. అయితే, నిన్నటిదాకా ప్రయాణికుల్లో ఓ ప్రయాణికుడిలా ట్రావెల్ చేసిన తను...ఇపుడు ఇలాటి విషాదకర నేపథ్యంలో వాళ్ళతో ఏ విధంగా కలవగలడు? ఆ సందేహంతోనే కలవలేకపోయాడు. అయితే, ఆ విషయాన్ని ఆ విషాదాన్ని అమ్మతో పంచుకున్నాడు కృష్ణతేజ.

ఆ తర్వాత్తర్వాత -

ప్రతిరోజూ వాళ్ళని పలకరించాలని అనుకుంటూనే వాయిదా వేస్తూ వచ్చాడు. ఇంతలో కృష్ణతేజకి మరో మంచి ఉద్యోగం వచ్చి ఆ కాలనీ నుంచే కాదు, ఆ ఊరినుంచే నిష్క్రమించాడు, ఉన్న ఒక్కగానొక్క తల్లితో సహా.

పదేళ్ళ తర్వాత-

మళ్ళీ సికింద్రాబాద్ లో కాలు మోపాడు కృష్ణతేజ.

ఈ పదేళ్ళలో ఏఎన్నో మార్పులు జరిగాయి. మాలక్ష్మి మరో లోకానికి వెళ్ళిపోయింది. కాగా..కృష్ణతేజకి భర్త హోదా కల్పిస్తూ అతడి ఇంటికి ఓ ఇల్లాలొచ్చింది. అంతే కాదు, ఆఫీసులో కొన్ని ప్రమోషన్లతో పాటూ ఇద్దరు పిల్లల తండ్రిగా కూడా సామాజిక హోదా వచ్చింది.

సికింద్రాబాద్ లో పని ముగిసేసరికి సాయంత్రం ఐదు గంటలైంది.

ఇక ఈ ఊళ్ళో పనేం లేదు. తిరిగి ట్రైనెక్కి తన ఊరు వెళ్ళిపోవడమే. అంతకుముందు ఒక్కసారి వాసవీకాలనీని చూడాలనిపించింది. అయితే ఈ సాయంత్రం వేళ కాదు. ఉదయం ఎనిమిదిన్నర గంటలకి ఆ కాలనీ అంతా ఒక్కసారి తిరగాడాలనిపించింది.పదేళ్ళ కిందటి రోజుల్ని తలచుకొంటూ..అప్పటి జ్ఞాపకాల్లో తలమునకలవ్వాలనే వెర్రి కోరిక వెల్లువెత్తిందతడిలో.

అందుకే అరగంటక్రితం సెల్ ఫోన్ చేసిన తన శ్రీమతితో "ఇవాళ తను బయల్దేరడంలేదనే" సమాచారం అందించాడు. తర్వాత ఓ లాడ్జిలో రూం తీసుకుని బస చేసాడు.

ఇక, ఆ రాత్రంతా కృష్ణతేజకి నిద్ర కరవే. ఎపుడెపుడు తూరుపు తలుపు తెరుచుకుంటుందా?

ఎపుడెపుడు ఆకాశాన అరుణోదయమౌతుందా?

ఎపుడెపుడు వెలుగుల కిరణాలు లోకాన్ని పలకరిస్తాయా?అని ఆశగా ఎదురుచూస్తూ కూచున్నాడు.

కొన్ని గంటల తర్వాత

నిద్రలేమి కారణంగా అతడి కళ్ళల్లోని ఎరుపు కాస్తా తూరుపున ప్రభవించింది. తెల్లరింది. గబగబా తయారై కృష్ణతేజ వాసవీ కాలనీకి వచ్చాడు. ముందుగా తాము ఇదివరకు అద్దెకున్న ఇంటిని చూసి పోల్చుకోలేకపోయాడు.

ఇపుడక్కడో భవంతి వెలిసింది. ఆ తర్వాత వడివడిగా నడుస్తూ కాలనీ బస్టాప్ కి చేరుకున్నాడు.

ఇప్పుడు వాసవీ కాలనీ బస్టాప్ దగ్గర అన్నీ కొత్త ముఖాలే. ఒక్క పరిచితమైన ముఖం లేదు. వాళ్ళ హడావుడి చూస్తుంటే..ఆఫీసులకు వెళ్ళేందుకు సమాయుత్తమౌతున్నారని తెలుస్తోంది. ఒకప్పటి తనలాగే.

సరిగ్గా ఎనిమిదిన్నరకే నంబర్ టెన్ బస్ వచ్చింది. బస్ లోని కండక్టర్, డ్రైవర్ కిందకు దిగారు.

వాళ్ళవీ కొత్త ముఖాలే. అయినా సరే. ఇదే సిటీ బస్ ఎక్కి ఒకప్పటి తన ఆఫీస్ బస్టాప్ దాకా ప్రయాణించాలనుకున్నాడు.

అంతే! గుంపును ఛేదించుకుంటూ తనూ గబగబా బస్సెక్కాడు.

ఇదివరకు కూచునే కిటికీ పక్క సీట్లోనే ఇపుడూ కూచున్నాడు.

ప్రయాణీకులంతా ఎవరి సీట్లలో వాళ్ళు కూచున్నాక కండక్టర్ వచ్చి టిక్కట్లు ఇష్యూ చేసాడు. ఇక బస్ బయల్దేరాల్సిన సమయం ఆసన్నమైంది. కండక్టర్ ఒక్కొక్కరి దగ్గరకు వచ్చి టిక్కెట్లు ఇస్తూ పాస్ లు చెక్ చేస్తున్నాడు.

ఆ చివర్నుంచి ఈ చివరి వరకు డ్యూటీ పూర్తి చేసుకున్న కండక్టర్ ఓచక్కని విజిల్ వేసాడు.

ఆ ఈలగోలకి హారన్ మోగించి బస్ స్టార్ట్ చెయ్యాల్సిన డ్రైవర్ నిమిత్తమాత్రుడిలా తన సీట్లో కూచున్నాడు తప్ప కండక్టర్ విజిల్ కి కనీసమాత్రంగానైనా స్పందించలేదు. బస్సులో జనాలకు సహనం నశిస్తోంది. ఒకరిద్దరు కండక్టరి వత్తాసుగా 'రైట్..రైట్' అని అరిచారు...అయినా డ్రైవర్ లో స్పందన నిల్..మరో రెండు నిమిషాలు గడిచాయి. ప్రయాణీకులు బస్ ని కొడ్తూ చప్పుడు చేస్తున్నారు. ఇక ఈ గొడవ భరించలేని డ్రైవర్ ఎట్టకేలకు స్టార్ట్ చేసాడు. అయితే, యాక్సిలేటర్ మీద కాలు మోపలేదనే సంగతి

అందరికీ తెలుస్తూనే ఉంది.

బస్ నడిపేందుకు తాను సమాయుత్తుడై ఉన్నట్టు సంకేతాన్ని అందితున్నాడే తప్ప ఆ విధిని సంపూర్ణంగా అతగాడు నిర్వర్తించడం లేదు.

కారణం తెలుసుకోవాలనే ఆసక్తి అధికమౌతూండగా..ఇద్దరు లేడీస్ బస్ ఎక్కారు.

బస్సెక్కిన ఆ ఇద్దరిలో పాతికేళ్ళ సుందరి ఒకరూఅమె ఎక్కుతూనే డ్రైవర్ వైపు ఓ చూపు చూసి నెమ్మదిగా 'థాంక్స్' అంది. లిప్ స్టిక్      అధరాల సుందరి చెప్పిన కృతజ్ఞతలకి పొంగిపోయిన ఖాకీదుస్తుల చక్రధారి యాక్సిలేటర్ నేలకు తగిలేలా కాలితో తన్నాడు. ఆ పాతికేళ్ళ సుందరిలో కృష్ణతేజకి ఒకప్పటి అలివేలు మంగతాయారు కనిపిస్తోంది.

ఆ ఇద్దరిలో ఒకావిడ పెద్ద ఆంటీ కూడా. ఈ బస్ లోనే సురేష్, ఆనంద్ లు ఎక్కడున్నారని కృష్ణతేజ వెతుకుతూండగానే...వాళ్ళూ కనిపించారు. "హలో"అంటూ లేడీస్ ను పలకరిస్తూ ఆ సిటీ బస్ ముందుకు దూసుకు పోతూంటే కృష్ణతేజ పదేళ్ళ వెనకటి జ్ఞాపకాలు వెతుక్కుంటూ ప్రయాణిస్తున్నాడు. ఔను..జీవితమే ఓ జర్నీ. ఒక కలయిక..ఒక వీడ్కోలు...



ఆయనకు షష్టి పూర్తి. ఆ సందర్భంగా రుద్రాభిషేకమో, ఆయుష్షు హోమమో చేయిద్దాం అని పిల్లల వినతి. అది సుతారము ఆయనకు ఇష్టం లేదు. అదే పిల్లలకు చెప్పాడు. వాళ్ళ పోరు పడలేక, "ఓరేయ్ పిల్లలూ ఆ రోజు మీరంతా మా యింటికి రండి. ఒక్కొక్కరే కాదు, పిల్లా జెల్లా అందరూ రండి. కలివిడిగా అందరం ఆ రోజు కలిసి భోంచేద్దాం. పిల్లల ఆట పాటలతో ఇల్లంతా సందడిగా వుంటే అదే పెద్ద పండుగ కదూ! అన్నారు. షష్టి పూర్తి రానే వచ్చింది. కొడుకులూ, కోడళ్ళూ, మనవళ్ళూ, మనవరాళ్ళూ అందరూ వచ్చారు. అందరికీ విశ్వనాథం గారు బట్టలు పెట్టారు. "ఏవండీ, రేపు శుక్రవారం అయింది. కనీసం ఇంటి చుట్టూ వున్న ముత్తయిదువులను పిలిచి వాళ్ళకు తాంబూలాలు ఇచ్చి పంపుతానండీ" అని విశ్వనాథం గారి శ్రీమతి అడిగింది. "ఊఁ, సరే" అని అందుకు కావలసిన ఏర్పాట్లు అన్నీ ఘనంగానే చేసాడాయన, రమ సహాయంతో.

విశ్వనాథం గారింట ఆత్మీయత అనురాగాల కలబోసిన మమతల పండుగ ఆ రోజు. తృప్తిగా భోజన తాంబూలాలయ్యాయి. సాయంత్రం అవుతోంది. మమ్మల్ని ఐమాక్స్ కి తీసుకెళ్లమని పిల్లల గోల! విశ్వనాథం గారి పెద్దబ్బాయి ప్రసాద్, తమ్ముడు రవి మొత్తం పిల్లల్ని కాసేపు సరదాగా నెక్లెస్ రోడ్ లో తిప్పి వస్తామని కార్లలో తీసుకెళ్ళారు. ప్రసాద్ కూతురు సంధ్య మాత్రం – " నేను వెళ్ళనమ్మా, నీకు సాయం చేస్తానం"ది వాళ్ళమ్మ రమతో.

సత్యవతి, భానుమతి రమాదేవి ఆడపడుచులు. వాళ్ళిద్దరూ, "సంధ్యా! నువ్వూ వెళ్ళవే పిల్లలందరితో" అన్నా వినలేదు. "పేరంటాలంటే నాకూ ఇష్టం అత్తయ్యలూ.. పట్టు పరికిణీ కట్టుకోవద్దూ " అంది సొట్టలు పోతున్న బుగ్గలతో.

***

ప్రసాద్, రవి, సత్యా, భాను విశ్వనాథం గారి సంతానం. అందరివీ మంచి చదువులూ, ఉద్యోగాలూనూ. ప్రసాద్ ఏకంగా ఓ మందుల కంపెనీకి యజమాని. ప్రసాద్ భార్య రమ. రెండో కొడుకు రవి. రవి, రవి భార్యా ఇద్దరూ డాక్టర్లు. సత్యా, ఆమె భర్తా ఇద్దరూ కంప్యూటర్ ఇంజనీర్లే. భానుమతి, ఆమె భర్తా ఇద్దరూ కూడా. విశ్వనాథం కొడుకులూ, అల్లుళ్ళూ, కోడళ్ళూ, కూతుళ్ళూ, అందరూ హైదరాబాదు లోనే వుంటారు. అదీ విశ్వనాథం గారి అదృష్టం అంటే.

***

విశ్వనాథం గారింట్లో పేరంటం అంటే మాటలా! పాతికేళ్ళుగా అదే ఇంట్లో నివాసం ఆయే. ఆయన పిల్లల చదువుల నుండి వాళ్ళ పిల్లల పురుళ్ళు కూడా ఆ ఇంట్లోనే. ఆ కాలనీ లో తెలిని వారుండరు. ఎవరినీ విడవలేదు. భానూ, సత్యా అయితే ఏకంగా వాళ్ళ స్నేహితురాళ్ళనందరినీ కూడా పిలిచేసారు ఇదే సందర్భంగా.

సందడే సందడి. వచ్చిన వాళ్ళ నందరినీ పలకరించడం, చల్లటి పానీయాలూ, వండిన పలహారాలూ పెట్టడం, తాంబూలాలు ఇవ్వడం అన్నీ రమే చూసుకొంటోంది. సంధ్య వాళ్ళమ్మకి కాస్త ఉడతా సాయం చేస్తోంది.

“ఆడపడుచులు యింటికి అపుడపుడూ వచ్చిపోయేవాళ్ళు. వాళ్ళకేం ఎక్కువగా పనులు చెప్పకమ్మా..” ముందే హెచ్చరించింది అత్తగారు. రమ కాస్త కోరగా చూసింది. వాళ్ళూ నా వయస్కులేగా అని దాని భావం. “వాళ్ళిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. వారం అంతా అలసిపోయివుంటారు.” వెనకేసుకొచ్చింది ఆ పిల్లల కన్న తల్లి. పెద్దకోడలు రమకే పనులన్నీ. చిన్నకోడలు డాక్టరమ్మ ఆయె. రోగం రోష్టూ వస్తే వైద్యం చేసేది ఆమే గనుక ఆమెకు ఏదీ చెప్పే పనే లేదు.

విశ్వనాథం గారివద్ద చదువుకొన్న పిల్లల తల్లితండ్రులు చాలా మందే వున్నారు ఆ బజారులో. వారిలో కొందరు జంటలు గా కూడా విచ్చేశారు. విశ్వనాథం గారింటికి ద్వారాలకి అరటి చెట్లు ఇటూ అటూ కట్టారు. మామిడి తోరణాలతో అలంకరించారు. ఆ ఇంటి ముందు వేసిన చలువ పందిరికి కొబ్బరి మట్టలు కట్టారు. చెప్పద్దూ! ఆ సాయంత్రం వారింట తెలుగుదనం వెలిగి పోయిందంటే నమ్మండి. విశ్వనాథం గారు తెల్లటి లాల్చీ పంచె, కండువాలతో అచ్చు “సీతారామయ్య గారి మనుమరాలు” చిత్రం లో అక్కినేని లా నిండుగా వున్నారు. రమలో తెలుగుదనం ఉట్టిపడుతోంది. నీలకంఠం రంగు పట్టుచీరలో అచ్చరలా వుంది. సత్యవతి – స్నేహితురాళ్ళకి, సహోద్యోగులకి రమను పరిచయం చేసింది, “మా వదిన .. రమ” అని. ఆమె స్నేహితురాళ్ళు అందరూ హైటెక్ సిటి లో పని చేసే వాళ్ళు! అందరూ, “ఓకే,ఓకే, మీరేం చేస్తున్నారు” అని అడిగారు. చేతిలో వున్న పళ్ళెం పక్కన పెడుతూ, ..”నేను హౌస్ వైఫ్” చెప్పింది రమ. వాళ్ళు పేలవంగా ‘ఇంతేనా’ అన్నట్లుగా హేళనగా నవ్వి ముందు కెళ్ళారు. రమ ఇంటి పట్టునే వుంటుంది. తన భర్తకు, పిల్లలకూ, అత్తమామలకూ అందరికీ కావలసినవి సమకూరుస్తుంది. ఉద్యోగం చేయక పోవడం ఈ రోజుల్లో తప్పైనట్లు చూస్తున్నారేమిటో! రమ మనసు నొచ్చుకొనింది.

విశ్వనాథం గారు పిలిచి పనేదో చెబితే అటుగా వెళ్ళిపోయింది. యింతలో మనవళ్ళు, మనుమరాళ్ళు వచ్చేశారు. వాళ్ళకి కొబ్బరిఆకుతో పిప్పీ శబ్దం చేసే బూరలు ఎలా చేయాలో నేర్పిస్తున్నారు తాతగారు. అదో

పాతకాలం విద్య. పిల్లలు భలే ఆనందిస్తున్నారు.

భానుమతి చాలాకాలం తర్వాత స్నేహితురాళ్ళనందరినీ ఒక్కసారిగా కలవడం ఇదే! భాను స్నేహితురాళ్ళు సత్యాను చూసి చాలా రోజులే అయింది. సత్యాని, మిగిలిన కుటుంబ సభ్యులను అందరినీ పరిచయం చేస్తోంది. రమనూ పరిచయం చేసింది భాను. "మా పెద్దవదిన రమ... ప్రసాద్ అన్నయ్య భార్య" చెప్ప సాగింది.

"ఓహో. అలాగా. మీరు ఎక్కడ పనిచేస్తున్నారు" అడిగారు అందులో కొందరు. కొందరికి "హౌస్ వైఫ్" అనీ, "హోమ్ మేకర్" అనీ చెప్పింది. చెప్పడానికి ఇబ్బంది పండింది రమ. ఒకరికైతే సరే .. నలుగురూ ఒకేసారి అడగడం, వెనువెంటనే అదే సమాధానం చెప్పాల్సివచ్చేసరికి ఆమెలో అంతకు ముందు ఎన్నడూ లేని వెలితి తోచింది. నేను ఉద్యోగం చేయకపోవడం ఏదో తప్పుగా చూస్తున్నారేమిటి? ఉద్యోగం ఏమైనా స్త్రీ లక్షణమా? అంతే! ఆమెకే తెలియకుండా కొలుకుల్లో నీళ్లు చేరడం మొదలైంది. వచ్చిన వాళ్ళలో చాలా మంది జిన్సూ, షర్టు లూ వేసుకొన్న వాళ్ళున్నారు.

అంతా దూరం నుంచి గమనిస్తున్న విశ్వనాథం గారు అక్కడికి చేరుకొన్నారు. అందరికీ సగర్వంగా రమని మళ్ళీ పరిచయం చేశారు, ఆమెను చేరువగా తీసుకొని ఆశీర్వదిస్తూ.

"ఈమె నా పెద్దకోడలు రమ. ఏం.టెక్. లో బంగారు పతకం సాధించింది. సొంత వ్యాపారంలో తన భర్త నిత్యం తలమునకలై వుండడం చేత యింటి బాధ్యతలూ, అతని బాధ్యతలూ, వాళ్ళ పిల్లల శ్రేయస్సూ, మా సంక్షేమం అన్నీ స్వీకరించి సమర్ధవంతంగా, ఆనందంగా నిర్వర్తిస్తోంది. ఈ మాట చెప్పడానికి ఏంతో సంతోషిస్తున్నాను. " రమ వైపు చూస్తూ, "అమ్మా రమా! నువ్వు ఇక ఎప్పుడూ ఎవరికీ "హౌజ్ వైఫ్"ని అనీ, "హోమ్ మేకర్" అనీ చెప్పకు. ఆ పరాయి బాషా పదాలూ, వాళ్ళ బేషజాలూ మనకు దేనికి. "గృహిణి" అనీ, "గృహలక్ష్మి" అనీ సగర్వంగా చెప్పు. నీవు నిర్వర్తిస్తున్న ఈ విధులేవీ వాళ్ళు చేస్తున్న ఉద్యోగాల కంటే చిన్నదే కాదు. ఇదే అన్నిటికంటే పవిత్రమైనదీ, ప్రాముఖ్యమైనదీ!" అని చెప్పి వెళ్లిపోయారు విశ్వనాథం.

రమ కళ్ళలో సుళ్ళు తిరగబోయిన కన్నీళ్లు వెనక్కి వెళ్ళిపోయాయి ఆమె చెక్కిళ్ళ పై విరిసిన ఆనందపు దొంతరల మాటున!!!

************